ప్రభాతనవ
SINGIDI తెలుగు దినపత్రిక
# సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
singidinews.com
శనివారం 15 ఆగస్టు 2026 | సంపుటి: 1 సంచిక: 59 పేజీలు 12 వెల: 6.50
Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar

దేశ విభజనతో ఎన్నో జీవితాలు
## చిన్నాభిన్నం
పార్టిషన్ హారర్స్ రిమెంబరెన్స్ డే'పై మోడీ



**న్యూఢిల్లీ,ఆగస్ట్14 (సింగిడి):** దేశ విభజన ఎన్నో జీవితాలను చిన్నాభిన్నం చేసిందని ప్రధాని మోదీ అన్నారు. ఆ విభజన కారణంగా నష్టపోయిన బాధితుల ధైర్యాన్ని ప్రధాని కొనియాడారు. ప్రతి ఏటా స్వాతంత్య దినోత్సవానికి ముందు రోజున భారత ప్రభుత్వం 'పార్టిషన్ హారర్స్ రిమెంబరెన్స్ డే'ను నిర్వహిస్తోంది.

2



కరూరు బాధిత కుటుంబాలకు
## ఉద్యోగాలు
హైకోర్టు తీర్పుపై సుప్రీం కోర్టు స్టే విధింపు

2

# మారిన భారత్...
# '79 ఏళ్లు'
## ఆర్థిక శక్తిగా ఎదిగిన భారత్
## మారాల్సిన భారత్
### సాంకేతిక రంగంలో దూసుకెళ్లిన భారత్

**79 ఏళ్లు... ఒక దేశం తనను తాను తిరగరాసుకున్న ప్రయాణం! స్వాతంత్ర్యం వచ్చిన నాడు ఆకలి, పేదరికం, నిరక్షరాస్యతతో పోరాడిన భారత్... నేడు ప్రపంచ ఆర్థిక శక్తుల సరసన నిలిచింది. ఒకప్పుడు సాంకేతికత కోసం ప్రపంచం వైపు చూసిన దేశం... ఇప్పుడు యూపీఐతో ప్రపంచానికి డిజిటల్ దారి చూపిస్తోంది. ఒకప్పుడు ఆహారం కోసం ఎదురుచూసిన నేల... నేడు ఆహార భద్రతను సాధించింది. అంతరిక్షంలో చంద్రయాన్ విజయాల నుంచి... గ్రామీణ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలు, మెట్రోలు, డిజిటల్ సేవల వరకు... భారత్ తన సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటింది. 79 ఏళ్ల విజయాలను గర్వంగా చూసుకుంటూనే... 80వ ఏడాదిలో భారత్ సాధించాల్సిన లక్ష్యాలను నిర్దేశించుకోవాల్సిన సమయం ఇది!**

**- హైదరాబాద్ బ్యూరో (సింగిడి)**

అభివృద్ధి పెరిగినా... అసమానతలు ఇంకా ఉన్న భారత్.. ఉపాధి విద్య వైద్యంలో సవాళ్లు ఎదుర్కొంటున్న భారత్... సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం వెతుకుతున్న భారత్

### అభివృద్ధిలో దూసుకెళ్లాం

ఆర్థికంగా భారత్ ప్రపంచంలో కీలక శక్తిగా ఎదిగింది. ఒకప్పుడు ఆహార ధాన్యాల కోసం ఇతర దేశాలపై ఆధారపడిన దేశం... నేడు ఆహార భద్రత సాధించింది. రోడ్లు, రైల్వేలు, మెట్రోలు, ఎక్స్‌ప్రెస్‌వేలతో మౌలిక వసతులు విస్తరించాయి. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యంగా కొనసాగడం కూడా భారత బలమే.

### సాంకేతిక శక్తిగా ఎదిగాం

డిజిటల్ చెల్లింపుల్లో యూపీఐ ప్రపంచానికి భారత్‌ను పరిచయం చేసింది. చంద్రయాన్ వంటి అంతరిక్ష ప్రయోగాలు భారత శాస్త్రసాంకేతిక సామర్థ్యాన్ని చాటాయి. ఇంటర్నెట్, డిజిటల్ సేవలు సామాన్యుడి జీవితాన్ని మార్చాయి. ఈ పురోగతిని దేశంలోని ప్రతి గ్రామానికి, ప్రతి కుటుంబానికి సమానంగా చేర్చడం తదుపరి లక్ష్యంగా మారాలి.

### అసమానతలు ఇంకా తొలగలేదు

దేశ సంపద పెరుగుతున్నా... పేద–ధనిక మధ్య అంతరం కొనసాగుతోంది. యువతకు చదువుకు తగ్గ ఉద్యోగాలు దొరకడం ఇంకా సవాలే. కోర్టుల్లో కేసుల పరిష్కారానికి ఏళ్లు పడుతున్నాయి. మహిళలపై హింస, వేధింపులు పూర్తిగా తగ్గలేదు. విద్య, వైద్యం ఖరీదైన వ్యవస్థగా మారకుండా... సామాన్య



### సంపూర్ణ స్వాతంత్ర్యం ఎప్పుడంటే?

దేశం బలపడటం మాత్రమే కాదు... ప్రతి పౌరుడు బలపడినప్పుడే స్వాతంత్ర్యానికి సంపూర్ణ అర్థం వస్తుంది. పేదరికం తగ్గాలి, యువతకు ఉపాధి రావాలి, మహిళలు నిర్భయంగా జీవించాలి, వేగంగా న్యాయం అందాలి. రాజకీయాల్లో డబ్బు, కులం, మత ప్రభావం తగ్గి... ప్రజాసేవే ప్రధాన ప్రమాణంగా మారాలి. 79 ఏళ్లలో భారత్ ఎంతో సాధించింది. ఇక ముందు లక్ష్యం కేవలం ప్రపంచంలో పెద్ద ఆర్థిక శక్తిగా ఎదగడం కాదు... ప్రతి భారతీయుడి జీవన ప్రమాణాన్ని పెంచడం. అభివృద్ధి గణాంకాల్లో కనిపించడంతో పాటు... సామాన్యుడి జీవితంలో కనిపించినప్పుడే స్వాతంత్ర్యానికి నిజమైన అర్థం.



క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు
## భూకేటాయింపులు
### డిసెంబర్‌లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్



- ఇన్వెస్ట్ తెలంగాణ' థీమ్‌తో సమ్మిట్‌కు ప్లాన్
- ఘనంగా నేటి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం
- క్యూర్ పరిధిలో ఆటోలను ఇవిలుగా మార్చేందుకు పథకం
- స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి ఐటిఐలు, పాలిటెక్నికలు
- ఏడు రకాల సన్నాల సాగుకు ప్రోత్సాహం..ప్రచారం
- మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతలకు రూ. 2,100 కోట్ల అంచనా
- తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయాలకు ఆమోదం

రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0' నిర్వహణకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాబోయే డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఈ ప్రతిష్టాత్మక సమ్మిట్‌ను గతేడాది కంటే మరింత ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈసారి ప్రత్యేకంగా 'ఇన్వెస్ట్ తెలంగాణ' అనే థీమ్‌తో ఈ సమ్మిట్‌ను ప్లాన్ చేస్తున్నారు. అంతేకాకుండా, తెలంగాణలో ఇప్పటివరకు స్టార్టప్‌లు సాధించిన విజయాలు, సాధించిన పురోగతిని ప్రపంచానికి చాటిచెప్పేలా సమ్మిట్ ప్రాంగణంలో ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేయాలని మంత్రివర్గం తీర్మానించింది.

**- హైదరాబాద్,ఆగస్ట్14 (సింగిడి)**

2

## ఇకనుంచి స్మార్ట్ రేషన్ కార్డులు



**ట్యాంపరింగ్‌కు అవకాశం లేకుండా ఏర్పాటు**

**నేడు సంగారెడ్డిలో సిఎం చేతుల మీదుగా విడుదల**

## రాజ్యాంగాన్ని గౌరవించుకోవాలి
**వికసిత్ భారత్ లక్ష్యంగా ముందుకు సాగాలి**
**జాతిని ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం**

2

## ఎర్రకోటకు బాంబు పేలుళ్ల హెచ్చరికలు
### అప్రమత్తం అయిన భద్రతా బలగాలు

దేశ రాజధాని రేపటి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సిద్ధమవుతోన్న వేళ, ఢిల్లీలో తీవ్ర కలకలం రేగింది. ఢిల్లీ హైకోర్టుకు వచ్చిన ఒక బెదిరింపు ఈ–మెయిల్ భద్రతా దళాలను, పోలీసులను ఉలిక్కిపడేలా చేసింది. ఎర్రకోట వద్ద ప్రధాని నరేంద్ర మోదీ జాతిని ఉద్దేశించి ప్రసంగించే సమయంలోనే దాడులకు పాల్పడతామని ఆగంతకులు ఆ మెయిల్‌లో హెచ్చరించడం సంచలనంగా మారింది. ఆగస్టు 15న ఎర్రకోట లక్ష్యంగా బాంబు పేలుళ్లకు పాల్పడతామని మెయిల్‌లో పేర్కొన్నారు. ఉగ్రవాదులు లేదా అసాంఘిక శక్తులు పోలీసు యూనిఫామ్‌లో ఎర్రకోట ప్రాంగణంలోకి ప్రవేశించి ఈ దాడులకు పాల్పడే అవకాశం ఉందని వెల్లడించారు.

**న్యూఢిల్లీ,ఆగస్ట్14 (సింగిడి):**

2






జనగణన-2027పై కేంద్ర హోంశాఖ
## కీలక నోటిఫికేషన్
**40 ప్రశ్నలతో కూడిన జాబితాను నోటిఫై చేసిన కేంద్రం**

దేశవ్యాప్తంగా చేపట్టనున్న 'జనగణన–2027'పై కేంద్ర హోంశాఖ కీలక నోటిఫికేషన్ విడుదల చేసింది. స్వాతంత్ర్యం అనంతరం తొలిసారిగా సమగ్ర కుల గణన చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది.

**న్యూఢిల్లీ,ఆగస్టు14 (సింగిడి)**

2

తెలంగాణ పోలీసు శాఖకు
## అరుదైన గౌరవం
### పోలీసు శాఖకు మొత్తం 15 రాష్ట్రపతి పతకాలు




2

**హైదరాబాద్,ఆగస్ట్14 (సింగిడి):** తెలంగాణ పోలీసు శాఖకు అరుదైన గౌరవం దక్కింది. 2026 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర పోలీసు శాఖకు మొత్తం 15 రాష్ట్రపతి పతకాలు ప్రకటించారు. విధి నిర్వహణలో చూపిన ధైర్యసాహసాలు, అంకితభావం, విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ పతకాలను ప్రకటించారు. ఇందులో 3 గ్యాలంట్రీ మెడల్స్, 2 విశిష్ట సేవా పతకాలు, 10 ప్రతిభావంతమైన సేవా పతకాలు ఉన్నాయి. వీరత్వానికి ప్రతీకగా అందించే గ్యాలంట్రీ మెడల్స్‌కు తెలంగాణకు చెందిన ముగ్గురు జూనియర్ కమాండోలు ఎంపికయ్యారు.

స్మార్ట్ రేషన్ కార్డులపై
## మోడీ ఫోటో పెట్టాలి
**అన్ని సరుకులను ప్రజలకు ఇవ్వాలి**
**బిజెపి ఎంపి రఘునందన్ రావు డిమాండ్**

2


**న్యూఢిల్లీ,ఆగస్టు14 (సింగిడి):** తెలంగాణ ప్రభుత్వం జారీ చేసే స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధాని నరేంద్ర మోదీ ఫొటో లేకపోవడంపై బీజేపీ ఎంపీ రఘునందన్ రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ ఫొటో కచ్చితంగా పెట్టాల్సిందేనని డిమాండ్ చేశారు.

సిఎం కనుసన్నల్లో
## నిషేధిత జాబితా
**బిజెపి ఎంపి ఈటెల రాజేందర్ విమర్శ**



**హైదరాబాద్,ఆగస్ట్14 (సింగిడి):** తెలంగాణలోని పలువురు ఐఏఎస్ అధికారులపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డైరెక్షన్‌లో భాగంగా కొంతమంది ఐఏఎస్ ఆఫీసర్లు ఉద్దేశపూర్వకంగా భూములను నిషేధిత జాబితాలో పెడుతున్నారని ఆరోపించారు.

## నిరసన తెలిపే హక్కు విద్యార్థులకు ఉంది




### నల్సార్ ఘటనపై బిసిఐ జోక్యం సరికాదు
**సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్**

నిరసన తెలిపే హక్కు విద్యార్థులకు ఉందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. నల్సార్ నుంచి 2026లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన విద్యార్థులపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను ఆదేశించారు. అది తనకు, విద్యార్థులకు మధ్య సమస్య అని, బీసీఐ జోక్యం ఎందుకు చేసుకుందని అసహనం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని నల్సార్ లా యూనివర్సిటీ స్నాతకోత్సవానికి సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌ను పిలవొద్దంటూ అక్కడి విద్యార్థులు లేఖ రాసినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. వారిపై బీసీఐ ఆగ్రహం వ్యక్తంచేసింది.

**న్యూఢిల్లీ,ఆగస్ట్14 (సింగిడి)**

2

# విద్యా వ్యవస్థ
# సమూలంగా ప్రక్షాళన
### చదువుతోనే ఆత్మగౌరవం, గుర్తింపు

2

- నర్సరీ నుంచి బ్రేకఫాస్ట్‌తో పాటు అన్ని సదుపాయాలు
- కులరహితంగా అందరికీ ఒకే విద్యకోసం కృషి
- గత ప్రభుత్వం కుల విద్యల పేరుతో విద్యకు దూరం చేసింది
- పూలే దంపతుల విగ్రహావిష్కరణ సభలో సిఎం రేవంత్

చదువుతోనే ఆత్మగౌరవం, గుర్తింపు లభిస్తాయని, విద్య ఒక్కటే తలరాతలను మార్చే మార్గమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. 150 ఏళ్ల క్రితమే జ్యోతిబా పూలే చదువే ఏకైక మార్గమని చాటిచెప్పారని, తాను చదువుకోవడంతో పాటు తన సతీమణి సావిత్రిబాయి పూలేను చదివించి ఆదర్శంగా నిలిచారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. శుక్రవారం నెక్లెస్ రోడ్డులో మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రి బాయి పూలే దంపతుల విగ్రహాలను సీఎం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఒకవైపు డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మరోవైపు ఇందిరాగాంధీ, పీవీ నరసింహారావు, జ్యోతిబా పూలే విగ్రహాలను ఆవిష్కరించుకోవడం గర్వకారణమని రేవంత్ పేర్కొన్నారు. నెక్లెస్ రోడ్ చౌరస్తా ఇపుడు అద్భుతంగా మారిందని చెప్పారు.

**హైదరాబాద్,ఆగస్ట్14 (సింగిడి)**



ప్రభాతనవ
సింగిడి
తెలుగు దినపత్రిక
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
శనివారం
15 ఆగస్టు 2026

## రాజ్యాంగాన్ని గౌరవించుకోవాలి

**న్యూఢిల్లీ,ఆగస్ట్14 (సింగిడి):**

భారత రాజ్యాంగాన్ని మనం గౌరవించాలని, వికసిత్ భారత్ లక్ష్యంగా అందరూ పని చేయాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సందేశమిచ్చారు. అభివృద్ధి ఫలాలు దేశంలోని ప్రతి ఒక్కరికీ అందాలని ఆమె ఆకాంక్షించారు. అంతేకాదు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలను మనం గుర్తుంచుకోవాలని రాష్ట్రపతి తన సందేశంలో పేర్కొన్నారు. తెల్లారితే ఎనభయో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలతో యవాత్ భారతావని పులకించనుంది. ఈ చరిత్రాత్మక రోజును పునస్కరించుకొని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జాతినుద్దేశించి ప్రసంగించారు. రాజ్యాంగాన్ని గౌరవించాలని సూచించిన ఆమె.. న్యాయ వ్యవస్థను, చట్టసభలను మనం గౌరవించాలని ప్రజలకు సందేశమిచ్చారు. తాజాగా లోకసేభ్‌లో మొట్టమొదటిసారిగా ఆలపించిన వందేమాతరం గీతాన్ని పౌరులంతా గౌరవించాలని ఈ సందర్భంగా రాష్ట్రపతి కోరారు. వికసిత్ భారత్–2047 లక్ష్యంగా అందరూ పనిచేయాలని రాష్ట్రపతి ద్రౌపదీముర్ము పిలుపునిచ్చారు. క్లిష్ట పరిస్థితుల్లోనూ భారత్ బలమైన ఆర్థిక వ్యవస్థగా నిలిచిందని చెప్పారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతినుద్దేశించి రాష్ట్రపతి ప్రసంగించారు. దేశానికి రాజ్యాంగమే దిక్సూచి అని.. దాన్ని గౌరవించాలని కోరారు. 'జన్‌ధన్ ద్వారా దేశవ్యాప్తంగా 59 కోట్ల మందికి బ్యాంకు ఖాతాలు అందించాం. 80 కోట్ల మందికి రేషన్ సరకులు అందజేస్తున్నాం. ఆయుష్మాన్ భారత్ ద్వారా 60 కోట్ల మందికి వైద్యసేవలు అందుతున్నాయి. కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా వ్యవసాయం, అనుబంధ రంగాలు బలోపేతమయ్యాయి. సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేస్తూ ముందుకు సాగాలి. ప్రపంచంలోనే అతిపెద్ద డిజిటల్ మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసుకున్నాం. కుగ్రామాల్లోనూ డిజిటల్ చెల్లింపులు చేస్తున్నారు. ప్రపంచంలోనే అత్యధిక డిజిటల్ లావాదేవీలు మనదేశంలోనే జరుగుతున్నాయి' అని రాష్ట్రపతి పేర్కొన్నారు.

## దేశ విభజనతో ఎన్నో జీవితాలు చిన్నాభిన్నం

దేశ విభజన, సామూహిక వలసల అనంతరం జరిగిన అల్లర్లలో ప్రాణాలు కోల్పోయిన వారికి గుర్తుగా 2021 నుంచి కేంద్రం దీనిని పాటిస్తోంది. ఈ విభజన ఎన్నో జీవితాలను చిన్నాభిన్నం చేసింది. ఎన్నో కుటుంబాలు చెల్లాచెదురయ్యాయి. నాడు విభజన గాయాల బాధితులు ప్రియమైన వారిని కోల్పోయారు. అంతులేని బాధను అనుభవించారు. అంతటి భయానక పరిస్థితుల నుంచి ప్రజలు తమ జీవితాలను పునర్నిర్మించుకున్నారు. ప్రతికూలతలను విజయంగా మార్చుకున్నారు. దేశ ప్రగతికి దోహదపడ్డారు. సామరస్యం, సౌభ్రాతృత్వాన్ని పరిరక్షించడానికి, వికసిత్ భారత్ నిర్మాణానికి సమష్టిగా కృషిచేసేలా వారి జీవితాలు మనందరికి స్ఫూర్తినిస్తాయని మోదీ పేర్కొన్నారు.

## తెలంగాణ పోలీసు శాఖకు అరుదైన గౌరవం

**హైదరాబాద్,ఆగస్ట్14 (సింగిడి):**

బి. సత్యా రావు, కే. సందీప్ కుమార్, జే. వంశీకృష్ణ ఈ పతకాలను అందుకోనున్నారు. విధి నిర్వహణలో ప్రదర్శించిన ధైర్యసాహసాలు, అసాధారణ తెగువకు గుర్తింపుగా వీరికి ఈ పురస్కారం దక్కింది. దీర్ఘకాలంగా అత్యుత్తమ సేవలు అందించిన పోలీసు సిబ్బందికి ఇచ్చే విశిష్ట సేవా పతకాల విభాగంలో తెలంగాణ నుంచి ఇద్దరిని ఎంపిక చేశారు. విధి నిర్వహణలో నిబద్ధత, సమర్థత, సేవా ప్రస్థానాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు.ఇక పోలీసు విధుల్లో ప్రతిభ, అంకితభావం, నిరంతర సేవలను గుర్తిస్తూ మరో 10 మందికి మెరిటోరియస్ సర్వీస్ మెడల్స్ ప్రకటించారు. దీంతో తెలంగాణ పోలీసు శాఖకు ఈసారి మొత్తం 15 పతకాలు దక్కాయి. ప్రతి ఏడాది స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం సందర్భంగా పోలీసు, అగ్నిమాపక, హోంగార్డ్స్, పౌర రక్షణ, కారాగార సేవల సిబ్బందికి కేంద్ర ప్రభుత్వం వివిధ విభాగాల్లో పతకాలను ప్రకటిస్తుంది. వీరత్వానికి గ్యాలంట్రీ మెడల్, అత్యుత్తమ దీర్ఘకాల సేవలకు విశిష్ట సేవా పతకం, ప్రతిభావంతమైన సేవలకు మెరిటోరియస్ సర్వీస్ మెడల్ అందిస్తారు.

## కరూరు బాధిత కుటుంబాలకు ఉద్యోగాలు

### హైకోర్టు తీర్పుపై సుప్రీం కోర్టు స్టే విధింపు

**న్యూఢిల్లీ,ఆగస్ట్14 (సింగిడి):**

కరూర్ తొక్కిసలాటలో మృతుల కుటుంబసభ్యులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వడాన్ని రద్దు చేస్తూ గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీం కోర్టు తాజాగా స్టే విధించింది. దీంతో, తమిళనాడు సీఎం విజరుకు స్వల్ప ఊరట లభించినట్లయ్యింది. ఈ కేసులో జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ కే వినోద్‌లతో కూడిన ధర్మాసనం పలు కీలక వ్యాఖ్యలు చేసింది. బాధితులకు నగదు రూపంలో సాయం చేస్తే అభ్యంతరం చెప్పే వారా అని పిటిషనర్లను ప్రశ్నించింది. కుటుంబంలోని సంపాదన పరుడైన ఒకే ఒక వ్యక్తి మరణిస్తే కుటుంబసభ్యుల్లో ఎవరోకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వడానికి అభ్యంతరం చెబుతారా ప్రభుత్వ విధానాన్ని ప్రశ్నించేందుకు మీరెవరు అని ప్రశ్నించింది. గతేడాది టీవీకే ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో తొక్కిసలాటలో పలువురు మరణించిన విషయం తెలిసిందే. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన టీవీకే అధినేత విజరు మృతుల కుటుంబసభ్యులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తూ జీవో జారీ చేశారు. అయితే, ఈ జీవోను జులై 27న హైకోర్టు కొట్టేసింది. ఆర్టికల్ 14, 15ను ప్రభుత్వ జీవో ఉల్లంఘిస్తోందని అభిప్రాయపడింది. ప్రతి ప్రభుత్వ విభాగంలో కారుణ్య నియామకాలు ఆశిస్తున్న వారు ఎందరో ఉంటారని ఈ సందర్భంగా హైకోర్టు అభిప్రాయపడింది. వారి అవసరాలను పక్కన పెట్టి కరూర్ తొక్కిసలాట బాధితులకు ప్రభుత్వ ఉద్యోగాలు ముందుగా ఇవ్వడం సబబు కాదని పేర్కొంది. ఆర్టికల్ 162 ప్రకారం ఈ జీఓ జారీ చేశామన్న ప్రభుత్వ వాదనను సైతం కోర్టు తోసిపుచ్చింది.

# క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు భూకేటాయింపులు

తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ముగిసింది. ఈ కేబినెట్ భేటీలో రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించి పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. వివరాలను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మరోమంత్రి అడ్లూరి లకణ్‌తో కలసి మీడియాకు వివరించారు. ఎంపి రఘురామిరెడ్డి కూడా మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ముఖ్యంగా హైదరాబాద్, గ్రేటర్ పరిధిలోని సిటిజన్స్ అర్బన్ రీస్ట్రక్చరింగ్ అండ్ ఎకానమీ ప్రాజెక్ట పరిధిలో నిర్మించతలపెట్టిన ఇందిరమ్మ ఇళ్లకు భూకేటాయింపులు చేస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. అర్హులైన పేద, మధ్యతరగతి వర్గాలకు సొంతింటి కలను నెరవేర్చేందుకు స్థలాల కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించింది. ఇకపోతే గ్లోబల్ సదస్సు నిర్వహణకు ప్రత్యేక కమిటీలను కేబినెట్ ఏర్పాటు చేయనుంది. గత ఏడాది కంటే ఘనంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. ఈసారి 'ఇన్వెస్ట్ తెలంగాణ' థీమ్‌తో ఈ సదస్సు నిర్వహించనుంది. ఫ్యూచర్ సిటీ ప్లాన్‌ను ప్రజలకు వివరించనుంది. తెలంగాణలో డిఫెన్స్, ఏరో స్పేస్, ఫార్మాతో పాటు వివిధ రంగాల్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేలా సదస్సు నిర్వహించనుంది. వివిధ రంగాల్లో తెలంగాణ స్టార్టప్, పరిశ్రమలు సాధించిన విజయాలు.. వివిధ రంగాల కొత్త ఆవిష్కరణల ప్రదర్శన ఏర్పాటు చేయాలని ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర సచివాలయంలో మూడు గంటలపాటు జరిగిన ఈ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. గత ఏడాది కంటే ఘనంగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0 నిర్వహించాలని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించారు. స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. క్యూర్ పరిధిలోని ఆటోలను ఈవీలుగా మార్చేందుకు ప్రత్యేక పథకం అమలు చేయనున్నారు. స్వాతంత్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. దీనికి సంబంధించి అన్ని జిల్లాల్లో ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. గతంలో రాష్ట్రంలో 2.81కోట్ల మంది రేషన్‌కార్డు లబ్దిదారులుండగా.. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్తగా 62 లక్షల రేషన్ కార్డులను జారీ చేసిందని తెలిపారు. దీంతో ఆ సంఖ్య 3.42 కోట్లకు చేరిందన్నారు. ఈ ఏడాది డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో గ్లోబల్ సమ్మిట్ నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, వివేక వెంకటస్వామి ఆధ్వర్యంలో సబ్ కమిటీతో పాటు సదస్సు నిర్వహణకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు చెప్పారు. గత ఏడాది తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌ను ఆవిష్కరించినట్లే.. ఈసారి 'ఇన్వెస్ట్ తెలంగాణ' థీమ్‌తో సదస్సు నిర్వహణకు ఆమోదం తెలిపిందన్నారు. ఈ సందర్భంగా ఫ్యూచర్ సిటీ ప్లాన్ ఆవిష్కరించన్నట్లు చెప్పారు. ప్రధానంగా రాష్ట్రంలో డిఫెన్స్, ఏరో స్పేస్, ఫార్మా రంగాల్లో పరిశ్రమలు, పెట్టుబడులకు ఉన్న అపారమైన అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేలా ఈసారి సదస్సు జరుగుతుందన్నారు. వివిధ రంగాల్లో ఇప్పటికే తెలంగాణ స్టార్టప్‌లు, పరిశ్రమలు సాధించిన విజయాలు.. వివిధ రంగాల కొత్త ఆవిష్కరణలకు సంబంధించి ఎగ్జిబిషన్, స్టాళ్లను ఏర్పాటు చేయాలని క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి చెప్పారు. వానాకాలం పంటకు సంబంధించి ఏడు రకాల సన్న ధాన్యం సాగును ప్రోత్సహించి, వాటి సాగును పెంచేందుకు రైతులకు అవగాహన కల్పించాలని క్యాబినెట్ నిర్ణయించింది. రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీ భవనాలు, రైతు వేదికల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది నుంచి ఈ ఏడు రకాల సన్నాలకే రూ.500 బోనస్ చెల్లించాలని మంత్రివర్గం తీర్మానించింది. రాష్ట్రంలోని ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కాలేజీలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావడానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కళాశాలలు సాంకేతిక విద్యా శాఖ పరిధిలో ఉన్నాయి. వీటిని తెలంగాణ ఎడ్యుకేషన్ యాక్ట నుంచి తొలగించి యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలో చేర్చేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఆదిలాబాద్, నిర్మల్, ముథోల్, బోథ్, సిర్పూర్, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్రంలో తొలివిడతగా 113 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్స్ స్కూల్ కాంప్లెక్సులు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈరోజు కొత్తగా ఆమోదించిన 7 స్కూళ్లతో కలిపి ఇప్పటివరకు 86 స్కూల్ కాంప్లెక్సలకు అనుమతులు మంజూరయ్యాయి. మిగిలిన నియోజక వర్గాల్లోనూ వీలైనంత త్వరగా స్థల సేకరణ చేసి నిర్మాణాలు చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలో కాలుష్యాన్ని నియంత్రించి హైదరాబాద్‌ను గ్రీన్ సిటీగా మార్చేందుకు రాష్ట్ర మంత్రివర్గం మరో కీలక నిర్ణయం తీసుకుంది. క్యూర్ పరిధిలో నగరంలో ప్రస్తుతం 18,766 పెట్రోల్, డీజిల్ ఆటోలున్నాయి. వీటిని విద్యుత్తు వాహనాలుగా మార్చేందుకు రూ.200 కోట్లతో ప్రత్యేక పథకం అమలుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ పథకం కింద అర్హులైన ఆటో డ్రైవర్లకు ఒక్కో వాహనానికి గరిష్ఠంగా రూ.1.50లక్షల సబ్సిడీ అందించాలని క్యాబినెట్ నిర్ణయించింది. హైదరాబాద్ సిటీ పరిధిలో ఉన్న కాలుష్య కారక పరిశ్రమలను సిటీ శివార్లకు తరలించేందుకు ఉద్దేశించిన హిల్ట్ పాలసీ దరఖాస్తుల గడువును మరో 3 నెలలు పొడిగించేందుకు మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. దరఖాస్తుదారుల విజ్ఞప్తుల మేరకు అక్టోబర్ 31 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. మక్తల్–నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల ఫేజ్–2 పనుల కోసం రూ. 2,100 కోట్ల అంచనా వ్యయానికి రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. దీంతో దాదాపు లక్ష ఎకరాలకు సాగు నీరు, ఆ ప్రాంతంలో తాగు నీరు, పారిశ్రామిక అవసరాలకు ఈ ఎత్తిపోతల నుంచి అందనుంది. గూడెం దొడ్డి పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు సామర్థ్యాన్ని 1.19 టీఎంసీ నుంచి 15 టీఎంసీలకు పెంచటంతో పాటు సోలార్ విద్యుత్ ఉత్పత్తిపై అధ్యయనం చేసేందుకు కన్సల్టెంట్ నియామకానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

# ఇకనుంచి స్మార్ట్ రేషన్ కార్డులు

### ట్యాంపరింగ్‌కు అవకాశం లేకుండా ఏర్పాటు

### నేడు సంగారెడ్డిలో సిఎం చేతుల మీదుగా విడుదల

**సంగారెడ్డి,ఆగస్ట్14 (సింగిడి):**

ప్రజా పంపిణీ వ్యవస్థ మరింత స్మార్ట్‌గా మారుతోంది. తెలంగాణ ఆవిర్భావం తర్వాత రేషన్ కార్డులను పంపిణీ చేస్తామంటూ ఊరిస్తూ వచ్చారు. సంగారెడ్డిలో శనివారం పంద్రాగస్ట్ పురస్కరించుకుని సిఎం రేవంత్ రెడ్డి స్మార్ట్ కార్డును పంపిణీ చేయనున్నారు. అదేరోజు రాష్ట్రవ్యాప్తంగా మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు కార్డులు అందచేయనున్నారు. సంగారెడ్డిలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నారు. స్థాని కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి దగ్గరుండి ఏర్పాట్లు పరిశీలించారు. 12 ఏళ్లకు పైగా జిరాక్స కాగితాలే లబ్దిదారులకు రేషన్ కార్డులుగా ఉపయోగపడుతూ వచ్చాయి. జిరాక్స కాగితాలు చినిగిపోతూ ఇబ్బంది పడుతున్న లబ్దిదారులు రేషన్‌కార్డులు ఎప్పుడెప్పుడాని ఎదురుచూస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం పంద్రాగస్టు రోజు నుంచి సరి కొత్త హంగులతో పీవీసీ స్మార్ట్ రేషన్ కార్డులను అందించడానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటికే ముద్రణ పూర్తి చేసు కున్న స్మార్ట్ రేషన్ కార్డులు సిద్ధంగా ఉంచారు. స్వాతంత్య దినోత్సవం రోజున సంగారెడ్డిలో లాంఛనంగా ప్రారం భించిన వెంటనే లబ్దిదారులకు పంపిణీ చేసేందుకు పౌరసరఫరాల శాఖ అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. గతంలో దారిద్య రేఖకు దిగువ ఉన్నవారికి తెలుపు రంగు కార్డులు, ఎగువనున్నవారికి గులాబీ రంగు కార్డులు ఉండేవి. గులాబీ రంగు కార్డుదారులకు బియ్యం మినహా ఇతర సరుకులు పంపిణీ చేసేవారు. రేషన్ దుకాణాల ద్వారా బియ్యం పంపిణీకి పరిమితం కావడంతో గత ప్రభుత్వం గులాబీ కార్డులను రద్దు చేసింది.ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత పారదర్శకంగా, ఆధునికంగా మార్చే దిశగా ఎలాంటి ట్యాంపరింగ్ చేయడానికి వీలులేని విధంగా ఏటీఎం, పాన్‌కార్డు మాదిరిగా డిజిటలైజేషన్, స్మార్ట్ టెక్నాలజీ ఆధారితంగా పంపిణీ చేసే పీవీసీ కార్డు, చిప్, బార్‌కోడ్, డిజిటల్ వెరిఫికేషన్ వంటి టెక్నాల జీతో స్మార్ట్ రేషన్‌కార్డులు ముద్రించారు. కార్డు స్కాన్ చేయడంతో అందులో ఉన్న కుటుంబ సభ్యులకు పూర్తి సమాచారం వస్తుంది. ఆధునిక భద్రతా ఫీచ ర్లను పొందుపరచి స్మార్ట్ కార్డులు లబ్దిదారులను ఆగస్టు 15 స్వాతంత్య దినోత్సవం రోజు నుంచి లబ్దిదారులకు చేరనున్నాయి. ప్రభుత్వం ఇప్పటికే రేషన్ సరుకులు బయోమెట్రిక ద్వారా రేషన్ దుకాణాల్లో ఎక్కడైనా సరుకులు పొందే అవకాశం ఉంది. అయితే కొన్ని ప్రాంతాల్లో లబ్దిదా రులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపణలు వస్తున్నాయి. స్మార్ట్ కార్డు ద్వారా రాష్ట్రంలోని ఏ రేషన్ దుకాణంలోనైనా సరుకులు పొందడానికి సులువుగా మారుతుంది. క్యూఆర్ కోడ్ ఉండడంతో కార్డులు డూప్లికేట్ కాకుండా ఉంటుంది. జిల్లాల్లో ప్రస్తుతం రేషన్‌కార్డు కలిగిన లబ్దిదారులందరికీ స్మార్ట్ కార్డులను రేషన్ షాప్‌లో పాత కార్డు చూపించి స్మార్ట్ కార్డును పొందవచ్చు. అంతే కాకుండా టీఎస్‌ఈపాస్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని కూడా స్మార్ట్ కార్డు తీసుకునే వీలు కల్పిస్తున్నారు. కొత్తగా అందించే స్మార్ట్ రేషన్ కార్డులు ముందు భాగంలో కుటుంబ యజమాని ఫొటో, రేషన్ కార్డు నంబర్, రేషన్ దుకాణం నంబర్ ముద్రిస్తారు. కార్డు వెనకవైపు కుటుంబ సభ్యుల వివరాల తో పాటు ఇతర అవసరమైన సమాచారాన్ని పొందుపరిచారు



జనగణన-2027పై కేంద్ర హోంశాఖ

## కీలక నోటిఫికేషన్

జనగణనలో పౌరులను అడిగే 40 ప్రశ్నలతో కూడిన జాబితాను రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా నోటిఫై చేసింది. జనగణన ప్రశ్నావళిలోని 10వ ప్రశ్నగా ఎస్సీ, ఎస్టీ, కులానికి సంబంధించిన వివరాలను నమోదు చేసేందుకు ప్రత్యేక అవకాశం కల్పించారు. దేశంలోనే తొలిసారిగా యాప్‌లు, డిజిటల్ సాధనాల ద్వారా జనాభా లెక్కల సేకరణ చేపట్టనున్నారు. 15 రోజుల పాటు స్వయంగా వివరాలను నమోదు చేసుకునే అవకాశాన్ని కల్పించనున్నారు. రూ.11,718.24 కోట్ల అంచనా వ్యయంతో జనగణన–2027ను రెండు దశల్లో నిర్వహించనున్నారు. తొలి దశలో 2026 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ మధ్య గృహాల నమోదు, వసతులకు సంబంధించిన వివరాల సేకరణ చేపట్టనున్నారు. రెండో దశలో 2027 ఫిబ్రవరిలో జనాభా, విద్య, ఉపాధి, కులానికి సంబంధించిన వివరాల సేకరణ ప్రక్రియను పూర్తి చేయనున్నారు. జనగణనలో పౌరులు అందించే వ్యక్తిగత వివరాలకు చట్టపరమైన రక్షణ కల్పించారు. సెన్సస్ యాక్ట, 1948లోని సెక్షన్ 15 ప్రకారం పౌరుల వ్యక్తిగత సమాచారానికి పూర్తి చట్టబద్ధ రహస్య రక్షణ ఉంటుంది.

## సిఎం కనుసన్నల్లో నిషేధిత జాబితా

ముఖ్యమంత్రి నుంచి లేదా అయనకు సంబంధించిన వారి నుంచి క్లారిఫికేషన్ వచ్చిన తరువాత వాటిని క్లియర్ చేస్తున్నారని చెప్పుకొచ్చారు. ఇది నేరుగా సీఎం కనుసన్నల్లోనే జరుగుతోందని ఆరోపణలు గుప్పించారు. భూముల విలువ ఎక్కువగా ఉన్నచోట ఈ తరహా దందా నడుస్తోందని ఎంపీ వ్యాఖ్యానించారు. ఇది కేవలం బాధితుల నుంచి డబ్బులు వసూలు చేయడంలో భాగమే అని అన్నారు. బాధితులు కాళ్లు అరిగేలా కలెక్టర్ కార్యాలయాలు, సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌ల చుట్టూ తిరుగుతున్నారని ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు.

## పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటికి ప్రాధాన్యత

### వాటర్ మూమెంట్ ప్లాన్ ప్రకారమే నీటి నిర్వహణ

### జలవనరుల శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**అమరావతి, ఆగస్టు 14**

రాష్ట్రంలో వాటర్ మూమెంట్ ప్లాన్ ప్రకారమే నీటి నిర్వహణ చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి అవసరాలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రస్తుతం లోటు వర్షపాతం పరిస్థితుల నేపథ్యంలో రిజర్వాయర్లు, చెరువుల్లో నీటి నిల్వల్ని, భూగర్భ జలాలను సద్వినియోగం చేసుకునేలా కార్యాచరణ ఉండాలని సూచించారు. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం జల వనరుల శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. పోలవరం, వెలిగొండ ప్రాజెక్టు పనుల పురోగతి, ప్రాధాన్యతా క్రమంలో చేపట్టనున్న 36 ప్రాజెక్టులు, రాష్ట్రంలోని రిజర్వాయర్లలో నీటి నిల్వలు, నీటి విడుదల, తాగు నీటి సరఫరా నిర్వహణ ప్రణాళిక, జలధార– జలహారతి కార్యక్రమాల అమలుపై సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు. పోలవరం ప్రాజెక్టులో ఇప్పటి వరకూ 89.9 శాతం మేర సివిల్ పనులు పూర్తి అయ్యాయని అధికారులు వివరించారు. పోలవరం ఎడమ కాలువ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తున్నట్టు జల వనరుల శాఖ సీఎంకు తెలియచేసింది. ఈసీఆర్‌ఎఫ్ గ్యాప్ 1, గ్యాప్ 2 పనులు శర వేగంగా చేపట్టామని వివరించారు. ఇటీవల 14 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహాలు గోదావరికి వచ్చినా ప్రాజెక్టు పనులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కొనసాగించినట్టు తెలిపారు. డ్యామ్ సైట్ వద్ద రహదారులతో పాటు డ్యామ్ నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాల పనులు కూడా చేపట్టాలని సీఎం సూచించారు




## ఎర్రకోటకు బాంబు పేలుళ్ల హెచ్చరికలు

దేశ ప్రధాని స్వాతంత్య్ర దినోత్సవ సందేశమిచ్చే అత్యంత కీలక సమయంలోనే ఈ పేలుళ్లు జరుపుతామని సవాలు విసిరారు. 1984లో జరిగిన సిక్కు వ్యతిరేక హింసాకాండకు బాధ్యులైన రాజకీయ నేతలపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఈ తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని డిమాండ్ చేశారు. బెదిరింపు ఈ–మెయిల్ రాగానే ఢిల్లీ పోలీసులు, బాంబ్ స్క్వాడ్, ఇంటెలిజెన్స్ వర్గాలు తక్షణమే రంగంలోకి దిగాయి. ఆగస్టు 15 వేడుకలు జరిగే ఎర్రకోట పరిసర ప్రాంతాలలో భద్రతను అత్యున్నత స్థాయికి పెంచారు. ఈ బెదిరింపు మెయిల్ ఎక్కడి నుంచి వచ్చింది, దీని వెనుక ఉన్న ఐపీ అడ్రస్ ఏంటనే కోణంలో సైబర్ క్రైమ్ పోలీసులు విచారణ వేగవంతం చేశారు. పోలీస్ డ్రస్‌లో వస్తారన్న హెచ్చరికల నేపథ్యంలో.. భద్రతా విధుల్లో ఉన్న ప్రతి ఒక్కరి గుర్తింపు కార్డులను పునఃపరిశీలించడం, తనిఖీలు చేపట్టడం ప్రారంభించారు.

## స్మార్ట్ రేషన్ కార్డులపై మోడీ ఫోటో పెట్టాలి

కేంద్రం తన వాటా కింద ఇచ్చే బియ్యానికి రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు ఇవ్వడం లేదని రఘునందన్ రావు ఆక్షేపించారు. కేంద్రమే అధిక మొత్తంలో బియ్యం వాటా ఇస్తోందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చే ఆరు కిలోల బియ్యంలో ఐదు కిలోలు కేంద్రం ఇస్తున్నవేనని ఎంపీ పేర్కొన్నారు. ఒక్క కిలో బియ్యం ఇస్తూ కార్డుపై ముగ్గురు కాంగ్రెస్ నేతల ఫొటోలు ఎందుకు పెడుతున్నారని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫొటోలతో స్మార్ట్ రేషన్ కార్డులు ఇవ్వడాన్ని రఘునందన్ రావు ఆక్షేపించారు. మోదీ ఫొటో లేకపోవడంపై మండిపడ్డారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో 1.06 కోట్ల రేషన్ కార్డుల పంపిణీపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే సుమారు 90 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయని, కొత్తగా ఎన్ని ఇస్తున్నారో ప్రభుత్వం వెల్లడించాలన్నారు. రేషన్ కార్డుల ముద్రణ ఖర్చులు, టెండర్ల వివరాలు బయటపెట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎంపీ డిమాండ్ చేశారు. కార్డుల ముద్రణ కాంట్రాక్ట ఎవరికి ఇచ్చారు, ఎన్ని కోట్లు ఖర్చు చేస్తున్నారనే వివరాలను వెల్లడించాలన్నారు. అదేవిధంగా, రేషన్ డీలర్లకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని, వారికి గౌరవ వేతనం చెల్లించాలని పేర్కొన్నారు. పెంచిన రేషన్ డీలర్ల కమిషన్‌ను వెంటనే ఇవ్వాలని, బియ్యంలో నూకలు ఎక్కువగా ఉన్నాయన్న ఫిర్యాదులను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రేషన్ కార్డుల ద్వారా తెలంగాణలోని పేదలకు మరిన్ని నిత్యావసర సరకులు అందించాలని సూచించారు. కర్ణాటక తరహాలో కందిపప్పు, నూనె, రాగులు, చక్కెర, గోధుమలు ఇవ్వాలని.. బియ్యం వద్దనుకునే వారికి ప్రత్యామ్నాయ ఆహార ధాన్యాలు అందించాలన్నారు. పేదల ఆహార భద్రతపై కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధి చూపాలని అన్నారు. అలాగే, రేషన్ కార్డుల పంపిణీని పునఃపరిశీలించాలని, మోదీ ఫొటోతో కొత్త కార్డులు ముద్రించాలని ఎంపీ రఘునందన్ రావు డిమాండ్ చేశారు.




## నిరసన తెలిపే హక్కు విద్యార్థులకు ఉంది

తాము తదుపరి ఉత్తర్వులు జారీ చేసేంతవరకూ నల్సార్ యూనివర్సిటీ 2026 బ్యాచ్ న్యాయశాస్త్ర విద్యార్థులెవరినీ న్యాయవాదులుగా నమోదు చేసుకోవద్దంటూ బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) ఛైర్మన్ మనన్‌కుమార్ మిశ్ర దేశవ్యాప్తంగా ఉన్న బార్ కౌన్సిళ్లకు గురువారం లేఖ రాశారు. ఆ ఉత్తర్వులపై విమర్శలు వ్యక్తమయ్యాయి. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్ స్పందిస్తూ.. 'రాజ్యాంగబద్ధమైన సంస్థతో విభేదించిన ఒక్కకారణంతో.. న్యాయవాద వృత్తిలో ప్రవేశించే హక్కును నిరాకరిస్తామని విద్యార్థులను బెదిరించకూడదు' అని వ్యాఖ్యానించారు. బీసీఐ స్పందించిన తీరును సీజేఐ సీరియస్‌గా తీసుకున్నారు. 'ఇదంతా పూర్తిగా అనవసరమైన ప్రక్రియ. నేను విద్యార్థిగా ఉన్నప్పుడు నిరసనల్లో చురుగ్గా పాల్గొనేవాడిని. ఇది నాకు, విద్యార్థులకు మధ్య జరిగిన విషయం. జోక్యం చేసుకోవడానికి వాళెవరు..' అని సీజేఐ ఒకింత ఆగ్రహం వ్యక్తంచేశారు. బీసీఐ ఇచ్చిన సర్క్యులర్లపై వివరణ ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. నల్సార్ విద్యార్థులు, అధ్యాపకులపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని సూచించింది. ఈ నేపథ్యంలో బీసీఐ ఇప్పటికే తన ఉత్తర్వులను వెనక్కి తీసుకుంది.

# విద్యా వ్యవస్థ సమూలంగా ప్రక్షాళన

ఇంతకాలం తర్వాత కూడా పూలేను ఆదర్శ పురుషుడిగా గుర్తిస్తున్నామంటే ఆయన ఆలోచనల గొప్పతనం అర్థమవుతోందని సీఎం అన్నారు. తమ ప్రభుత్వం జ్యోతిబా పూలే ఆలోచనలను కొనసాగిస్తోందని తెలిపారు. కుల నిర్మూలన, సామాజిక చైతన్యం సాధించాలంటే అందరూ కలిసి చదువుకోవడం, జీవించడం అవసరమన్నారు. అందుకే ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను తీసుకొస్తున్నామని చెప్పారు. విద్యా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేస్తున్నామని, నర్సరీ నుంచి విద్యార్థులకు బ్రేకఫాస్ట్‌తో పాటు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. వారి స్ఫూర్తితో విద్యలో రాణించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను పారదర్శకంగా అమలు చేస్తామని, ముందుగానే నిధులు అందించే విధానాన్ని తీసుకొస్తున్నామని చెప్పారు.ఫీజులు చెల్లించలేదనే కారణంతో విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఏ కళాశాలా అడ్డుకోలేని విధంగా చర్యలు చేపడుతున్నామని రేవంత్ అన్నారు. సర్టిఫికెట్ ఒక్కటే ఉద్యోగానికి సరిపోదని ఆయన స్పష్టం చేశారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యతో పాటు నైపుణ్యాలను నేర్పించాల్సిన అవసరం ఉందన్నారు. స్కిల్స్ ఉంటేనే ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. జర్మనీ, జపాన్ వంటి దేశాల్లో నర్సింగ్ రంగంలో మంచి ఉద్యోగావకాశాలు ఉన్నాయని, విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలు పెంచుకోవాలని సూచించారు. 2024లో టాటా సంస్థతో కలిసి 119 నియోజకవర్గాల్లో ఏటీసీలను ఏర్పాటు చేశామని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆయా కేంద్రాల్లో చేరిన విద్యార్థులకు నెలకు రూ.2 వేల స్టైఫండ్ ఇస్తున్నామని చెప్పారు. విద్యతో పాటు సాంకేతిక నైపుణ్యాలను అందిస్తున్నామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పోటీ ప్రపంచంలో విద్యార్థులు రాణించాలంటే కేవలం మార్కులు,



డిగ్రీలు సరిపోవని, నైపుణ్యాలూ అవసరమని అన్నారు. గ్రూప్–1 నియామకాల్లో బీసీలకు పెద్ద సంఖ్యలో అవకాశాలు లభించాయని తెలిపారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని వెల్లడించారు. క్రీడల్లో ప్రతిభ చూపి పతకాలు సాధించిన వారికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తున్నామని చెప్పారు. సిరాజ్, నిఖజ్, దీప్తి వంటి క్రీడాకారులకు ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు గురించి ఎంత బాధ్యతగా ఆలోచిస్తారో, తానూ అంతే బాధ్యతగా ఆలోచిస్తానని రేవంత్‌రెడ్డి అన్నారు.

క్రీడల్లో రాణించి పతకాలు తీసుకొస్తే నగదు నజరానాలతో పాటు ఉద్యోగాలు ఇచ్చే బాధ్యత తనదేనని చెప్పారు. సామాజిక చైతన్యంతో తమ ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటోందని సీఎం తెలిపారు. మాదిగలు దశాబ్దాలుగా పోరాడుతున్న ఎస్సీ వర్గీకరణ సమస్యను పరిష్కరించామని చెప్పారు. దేశంలో బీసీ జనగణన చేపట్టడానికి ఎవరూ ధైర్యం చేయలేదని, బ్రిటిష్ పాలన తర్వాత తొలిసారిగా బీసీల లెక్క తేల్చామని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఏడాదిలోనే కులగణన పూర్తి చేశామని తెలిపారు. కులగణనలో కొందరు మాజీ ముఖ్యమంత్రులు, మాజీ మంత్రులు పాల్గొనకుండా వ్యతిరేకించారని ఆరోపించారు. బలహీన వర్గాలకు ఉద్యోగాలు, అవకాశాలు కల్పించాలంటే వారి జనాభా లెక్కలు తెలియాలని, అందుకే కులగణన చేపట్టామని సీఎం వివరించారు. ప్రతి సమస్యను పరిష్కరించుకుంటూ ముందుకు వెళ్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం ప్రజలను గొర్రెలు, బర్రెలు పెంచుకోవాలని, చెపలు కుట్టుకోవాలని, చేపలు పట్టుకోవాలని చెప్పిందని రేవంత్‌రెడ్డి విమర్శించారు. బీసీలు చదువుకుని ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, మంత్రులు, ఎమ్మెల్యేలు కావద్దా అని ప్రశ్నించారు. 'చదువు ఒక్కటే తలరాతలను మారుస్తుంది. చదువు ఒక్కటే పరిష్కారం.. అదే మార్గం' అని సీఎం అన్నారు. తెలంగాణను ప్రపంచ పటంలో నిలపడానికి విద్యే మార్గమని పేర్కొన్నారు. జ్యోతిబా పూలే స్ఫూర్తితో విద్యార్థులు భవిష్యత్తులో చట్టసభల్లోకి రావాలని, డాక్టర్లు, ఇంజినీర్లు కావాలని ఆకాంక్షించారు. నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించే బాధ్యత తనదేనన్నారు. 'మీ బంగారు భవిష్యత్తు కోసం రోజుకు 18 గంటలు పనిచేస్తా. ఇంత మంచి అవకాశం మళ్లీ రాదు. ఈ ప్రభుత్వాన్ని కొనసాగించాలని రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. అందుకే ప్రజాపాలనలో మహాత్మా జ్యోతిబా పూలే విధానాలను కొనసాగిస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. అన్ని వర్గాలు ఒకే చోట చదువు, జీవించడం ద్వారా కులవ్యవస్థ నిర్మూలన సాధ్యమవుతుందన్నారు. ఏటా రూ.2,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను ముందే జమ చేస్తున్నాం. ఈ ఏడాది నుంచే దీన్ని అమల్లోకి తెచ్చాం. కళాశాలల్లో ప్రవేశాలు పొందాక ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే నెల రోజుల్లో ఫీజు జమ అవుతుందన్నారు

ప్రభాతవని సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
శనివారం
15-8-2026

# సీఎం సభకు సర్వం సిద్ధం

- సంగారెడ్డిలో ఏర్పాట్లను పరిశీలించిన జగ్గారెడ్డి, నిర్మలా జగ్గారెడ్డి

**సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 14 (సింగిడి ):** సంగారెడ్డిలో శనివారం జరగనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగ సభ ఏర్పాట్లు చేస్తున్నట్లు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తెలిపారు. సభ ఏర్పాట్లను డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డితో కలిసి ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ.. సీఎం బహిరంగ సభను లక్ష మంది తో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. సభ విజయవంతం కోసం పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామిలతో ప్రతిరోజూ సమీక్షిస్తున్నామని చెప్పారు. సంగారెడ్డి ఐబీ చౌరస్తాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాజీ ప్రధానమంత్రులు జవహర్‌లాల్ నెహ్రూ, రాజీవ్‌గాంధీల విగ్రహాలను ఆవిష్కరించనున్నారని తెలిపారు. సీఎం సభకు సంగారెడ్డి నియోజకవర్గం నుంచే సుమారు 50వేల మంది హాజరవుతారని జగ్గారెడ్డి పేర్కొన్నారు. గత ప్రభుత్వం అరకొరగా రేషన్ కార్డులు ఇచ్చిందని విమర్శించిన ఆయన.. కాంగ్రెస్ ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టి రాష్ట్రవ్యాప్తంగా కోటి ఐదు లక్షల మందికి అందించనుందని తెలిపారు. సభకు వర్షం వచ్చినా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జర్మన్ షెడ్లు ఏర్పాటు చేస్తున్నామని జగ్గారెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమం లో నియోజకవర్గ కన్వీనర్ చేర్యాల ఆంజనేయులు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జార్జ్, నాయకులు కిరణ్ గౌడ్, కూన సంతోష్, షఫీ హాఫీజ్ తదితరులు పాల్గొన్నారు.



## భవితా కేంద్రం విద్యార్థులకు ప్లే మెటీరియల్ పంపిణీ



**కొల్చారం ఆగస్టు 14 (సింగిడి ):** కొల్చారం మండలంలోని భవితా కేంద్రంలో విద్యను అభ్యసిస్తున్న ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు సంబంధించిన ఆట వస్తువులను శుక్రవారం పంపిణీ చేశారు. మండల విద్యాధికారి ఉమా రాణి తండ్రి, స్వర్గీయ కే. సాయిలు జ్ఞాపకార్థం, మండల విద్యాధికారి ఉమా రాణి ఆధ్వర్యంలో ఈ ఆట వస్తువులను ను భవితా కేంద్రంలోని విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి ఉమా రాణి మాట్లాడుతూ, ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరచడంలో ాావ్ఓజఊఎ ధీుంవస్రూశ్రీఖఎ వీఖ్వతీఋుశ్రీ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. విద్యార్థుల్లో ఆసక్తి, చురుకుదనం, ఆలోచనా సామర్థ్యం, సృజనాత్మకతను పెంపొందించేందుకు ఈ మెటీరియల్‌ను వినియోగించాలని భవితా కేంద్రం సిబ్బందికి సూచించారు. అందించిన ప్రతి వస్తువును విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా సద్వినియోగం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఉమా రాణి తో పాటు భవితా కేంద్రం సిబ్బంది ఆకాష్, నిఖిత, పాఠశాల సిబ్బంది నారాయణ, మండల కోఆర్డినేటర్ సంపత్ కుమార్ పాల్గొన్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల అభ్యసనానికి తోడ్పడే ఈ సేవా కార్యక్రమం పట్ల భవితా కేంద్రం సిబ్బంది, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

## కోట్పల్లి ప్రాజెక్టులో ఘనంగా తిరంగా బోట్ ర్యాలీ



**వికారాబాద్, ఆగస్టు 14(సింగిడి ):** దేశ ప్రధాని నరేందర్ మోదీ ఇచ్చిన పిలువు మేరకు చేవెళ్ళ ఎం పి విశ్వేశ్వర్ రెడ్డి శుక్రవారం జిల్లా పరిధిలోని కోట్ పల్లి ప్రాజెక్ట్ లో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా తిరంగా బోట్ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వయంగా ఆయన బోట్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోట్పల్లి ప్రాజెక్టులో దేశభక్తి భావాన్ని చాటుతూ తిరంగా బోట్ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాను బోట్లపై అలంకరించి, త్రివర్ణ పతాకాలతో బోటింగ్ సిబ్బంది తో కలసి ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బోటింగ్ కోఆర్డినేటర్ రాములు ఆధ్వర్యంలో బోటింగ్ సిబ్బంది, జాతీయ సమైక్యత, దేశభక్తి మరియు జాతీయ జెండా గౌరవాన్ని ప్రజల్లో చాటిచెప్పారు. కోట్పల్లి ప్రాజెక్టు అందాలను తిలకిస్తూ నిర్వహించిన ఈ తిరంగా బోట్ ర్యాలీ సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. దేశం కోసం దేశ ఐక్యత కోసం అనే సందేశంతో కార్యక్రమం కొనసాగింది. ఈ కార్యక్రమంలో బోటింగ్ కోఆర్డినేటర్ రాములు బోటింగ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యల పరిష్కారానికి తొలిప్రాధాన్యం


- ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి
- పారిశుద్ధ్యం నుంచి రోడ్ల వరకు అభివృద్ధి పనులపై దృష్టిపెట్టాలి
- పట్టణాభివృద్ధిపై మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులతో ఎమ్మెల్యే మల్‌రెడ్డి సమీక్ష



**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 14(సింగిడి ):** ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించడమే ప్రభుత్వ ప్రాథమిక లక్ష్యమని... క్షేత్రస్థాయిలో ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని మున్సిపల్ అధికారులకు ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి గారు సూచించారు. తొర్రూర్ లోని క్యాంపు కార్యాలయంలో ఆదిభట్ల సర్కిల్, ఇబ్రహీంపట్నం మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. పారిశుద్ధ్యం, తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, ఆక్రమణలు, సంక్షేమ పథకాల అమలు తీరు, పనుల పురోగతిపై అధికారులతో ఆయన ఆరా తీశారు. పట్టణాభివృద్ధిపై ఈ సందర్భంగా మల్ రెడ్డి రంగారెడ్డి దిశానిర్దేశం చేశారు. కాలనీల్లో పారిశుధ్య నిర్వహణ, చెత్త సేకరణను ప్రభుత్వం నిర్దేశించిన రీతిలో మరింత సమర్థవంతంగా చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలన్న ఆయన... వర్షాకాలం దృష్ట్యా డ్రైనేజీలు, నాలాల పూడికతీతను వేగవంతం చేయాలని చెప్పారు. దెబ్బతిన్న రోడ్లు, గుంతల మరమ్మతులను తక్షణమే పూర్తి చేసి, వీధి దీపాలు పనిచేయని ప్రాంతాల్లో వెంటనే ఏర్పాటు, మరమ్మతులు చేయాలన్నారు. ప్రభుత్వ భూమి కబ్జాలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను గడువులోగా పరిష్కరించాలని, అభివృద్ధి పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఆదిభట్ల, తుర్కయంజాల్ జోనల్ డీసీ సత్యనారాయణరెడ్డి, ఇబ్రహీంపట్నం కమిషనర్ సుదర్శన్ , టీపీవోలు, టీపీఎస్ లు, పారిశుధ్య విభాగం ఇన్ స్పెక్టర్ వనజ, వార్డు ఆఫీసర్లు, ఏఈలు, డీఈలు, కౌన్సిలర్లు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## భౌరంపేట్ బంగారు మైసమ్మ తల్లి బోనాల ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు

ఐశ్వర్యాంబిక తపోవనం త్రిశక్తి పీఠం శ్రీ శక్త్యానంద గిరి స్వామి ఆలయ సందర్శన



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 14 (సింగిడి ):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ సర్కిల్ భౌరంపేట్ శ్రీ బంగారు మైసమ్మ తల్లి బోనాల పండుగ వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించుటకు ఆలయ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ వేడుకల సందర్భంగా అమ్మవారి ఆలయ ఏర్పాట్లను శుక్రవారం ఐశ్వర్యాంబిక తపోవనం త్రిశక్తి పీఠం శ్రీ శక్త్యానంద గిరి స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ శక్త్యానంద గిరి స్వామి మాట్లాడుతూ శనివారం నుంచి జరగనున్న బోనాల ఉత్సవాలను ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు సమష్టిగా కలిసి ఘనంగా నిర్వహించాలని కోరారు. అమ్మవారి పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు అందరూ పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, గ్రామ పెద్దలు ఎం. సుభాష్ రెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షులు ఎం. యాదిరెడ్డి, కమిటీ సభ్యులు ఈ. జంగా రెడ్డి, ఎస్ . రఘువరన్ రెడ్డి, ఎం. శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### టిజీ ఎస్‌సీఏఎస్ జాయింట్ డైరెక్టర్ బిఎస్‌డి డివిజన్ డాక్టర్ జయలక్ష్మి ఆకస్మిక తనిఖీ



**వికారాబాద్, ఆగస్టు 14 (సింగిడి ):** వికారాబాద్ అనంతగిరి, పరిగి ఐసీటీసీ సెంటర్లలో సేవల పరిశీలన తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (టీజీఎస్ఏఎస్ ) జాయింట్ డైరెక్టర్ బి ఎస్ డి డాక్టర్ జయలక్ష్మి శుక్రవారం వికారాబాద్ జిల్లాలోని పలు ఐసీటీసీ సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె వెంట సిపిఎం (దిశ) నరేందర్ కూడా సీ ఎస్ వో రమేష్ కూడా ఉన్నారు. ఈ సందర్భంగా ప్రతి సెంటర్‌లోని రికార్డులు, మందుల నిల్వ, సిబ్బంది హాజరు తదితర అంశాలను డాక్టర్ జయలక్ష్మి క్షుణ్ణంగా పరిశీలించారు. హెచ్ఐ వి /ఎయిడ్స్ పరీక్షలు, కౌన్సెలింగ్ సేవలు సక్రమంగా అందుతున్నాయా అనే విషయాన్ని రోగులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా సిబ్బందిని కూడా సేవలకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. ప్రజలకు మరింత మెరుగైన, గోప్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. పరీక్షలు, కౌన్సెలింగ్‌లో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, ఐసీటీసీ కేంద్రాలకు వచ్చే ప్రతి ఒక్కరికీ సకాలంలో సేవలు అందించాలని సూచించారు.

## ఘనంగా గూడెం విష్ణువర్ధన్ రెడ్డి జయంతి

**ఉచిత వైద్య శిబిరం, అన్నదానం, రోగులకు పండ్ల పంపిణీ**

**భారీ సంఖ్యలో పాల్గొన్న జిఎంఆర్, జివిఆర్ యువసేన సభ్యులు**





**పటాన్చెరు, ఆగస్టు 14 (సింగిడి ):** పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి పెద్ద కుమారుడు కీర్తిశేషులు గూడెం విష్ణువర్ధన్ రెడ్డి 37వ జయంతి వేడుకలను జిఎంఆర్, జివిఆర్ అభిమానులు, స్నేహితులు ఘనంగా నిర్వహించారు. సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ విష్ణువర్ధన్ రెడ్డి జ్ఞాపకాలను స్మరించుకున్నారు. జయంతి సందర్భంగా పటాన్చెరు పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో జిఎంఆర్ యువ సేన, జివిఆర్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భారీ రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 250 మందికి పైగా యువకులు రక్తదానం చేసి తమ మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. రక్తదాన శిబిరాన్ని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఆర్ఎంఓ శ్రీనివాస్ పర్యవేక్షించారు. అదేవిధంగా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు. నిరుపేద ప్రజలకు అన్నదానం నిర్వహించారు. బ్లాక్ ఆఫీస్ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సలహాలు అందించారు. అనంతరం అభిమానులు, సన్నిహితులు, యువ సేన సభ్యుల సమక్షంలో కేక్ కట్ చేసి గూడెం విష్ణువర్ధన్ రెడ్డి జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ.. గూడెం విష్ణువర్ధన్ రెడ్డి తండ్రికి తగ్గ తనయుడిగా ఎదుగుతున్న క్రమంలో అకాల మరణం చెందడం అత్యంత బాధాకరమని అన్నారు. ప్రజా సేవ పట్ల ఆయనకున్న ఆసక్తి, స్నేహశీలత, సేవా భావం అందరికీ ఆదర్శమని పేర్కొన్నారు. విష్ణువర్ధన్ రెడ్డి ఆశయాలు, ఆదర్శాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆయన జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, యాదగిరి యాదవ్, విజయ్ కుమార్, నర్రా బిక్షపతి, రామచంద్రారెడ్డి, పృథ్వీరాజ్, గూడెం సంతోష్ రెడ్డి, గూడెం సందీప్ రెడ్డి, అశోక్, వెంకటేష్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు చదువు వ్యాపాకం కావాలి



**వికారాబాద్, ఆగస్టు 14(సింగిడి ):** పాఠశాలకు వెళుతున్న ప్రతి విద్యార్థికి చదువు వ్యాపాకం కావాలని ఎల్లకొండ సర్పంచ్ కొండల్ యాదవ్ అన్నారు. జిల్లా పరిధిలోని నవాబుపేట మండలం ఎల్లకొండ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఏకరూప దుస్తులను పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో చదువు విలువ తెలియదని ఈ నేపథ్యంలో నే పిల్లలు మారాం చేస్తూ పాఠాశాలకు భారంగా వెళుతుంటారని అన్నారు. దీంతో ఇతర వ్యాపకాలతో చదువు పై ఇష్టాన్ని తగ్గించి జీవితాలను నాశనం చేసుకునే వారు ఉన్నారని అన్నారు. చదువే వ్యాపకమైన విద్యార్థి ఉన్నత శిఖరాలు అధిరోహించి జీవితాన్ని అన్నికోణాల్లో సుఖమయం చేసుకుంటారని చెప్పారు. విద్యార్థులందరు ఇష్టం తో చదవాలని కోరారు. పాఠశాలలో భేదాభిప్రాయాలు ఉండకూడదని అందరు సమానమేనని సూచించేందుకు ఏర్పాటు చేసిన పద్దతిలో భాగమే ఏకరూప దుస్తులని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులు అధికంగా ఉండటంతో ప్రభుత్వమే ఈ దుస్తులను ఉచితంగా అందిస్తున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## కొల్చారంలో హర్ ఘర్ తిరంగా యాత్ర....




**కొల్చారం ఆగస్టు 14(సింగిడి ):** భారత ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి పిలుపుమేరకు హర్ ఘర్ తిరంగ యాత్ర సందర్భంగా జాతీయ జెండాలతో విద్యార్థిని విద్యార్థులతో కలిసి రంగంపేట జడ్పీ హెచ్ఎస్ హైస్కూల్ నుండి రంగంపేట పురవీధులు నుంచీ ఘనంగా ర్యాలీని నిర్వహించడం జరిగింది. తిరంగా యాత్ర భారతీయ జనతా పార్టీ కొల్చారం మండల శాఖ అధ్యక్షులు ఘనపూర్ హరీశ్ అధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమం ఉద్దేశించి మండల అధ్యక్షుల వారు మాట్లాడుతూ నేడు విద్యార్థులందరూ త్రివర్ణ పతాక చేతపట్టి రంగంపేట లో విజయవంతంగా ఈ ర్యాలీని జరుపుకోవడం ఎంతో సంతోషకరమైన విషయం ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ గారు చెప్పినట్టు మనం అందరం కులాలకు మతాలకు ప్రాంతాలకు అతీతంగా అందరము ఒకటనే భావన ఈ తిరంగా యాత్ర వల్ల ఏర్పడుతుందని అలాగే మన స్వాతంత్ర సిద్ధించడం కోసం ప్రాణాల అర్పించిన మన నాయకులను స్వతంత్ర సమరయోధులను స్మరించుకుంటూ ఈ యువత రాబోయే రోజుల్లో భారతదేశాన్ని వికసితభారతంగా ఏర్పాటుకు పోరాడాలని,మన యొక్క ఇంటి పైన కుటుంబ సభ్యులతో జాతీయ జెండాను ఎగురవేసి మన ఐక్యతను తెలియజేయాల్సిన అవసరం ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొల్చారం మండలం ఎస్సై మోయద్దీన్ రంగంపేట గ్రామ సర్పంచ్ అరిగె స్వర్ణలతవిజయ్ కుమార్ హాజరవ్వడం జరిగింది. ఈ ర్యాలీకి సహకరించిన విద్యార్థినీ విద్యార్థులకు టీచర్లకు, పోలీస్ బృందానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హర్ ఘర్ తిరంగా మండల కన్వీనర్ చిట్టుకుల గిరి , బీజేపీ మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు గ్యాన్సింగ్ బీజేపీ జిల్లా ఓబీసీ ఉపాధ్యక్షులు యాదగిరి మెదక్ జిల్లా కౌన్సిల్ మెంబర్ ఎంచర్ల శేఖర్ యాదవ్, బీజేపీ మైనారిటీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు ఖలీల్. బీజేపీ ఎస్టి మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యుడు శివలాల్ , మండల ప్రధాన కార్యదర్శి రవికాంత్ నేత,బీజేపీమండల ఎస్టీ మోర్చ అధ్యక్షులు మలావత్ అంజి , బిజెపి మండల ఉపాధ్యక్షులు రవిగౌడ్,వెంకట్, చిన్న ఘనపూర్ శక్తి కేంద్రం ఇంచార్జ్ మల్లేశం బీజేపీ రంగంపేట బూత్ అదక్షుల్లు.పోచందర్. సాయి. ఎనిగండ్ల బూత్ అధ్యక్షులు శ్రీశైలం, చిన్న ఘనపూర్ బూత్ అధ్యక్షులు మహేష్ ముదిరాజ్ , బీజేవైఎం నాయకుల ప్రవీణ్ యాదవ్ , నరేశ్, నాగరాజు అరుణ్. బీజేపీ గిరిజన మోర్చా నాయకులు గోపాల్, శంకర్. బీజేపీ నాయకులు కురుమ మానయ్య తదితరులు పాల్గొనడం జరిగింది.

## స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీకి సంగారెడ్డి నుండి శ్రీకారం చుట్టనున్నసీఎం

**స్వాగత ఫ్లెక్సీలతో కళకళలాడుతున్న పట్టణం..**

**సభా ప్రాంగణంలో పూర్తయిన ఏర్పాట్లు**

**నెహ్రూ, రాజీవ్ గాంధీ విగ్రహాల ఆవిష్కరణకు సర్వం సిద్ధం**

**సంగారెడ్డి ప్రతినిధి, ఆగస్టు 14 (సింగిడి ):** ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నేడే సంగారెడ్డి పట్టణంలో పర్యటించనున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 1.05 కోట్ల కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో సీఎం పాల్గొననున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో సంగారెడ్డి పట్టణం ముస్తాబైంది. సభా ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. సభా వేదిక, ప్రజలు కూర్చునే ప్రాంతాలు, బారికేడ్లు, పార్కింగ్ తదితర ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. కార్యక్రమానికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేశారు.



**స్వాగత ఫ్లెక్సీలతో సందడి**

ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికేందుకు సంగారెడ్డి పట్టణంలోని ప్రధాన రహదారులు, కూడళ్లు భారీ ఫ్లెక్సీలు, స్వాగత బ్యానర్లు, కటౌట్లతో నిండిపోయాయి. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీలు, నాయకుల కటౌట్లతో సంగారెడ్డి సందడిగా మారింది.

**నెహ్రూ, రాజీవ్ గాంధీ విగ్రహాల ఆవిష్కరణ**

సీఎం పర్యటనలో భాగంగా మాజీ ప్రధానులు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, రాజీవ్ గాంధీ విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమానికి కూడా సర్వం సిద్ధమైంది. విగ్రహాలను అలంకరించడంతో పాటు ఆవిష్కరణ ప్రాంగణాన్ని ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. కార్యక్రమానికి వచ్చే ప్రజలు, నాయకులు, ప్రజాప్రతినిధులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

**భారీ భద్రతా ఏర్పాట్లు**

ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో సంగారెడ్డి పట్టణంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. సభా ప్రాంగణం పరిసరాల్లో బారికేడ్లు ఏర్పాటు చేసి ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టారు. సీఎం పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు సమన్వయంతో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

## డంపింగ్ యార్డును యుద్ధ ప్రాతిపదికన ఎత్తివేయాలి

- పర్యావరణ విషతుల్యం ప్రజల ఆరోగ్యం గాల్లో దీపమేనా?
- డంపింగ్ ప్రాంతంలోని మరణాలన్నీ రాంకీ పాపమే
- డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాట కమిటీ చైర్మన్ షేక్షావలి



**జవహర్‌నగర్ ఆగస్టు 14 (సింగిడి ):** డంపింగ్ దుర్వాసనతో పర్యావరణం విష తుల్యమవుతూ ప్రజల ఆరోగ్యం గాలిలో దీపంలా మారుతుందని వెంటనే డంపింగ్ యార్డును శాస్త్రీయ పద్ధతిలో యుద్ధ ప్రాతిపదకన ఎత్తివేయాలని లేదంటే పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు తప్పవని డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాట కమిటీ చైర్మన్ షేక్షావలి కన్వీనర్ ఉమా మహేష్ డిమాండ్ చేశారు. చెత్త రామ్కి డంపింగ్ యార్డ్ ను శాస్త్రీయ పద్ధతిలో శాశ్వతంగా మూసివేయాలని కోరుతూ డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాట కమిటీ చైర్మన్ షేక్షావలి కన్వీనర్ ఉమామహేశుల ఆధ్వర్యంలో శుక్రవారం జవహర్ నగర్ మాజీ ప్రజా ప్రతినిధుల సమక్షంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా షేక్షావలి మాట్లాడుతూ డంపింగ్ యార్డ్ ప్రభావిత ప్రాంతంలో రాంకీ యాజమాన్యం నిబంధనల ఉల్లంఘనలతో మరణించిన మరణాలన్నీ అసహజమైన వేనని నష్టపరిహారం చెల్లించాలన్నారు. కలుషిత జలాలతో మానవ మనుగడ ప్రశ్నార్ధకంగా మారుతుందని మృత్యు కూపాలుగా మారిన చెరువులన్నీ శుద్ధి చేయాలని స్పష్టం చేశారు. డంపింగ్ యార్డ్ పోరాట కమిటీ దీనికి వెన్నంటి ఉంటుందని తెలిపారు. మాజీ ప్రజాప్రతినిధుల మద్దతు తెలిపారు. ప్రతి డివిజన్లో కమిటీలు వేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు శాంతి కోటేష్ గౌడ్, శ్రీనివాస్, లలిత యాదవ్ ,సంగీత రాజశేఖర్ ,వేణు, రవి, బాబు, శ్రీనివాస్, వెంకటేష్, సాయి, నవీన్ శ్రీనివాస్ సుబ్రహ్మణ్యం రాజకుమార్ రాంచందర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

### పరిగి పట్టణంలో నూతన ఉడిపి హోటల్‌ను ప్రారంభించిన పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి



**వికారాబాద్, ఆగస్టు 14(సింగిడి ):** జిల్లా పరిధిలోని పరిగి పట్టణంలో మిట్టకోడూర్ మాజీ ఎంపీటీసీ జాంగిర్ నూతనంగా ఏర్పాటు చేసిన న్యూ జమ్ జమ్ ఫ్యామిలీ రెస్టారంట్, నూతన ఉడిపి హోటల్‌ను శుక్రవారం పరిగి ఎమ్మెల్యే, టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ (సర్ ) డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం రెస్టారెంట్‌ను పరిశీలించి, యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ వ్యాపారంలో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. రెస్టారెంట్ యాజమాన్యం ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించి, ప్రారంభోత్సవానికి విచ్చేసి తమను ప్రోత్సహించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

## అర్హులైన జర్నలిస్టులకు ఇండ్లు ఇవ్వాలి



**కూకట్ పల్లి, ఆగస్టు 14 (సింగిడి ):** సీనియారిటీ ఆధారంగా అర్హులైన జర్నలిస్టులకు ఇల్లు ఇవ్వాలని కూకట్ పల్లి తహసిల్దార్ అశోక్ కుమార్ కు శుక్రవారం జర్నలిస్టులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాస్తవ పరిస్థితులను పరిగణలోకి తీసుకొని క్షేత్రస్థాయిలో సమగ్ర సర్వే నిర్వహించి, పారదర్శకంగా నిష్పక్షపాతంగా కేటాయింపులు చేపట్టాలని అందులో కోరారు. ఏ విధమైన రాజకీయ, వ్యక్తిగత ఇతర ప్రభావాలకు తావు లేకుండా అర్హులైన జర్నలిస్టులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కైత్లాపూర్ లోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపులో ఇప్పటికే తయారు చేసిన జాబితాలో సగానికి పైగా అనర్హులు ఉన్నారని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వారి స్థానంలో అర్హులను చేర్చాలని కోరారు. శఇదే విషయమై సోమవారం జిల్లా కలెక్టర్ కు విన్నవించనున్నట్లు స్పష్టం చేశారు. తహసిల్దార్ అశోక్ కుమార్ మాట్లాడుతూ ఇండ్ల కేటాయింపు విషయంలో నిబంధనల ప్రకారం పరిశీలించి, అర్హులైన వారికి మాత్రమే ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు కట్టెల మల్లేశం, సి హెచ్. రామారావు, మండపాక కళ్యాణ్ చక్రవర్తి, దాదె వెంకట్, ఎంఎస్. ఆనందరావు, అంబటి వెంకట్, జంగాల నాగర్జున, బి. శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎడిటోరియల్

Editorial

## దేశవిభజన ఒక చీకటి అధ్యాయం!

స్వాతంత్ర్యం తెచ్చామని కాంగ్రెస్ నేతలు ఇప్పటికీ చంకలు గుద్దుకుంటుంటారు. స్వాతంత్ర్య పోరాటంలో తామే పాల్గొన్నామన్న భావన వ్యాప్తి చేయడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలనుకుంటారు. నిజానికి ఎందరో మహానుభావులు ఉద్యమించారు. లక్షల మంది అసువులు బాసారు. అన్నింటికి మించి కాంగ్రెస్ చేసిన దుర్మార్గం కారణంగా దేశం రెండు ముక్కలయ్యింది. లక్షలాది మంది శవాల మీద జెండా ఎగరేశారు. ఓ రకంగా ఆగస్ట్ 14, 1947 కాళరాత్రి అని చెప్పకతప్పదు. 1947 ఆగస్టు 14 ఉదయం. ఒకవైపు కరాచీలో పాక్ అనే కొత్త దేశం పురుడుపోసుకుంటోందన్న సంబరాలు, మరోవైపు ఢిల్లీలో దశాబ్దాల పారతంత్రం వీడి స్వాతంత్ర్యపు వెలుగులు విరజిమ్మబోతున్నాయన్న సంబరం.. కానీ, పంజాబ్, బెంగాల్‌లలోని లక్షలాది ఇళ్లలో మాత్రం హర్షాతిరేకాలు లేవు.. కేవలం కంటిమీద కునుకు లేని భయం, గుండెల్ని పిండేసే అనిశ్చితి మాత్రమే అక్కడి ప్రజల్లో కనిపించింది. దానికి కారణం తెల్లారితే తమ ఊరు, తమ ఇల్లు ఏ దేశంలో ఉంటాయో అక్కడ ఎవరికీ తెలియని దుర్భరమైన పరిస్థితి. సరిహద్దులను నిర్ణయించే బాధ్యతను బ్రిటీష్ న్యాయవాది జాన్ రెడ్‌క్లిఫ్‌కు అప్పగించినప్పటికీ, ఆయన గీసిన ఆ వినాశకరమైన గీత ఆగస్టు 14న బయటకు రాలేదు. ఆ తుది నిర్ణయాన్ని ఆగస్టు 17 వరకు దాచిపెట్టారు. అంటే అర్ధరాత్రి రెండు దేశాలు స్వతంత్రంగా మారినప్పటికీ, వేలాది కుటుంబాలకు తమ సొంత ఇల్లు భారత్‌లో ఉందో, పాకిస్థాన్‌లో ఉందో తెలియని ఒక విచిత్రమైన, విషాదకరమైన పరిస్థితిలో7 ఉండిపోయారు. విభజన ప్రకటన ఇరు ప్రాంతాల ప్రజల్లో తీవ్ర ఆవేదన, ఆందోళన నింపింది. అందుకే ఆగస్టు 14 భారత దేశానికి ఒక చీకటి రోజుగా పరిగణిస్తారు. ఇది స్వాతంత్ర్యం తీసుకుని వచ్చిన దానికన్నా పెను విషాదాన్ని నింపింది. ఒక రకంగా చెప్పాలంటే 1947 ఆగస్టు 14 రాత్రి కేవలం భారత్‌ను చీల్చడానికి ఉద్దేశించిన రోజుగానే చూడాలి. దేశాలను విభజించడానికి గీసిన గీతకు ఆనాటి పెద్దలు అంగీకారం తెలపడం నేటికీ జీర్ణించుకోలేని చరిత్రగా మిగిపోతుంది. విభజనకు గీసిన ఒక గీత మధ్య అసలు మనిషి ఎక్కడ నిలబడ్డాడనేది అంతుచిక్కని ప్రశ్నగా మిగిలి పోయింది. ఈ చారిత్రక ఘట్టాన్ని అర్థం చేసుకోవాలంటే ముందుగా ఆగస్టు 14న కరాచీలో ఏం జరిగిందో చూడాలి. ఆ రోజు ఉదయం 9 గంటలకు సింధ్ అసెంబ్లీ భవనం బయట ఉత్సాహంతో జనం కిక్కిరిసిపోయారు. మహమ్మద్ అలీ జిన్నా, లార్డ్ మౌంట్‌బాటన్ ఒకే రాచరికపు బగ్గీలో అక్కడికి చేరుకున్నారు. కరాచీలోని రాజ్యాంగ పరిషత్ ప్రత్యేక సమావేశంలో అధికార మార్పిడి ప్రక్రియ అధికారికంగా ముగిసింది. అయితే, మౌంట్‌బాటన్‌కు అక్కడ ఎక్కువ సేపు గడిపే వ్యవధి లేదు. మధ్యాహ్నం 2 గంటలకే ఆయన ఢిల్లీకి పయనమయ్యారు. ఎందుకంటే అదే రోజు అర్ధరాత్రి భారత్ స్వాతంత్ర్య వేడుకల్లో ఆయన పాల్గొనాల్సి ఉంది. ఇక, కరాచీలో సంబరాలు ముగిసి ఢిల్లీలో అర్ధరాత్రి వేడుకలకు వేదిక సిద్ధమవుతుంటే, పంజాబ్‌లో మాత్రం సరిహద్దు రక్తసిక్తమయ్యింది. విభజన వార్త కేవలం పత్రికలకే పరిమితం కాకుండా ప్రజల గుమ్మాల ముందుకు వచ్చింది. హిందువులు, ముస్లింలు, సిక్కులు తమ ఇళ్లను వదిలి వెళ్లాలో వద్దో తెలియక కొట్టుమిట్టాడారు. పంజాబ్‌లో రైళ్లు నడుస్తున్నాయి, కానీ అవి కేవలం ప్రయాణికులను మాత్రమే కాక, ముక్కలైన జీవితాలను మోసుకెళు తున్నాయి. ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 8 మధ్య దాదాపు ఏడు లక్షల మంది శరణార్థులు రైళ్ల ద్వారా సరిహద్దులు దాటారని అంచనా. కానీ, అసలు భయానక దృశ్యం ఆగస్టు 17 తర్వాత మొదలైంది. రెడ్‌క్లిఫ్ లైన్ బహిర్గతమయ్యాక, తమ ఊరు పరాయి దేశంలోకి వెళ్లిపోయిందని తెలిసిన దాదాపు 1.5 కోట్ల మంది ప్రజలు కాలినడకన, బస్సుల్లో, రైళ్లలో ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని సరిహద్దులు దాటడం ప్రారంభించారు. మార్గమధ్యంలో శరణార్థుల కాఫిలాలు, రైళ్లపై దాడులు జరిగాయి.

దహనమైన, నిశ్శబ్దంగా శవాల దిబ్బగా మారిన రైళ్లు స్టేషన్లకు చేరుకున్నాయి. ఈ హింసలో 5 నుంచి 10 లక్షల మంది లేదా కొన్ని అంచనాల ప్రకారం 15 నుంచి 20 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు 75 వేల మంది మహిళలు కిడ్నాప్‌లు, లైంగిక హింసకు గురయ్యారు. దేశమంతా ఒకవైపు పండుగ వాతావరణం, మరోవైపు రక్తపాతంతో అల్లకల్లోలంగా ఉంటే, మహాత్మా గాంధీ మాత్రం ఈ వేడుకలకు చాలా దూరంగా కలకత్తాలోని బెలియాఘాటాలో ఉన్న హైదరీ మంజిల్‌లో ఉన్నారు. కలకత్తాలో ఆగస్టు 16-18 మధ్య జరిగిన హింసలో 4,000 మందికి పైగా చనిపోయిన వేళ, గాంధీ అక్కడే ఉండి శాంతి కోసం నిరాహార దీక్షలు చేపట్టారు. బ్రిటీష్ పాలన అధికారికంగా అంతమై, కొత్త పతాకం ఎగిరింది. కానీ, ఆ వెలుగుల వెనుక దట్టమైన చీకటి దాగి ఉంది. ఒకవైపు అధికార మార్పిడి, మరోవైపు కోట్ల మంది నిరాశ్రయుల కాళ్ల నడకలు.. శాల దిబ్బలు వంటివన్నీ కళ్లముందు కదలాడాయి. జిన్నా ఎత్తులకు లొంగిపోవడంతో దేశం భారీ మూల్యం చెల్లించుకుంది. గాంధీ, నెహ్రూలు ప్రేక్షకపాత్ర వహించారు. మారణహోమాన్ని ఆపలేక పోయారు. ప్రజలను నడివీధుల్లో నిరాశ్రయులను చేశారు. ఇప్పటికీ అనేక కుటుంబాలు ఆ క్షోభ నుంచి కోలుకోలేదు. స్వాతంత్ర్యం తెచ్చామని ప్రగల్భాలు పలుకుతున్న నేటి కాంగ్రెస్ నేతలు ఆనాటి మారణహోమానికి సమాధానం చెప్పగలరా? ఈ విభజన కేవలం కాంగ్రెస్ లొంగుబాటు తీరు వల్లే అని ప్రపంచానికి తెలియదా? దేశాన్ని ఐక్యంగా ఉంచడంలో విఫలమైన ఆనాటి కాంగ్రెస్ నాయకత్వాన్ని ఏమనాలి? ఇవన్నీ సమాధానం లేని ప్రశ్నలుగానే ఉన్నాయి.

## గంజాయి, డ్రగ్స్ మత్తు.. యువత భవిష్యత్తుపై పెను ముప్పు

తెలంగాణలో గంజాయి, డ్రగ్స్ వినియోగం పెరుగుతున్నదనే ఆందోళనకు ఇటీవలి గణాంకాలు బలం చేకూరుస్తున్నాయి. ఇది కేవలం పోలీసుల సమస్య కాదు.. కుటుంబాలు, విద్యాసంస్థలు, సమాజం మొత్తం కలిసి ఎదుర్కోవాల్సిన సామాజిక సమస్యగా మారుతోంది.

గణాంకాలు చెబుతున్న ప్రమాదం

కేంద్ర హోంశాఖకు నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో అందించిన వివరాల ప్రకారం తెలంగాణలో గంజాయి కేసులు 2022లో 1,171 నుంచి 2024లో 2,158కు పెరిగాయి. అదే కాలంలో ఈ కేసుల్లో అరెస్టులు 2,759 నుంచి 4,894కు పెరిగాయి. రాష్ట్రంలో 2024లో తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో, స్థానిక పోలీసులు కలిసి 2,169 చీఙూా కేసులు నమోదు చేసి 5,205 మందిని అరెస్టు చేశారు. సుమారు 21,616 కిలోల గంజాయి




స్వాధీనం చేసుకున్నట్లు నివేదికలు వెల్లడించాయి. 2025లోనూ పరిస్థితి ఆందోళనకరంగానే కనిపించింది. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం 1,304 చీఙూా కేసులు నమోదు చేసి, 5,505 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుంది. ఈ కేసుల్లో 2,333 మందిని అరెస్టు చేసినట్లు వార్షిక నివేదిక ఆధారంగా వెల్లడైంది.

**హైదరాబాద్ నుంచి జిల్లాలకు విస్తరిస్తున్న సరఫరా?**

డ్రగ్స్ సమస్యను హైదరాబాద్ నగరానికే పరిమితం చేయలేం. పెద్ద నగరాల్లోని సరఫరా నెట్‌వర్క్‌లు చిన్న పట్టణాలు, జిల్లా కేంద్రాలు, విద్యార్థులు ఎక్కువగా ఉండే ప్రాంతాల వరకు విస్తరించే ప్రమాదం ఉంది. 2025 జూన్ నుంచి 2026 జూన్ వరకు హైదరాబాద్ పోలీసులు 563 చీఙూా కేసులు నమోదు చేసి రూ. 22.17 కోట్ల విలువైన మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. సరఫరా మార్గాలు, స్థానిక పెడ్లర్లు, వినియోగదారులపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఇదే నేపథ్యంలో కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి వంటి పట్టణాల్లో కూడా గంజాయి విక్రయాలపై వస్తున్న ఆరోపణలను తేలిగ్గా తీసుకోకూడదు. ఆరోపణలు నిజమని ముందుగానే నిర్ధారించకుండా, నిఘా, తనిఖీలు, విచారణ ద్వారా వాస్తవాలను వెలికి తీయాల్సిన బాధ్యత పోలీసు శాఖపై ఉంది.

యువత ఎందుకు ఈ ఉచ్చులో పడుతోంది?

స్నేహితుల ప్రభావం, ఆసక్తి, మత్తు పదార్థాలపై అవగాహన లేకపోవడం, సోషల్ మీడియా ప్రభావం, కుటుంబ పర్యవేక్షణ లోపం, ఒత్తిడి నుంచి బయటపడేందుకు తప్పుడు మార్గాలను ఎంచుకోవడం వంటి అనేక కారణాలు యువతను మత్తు వైపు నడిపించవచ్చు.

**"గంజాయి పెద్ద ప్రమాదం కాదు" అనే అపోహ ప్రమాదకరం.**

మత్తు పదార్థాల వినియోగం వ్యక్తి ఆరోగ్యం, చదువు, ఉద్యోగం, కుటుంబ సంబంధాలు, ఆర్థిక పరిస్థితులపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది. ఒకసారి అలవాటు బలపడితే బయటపడటం మరింత కష్టమవుతుంది.

పట్టుకోవడమే కాదు.. కాపాడాలి.

డ్రగ్స్ వ్యతిరేక పోరాటంలో కేవలం కేసులు నమోదు చేయడం, అరెస్టులు చేయడం సరిపోదు. సరఫరా గొలుసును ఛేదించడంతో పాటు ఇప్పటికే మత్తుకు బానిసైన వారికి కౌన్సెలింగ్, చికిత్స, పునరావాసం అందించాలి.

పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనలో ఆకస్మిక మార్పులను గమనించాలి. స్థానిక ప్రజలు అనుమానాస్పద కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం అందించాలి.

చిన్న పట్టణాలపై ప్రత్యేక నిఘా అవసరం

డ్రగ్స్ సరఫరా పెద్ద నగరాల నుంచి చిన్న పట్టణాలకు చేరితే సమస్య మరింత ప్రమాదకరంగా మారుతుంది. కాబట్టి తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో, పోలీసు, ఎక్సైజ్ అధికారులు జిల్లా కేంద్రాలతో పాటు మండలాలు, చిన్న పట్టణాలపై కూడా నిరంతర నిఘా పెట్టాల్సిన అవసరం ఉంది.

యువత చేతిలో పుస్తకం ఉండాలి.. మత్తు పదార్థం కాదు. ఇది కేవలం పోలీసుల బాధ్యత కాదు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, పోలీసులు, సమాజం కలిసి ముందుకు వస్తేనే తెలంగాణ యువతను డ్రగ్స్ మహమ్మారి నుంచి కాపాడగలం.



**ఉక్కల్ కర్ రాజేందర్ నాథ్**
**ఫ్రీలాన్స్ జర్నలిస్ట్**
**9440287170.**


# దేశ తొలి స్వాతంత్ర్య వేడుకల్లో మహాత్ముడు ఎందుకు పాల్గొనలేదు



రెండు శతాబ్దాల ఆంగ్లేయుల పాలన నుంచి, శతాబ్దపు స్వాతంత్ర్య పోరాటాల ద్వారా భారతావని స్వేచ్ఛావాయువులు పొందిన సందర్భం భారతీయులంతా అవధులు దాటిన ఆనందం అనుభవించిన సమయం. దేశాన్నంతటినీ ఏకదాటిపైకి తెచ్చి స్వాతంత్ర్యం సంపాదించి పెట్టడంలో గాంధీజీ కీలక పాత్ర పోషించిన విషయం అందరూ అంగీకరించే సత్యం. స్వాతంత్ర్యం సాధించి, జరుపుకున్న తొలి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఘట్టం భరత జాతికి అపూర్వ, అనిర్వచనీయ జ్ఞాపకం. 1947 ఆగస్టు 15 నాటి అలాంటి ముఖ్యాతి ముఖ్య మహోత్సవ వేడుకల సందర్భానికి జాతిపిత ఎందుకు దూరంగా ఉన్నారు.


ముస్లిం నాయకుడైన మహమ్మద్ ఆలీ జిన్నాను ప్రధాని మంత్రిగా చేసైనా దేశ విభజనను ఆపాలని గాంధీ భావించారు. ఇది హిందూ- ముస్లింల మధ్య మరింత చిచ్చు రాజేసింది. నెహ్రూ, సర్దార్ వల్లబాయ్ పటేల్ లు గాంధీ విధానాన్ని వ్యతిరేకించారు. విభజన జరిగితేనే అల్లర్లు సమసి పోతాయని వారు భావించారు. దేశ విభజనో.. అంతర్గత యుద్ధమో తేల్చుకోండని జిన్నా పిలుపు నివ్వడం గాంధీని ఇరకాటంలో పడేసింది. 1947 ఆగస్టు 15న దేశ మంతా సంబరాలు జరుపు కుంటుంటే.. గాంధీ మాత్రం సంబరాలకు బహు దూరంగా, ఢిల్లీకి దూరంగా ఉండడం విశేషం.

1946లో మతోన్మాదం ప్రారంభం కాగానే గాంధీ బెంగాల్, బీహార్ తదితర ప్రభావిత ప్రాంతాలు పర్యటించారు. డెభై ఐదు పైబడి వయసు ఉన్న గాంధీ కాలి నడకన, తిరుగుతూ హిందువులను, ముస్లింలను కలిసి, సమావేశాలలో ప్రసంగించి పరిస్థితులను చక్కబెట్టే ప్రయత్నం చేశారు.



మరోసారి ఆగస్ట్ 1947 మొదట్లో ఢిల్లీ వదిలి, కలకత్తాలోని ముస్లింల ఆధిక్యత గల బెలియఘాట్ చేరుకొని, ప్రహరీలు లేని పాడుబడిన భవనంలో అక్కడే నివసించారు. దేశ విభజన ప్రతిపాదన, దానికి వ్యతిరేకంగా చెలరేగిన అల్లర్లు, అవి దారితీసిన ఉద్రిక్తతలు, మత ఘర్షణల ఫలితంగా అనూహ్యమైన రీతిలో ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు.

ప్రభుత్వం పరిస్థితిని అదుపు చేయలేని అసహాయ స్థితిలో పడింది. మొత్తం పోలీసు బలగాలు దేశ పశ్చిమ ప్రాంతానికి పంప బడ్డాయి. తూర్పు ప్రాంతంలో కల్లోలాలను అదుపు చేసే భారం గాంధీ పై పడింది. దేశ విభజనతో ముఖ్యంగా పంజాబు, బెంగాలు లలో పెద్దఎత్తున సంభవించిన వలసలవల్ల మత కలహాలు, మారణ కాండలు ప్రజ్వరిల్లాయి. 1947లో కాశ్మీరు విషయమై భారత్ - పాకిస్తాన్ యుద్ధం తరువాత ఇంటా, బయటా పరిస్థితి మరింత క్షీణించింది. ముస్లిము లందరినీ పాకిస్తాను పంపాలనీ, కలసి బ్రతకడం అసాధ్యమనీ వాదనలు నాయకుల స్థాయిలోనే వినిపించ సాగాయి. ఈ పరిస్థితి గాంధీకి మింగుడు పడని అంశంగా మారింది.



ఏ హింసనైతే నివారించటానికి అంత సహనంతో అహింస, సత్యాగ్రహం ఆయుధాలతో పోరాటాన్ని ముందుకు తీసుకొని వెళ్లారో, అదే జరగ గూడని హింస పేట్రేగడంతో గాంధీజీ దిగులు చెందారు. పలు పత్రికలు ఆయన సందేశం కోసం అడిగినప్పటికీ తిరస్కరించారు. అయితే 15 ఆగస్ట్ 1947న గాంధీ ఉపవాసం ఉంటూ, ప్రార్ధన చేసుకొనుటకు నిర్ణయించు కున్నారు.

ఆగస్టు 15న భారతదేశానికి స్వతంత్రం వస్తుందనే విషయం పక్కాగా తెలియగానే జవహర్ లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభ్ భాయి పటేల్ మహాత్మా గాంధీకి లేఖ రాశారు. అందులో "ఆగస్టు 15 మన మొదటి స్వతంత్ర దినోత్సవం అవుతుంది. మీరు జాతిపిత. ఇందులో పాల్గొని మీ ఆశీస్సులు అందించండి" అని కోరారు. గాంధీ ఆ లేఖకు సమాధానం ఇచ్చారు. అందులో "కలకత్తాలోని హిందూ - ముస్లింలు ఒకరి ప్రాణాలు ఒకరు తీసుకుంటున్నప్పుడు నేను సంబరాలు జరుపుకోడానికి ఎలా రాగలను. ఈ ఘర్షణలు ఆపడానికి నేను నా ప్రాణాలైనా ఇస్తా" అన్నారు. జవహర్ లాల్ నెహ్రూ తన చారిత్రక ప్రసంగం 'ట్రిస్ట్ విత్ డెస్టినీ'ని ఆగస్టు 14న అర్ధరాత్రి వైస్రాయ్ లాంజ్ (ప్రస్తుత రాష్ట్రపతి భవన్) నుంచి ఇచ్చారు. నెహ్రూ అప్పటికి ఇంకా ప్రధానమంత్రి కాలేదు. ఆయన ప్రసంగాన్ని ప్రపంచమంతా విన్నది. కానీ, గాంధీ ఆరోజు 9 గంటలకే నిద్రపోయారు. మహాత్మాగాంధీ స్వతంత్రం లభించిన రోజున దిల్లీకి వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న బెంగాల్ లోని నోవాఖలీలో ఉన్నారు. అక్కడ ఆయన హిందూ, ముస్లింల మధ్య మత ఘర్షణలను అడ్డుకోడానికి నిరాహారదీక్ష చేస్తూ ఉన్నారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల,**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...**
**9440595494**

## పర్యావరణ పరిరక్షణకు ఈత చెట్ల పెంపకం



- కమాన్‌పూర్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో మొక్కలు నాటిన సభ్యులు

**కరీంనగర్, ఆగస్టు14(సింగిడి):** కరీంనగర్ జిల్లా కమాన్‌పూర్ మండలం కొత్తపల్లి గ్రామంలోని ఎల్లమ్మ ఆలయం వద్ద గౌడ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం ఈత చెట్లను నాటారు. పర్యావరణ పరిరక్షణతో పాటు గౌడ కులవృత్తికి ఉపయోగపడే ఈత చెట్లను విరివిగా పెంచాలని ఈ సందర్భంగా పలువురు సూచించారు. కార్యక్రమానికి ఎక్సైజ్ సీఐ విజయ్ భాస్కర్, ఎస్సై నరేష్, సిబ్బంది హాజరై మొక్కలు నాటారు. గ్రామ సర్పంచ్ మానస ప్రవీణ్, ఉపసర్పంచ్ ఆరె నరేష్, మండల అధ్యక్షుడు పంజాల స్వామి గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పంజాల శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్ ఆరె అనిల్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. గౌడ సంఘం అధ్యక్షుడు బండిపెల్లి తిరుపతి గౌడ్, ఉపాధ్యక్షుడు పంజాల వేణు గౌడ్‌తో పాటు సంఘం డైరెక్టర్లు, సభ్యులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## తాగునీటి నాణ్యతలో రాజీపడవద్దు



- ఫిల్టర్ బెడ్‌ను ఆకస్మికంగా తనిఖీచేసిన మేయర్ శ్రీనివాస్

**కరీంనగర్, ఆగస్టు14(సింగిడి):** కరీంనగర్ నగరానికి సరఫరా అవుతున్న తాగునీటి నాణ్యతపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ మున్సిపల్ అధికారులతో కలిసి ఫిల్టర్ బెడ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. నీటి శుద్ధీకరణ, వడపోత, క్లోరినేషన్, నిల్వ ట్యాంకులు, నీటి నాణ్యతతో పాటు సరఫరా విధానాన్ని పరిశీలించారు. ఇటీవల కొన్ని ప్రాంతాల్లో రంగుమారిన, మట్టితో కూడిన నీరు వస్తోందన్న ఫిర్యాదులపై అధికారులు వివరాలను మేయర్ అడిగి తెలుసుకున్నారు. ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన తాగునీటి విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు. ఫిల్టర్ బెడ్ నుంచి సరఫరా అయ్యే నీరు నిర్ణీత నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నీటి శుద్ధీకరణలో ఉపయోగించే రసాయనాలను నిర్ణీత మోతాదులో వినియోగించాలని, వడపోత పరికరాలను క్రమం తప్పకుండా శుభ్రపరచాలని సూచించారు. సాంకేతిక లోపాలు, నిర్వహణ సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించాలని ఇంజినీరింగ్, నీటి సరఫరా అధికారులను ఆదేశించారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి నీటి నమూనాలను సేకరించి తరచూ నాణ్యత పరీక్షలు నిర్వహించాలని, పైప్‌లైన్ లీకేజీలు, కలుషిత నీరు కలిసే అవకాశాలను గుర్తించి మరమ్మతులు చేపట్టాలని సూచించారు. వర్షాకాలంలో నీటి కలుషితానికి అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రజలకు స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీటిని అందించడం నగరపాలక సంస్థ ప్రధాన బాధ్యత అని, నీటి నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు. తనిఖీలో కార్పొరేటర్లు మాసం గణేష్, ఏపీపీ చంద్ర, గాజా రమ శివరాం, భారీ అపర్ణ జితేందర్, ఎస్ఈ సంపత్ రావు, డీఈ దేవేందర్ రెడ్డి, ఏఈ రఘువర్ధన్ రెడ్డి, ఇంజినీరింగ్ అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# పబ్లిసిటీ కోసమే ఎమ్మెల్యే తాపత్రయం

**అభివృద్ధిని పక్కనపెట్టి అనవసరపు ఆరోపణలు**

**ప్రభుత్వాన్ని విమర్శిస్తే సహించేది లేదు**

**కాంగ్రెస్ నేత వాసాల రామస్వామి..**



**జమ్మికుంట, ఆగస్టు 14 (సింగిడి):** హుజూరాబాద్ ప్రాంత అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌బాబు ప్రభుత్వాన్ని, మంత్రులను ఒప్పించి పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, ఇందిరమ్మ ఇళ్లు తీసుకొస్తున్నారని జమ్మికుంట మండల కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ వాసాల రామస్వామి అన్నారు. ప్రజలకు అవసరమైన పథకాలు, సౌకర్యాల కోసం కృషి చేయాల్సిన సమయంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అల్లర్లు, గొడవలను ప్రోత్సహించడం సరికాదని మండిపడ్డారు. కౌశిక్‌రెడ్డి వల్ల హుజూరాబాద్ ప్రజలు ఏం నేర్చుకోవాలని ఆయన ప్రశ్నించారు. పోలీస్‌స్టేషన్‌లో ఆందోళనలు చేయడం, అధికారులను దూషించడం, రాజకీయ ప్రత్యర్థులపై తీవ్ర వ్యాఖ్యలు చేయడం, మంత్రులు, ముఖ్యమంత్రిపై విమర్శలు చేయడం నేర్చుకావాలా, ఇది అభివృద్ధికి మార్గం కాదన్నారు. ప్రజలకు కావాల్సిన విద్య, వైద్యం, రోడ్లు, ఇళ్లు, సంక్షేమ పథకాలపై ప్రశ్నించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. “టీఆర్ఎస్ నాయకులు ఇప్పటికైనా కళ్లు తెరవాలి. కౌశిక్‌రెడ్డి రాజకీయ విధానాల వల్ల ప్రజలకు ఏం ప్రయోజనం కలుగుతోందో ఆలోచించాలి. ఆయనకు బుద్ధి చెప్పాల్సిన బాధ్యత మీపైనా ఉంది” అని వాసాల రామస్వామి వ్యాఖ్యానించారు. గత ఉపఎన్నికల రాజకీయ పరిణామాలను ప్రస్తావిస్తూ.. ఈటల రాజేందర్, కేసీఆర్ మధ్య రాజకీయ విభేదాల నేపథ్యంలో మూడో వ్యక్తిగా కౌశిక్‌రెడ్డిని హుజూరాబాద్ ప్రజలపై రుద్దారని విమర్శించారు. ఈటల రాజేందర్ హైదరాబాద్‌కు వెళ్లిపోయారని, ఇప్పుడు కౌశిక్‌రెడ్డిని కూడా హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని కేసీఆర్, కేటీఆర్, వినోద్‌కుమార్‌లను కోరారు. “కౌశిక్‌రెడ్డి చేస్తున్న రాజకీయ గొడవలను హుజూరాబాద్ ప్రజలు ఇక భరించే పరిస్థితిలో లేరు. హుజూరాబాద్‌ను అభివృద్ధి బాటలో నడిపించే నాయకత్వం కావాలి. ప్రజల కోసం పనిచేస్తున్న ప్రణవ్‌బాబుకు అండగా నిలిస్తే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుంది” అని వాసాల రామస్వామి అన్నారు. అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకోవడం, వ్యక్తిగత రాజకీయ విమర్శలకు ప్రాధాన్యం ఇవ్వడం మానుకుని ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని కౌశిక్‌రెడ్డికి ఆయన హితవు పలికారు.

# సౌమ్యత్వం.. ప్రత్యర్థులకు అర్థం కాని వ్యూహం

## విలక్షణంగా ప్రజల ఆదరాభిమానాలతో దూసుకెళ్తున్న యువనేత

- నిస్వార్థ సేవ నిజాయితీగల పాలన అందించడమే ప్రణవ్ లక్ష్యం
- హుజురాబాద్ గడ్డమీద కాంగ్రెస్ జెండా ఎగిరేలా నాయకత్వం
- వన్నెతగ్గని వారసత్వం నిలబెట్టే నిండు వ్యక్తిత్వం
- ప్రజల్లో పెరుగుతున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గ్రాఫ్





**జమ్మికుంట, ఆగస్టు 14 (సింగిడి)**

వన్నె తగ్గని వారసత్వం నుంచి వచ్చిన యువనేత కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గ ఇన్ చార్జి ప్రణవ్ తన తాత వొడితల రాజేశ్వర రావు సేవా మార్గంలో ముందుకెళ్తున్నారు. నిత్యం ప్రజాక్షేత్రంలో ఉంటూ ప్రజా నాయకుడిగా ప్రజల ఆదరాభిమానాలను పొందే ప్రయత్నం చేస్తున్నారు. అనతి కాలంలోనే జనం మనసులో స్థానం పొందిన యువనేత..భవిష్యత్తులో తప్పకుండా నాయకుడిగా ఎదుగుతారని, హుజురాబాద్ గడ్డపైన ఎగిరేది కాంగ్రెస్ జెండా నే అని పలువురు కాంగ్రెస్ వాదులు , అభిమానులు పేర్కొంటున్నారు. అవినీతిరహిత నేత గా ప్రజలలో పేరుగాంచిన ప్రణవ్.. కాంట్రవర్సీలకు దూరంగా ప్రజలకు దగ్గరగా ఉంటూ తన సౌమ్యత్వ వైఖరితో ప్రత్యర్థులకు అర్థం కాని వ్యూహంతో ప్రజలకు మరింత దగ్గరవుతూ.. దూసుకు వెళ్తున్నారు.

**నిస్వార్థ సేవకుడిగా గుర్తింపు..**

నిస్వార్థ సేవ, నిజాయితీగల పాలన అందించడమే ఆయన లక్ష్యం అని కాంగ్రెస్ పార్టీ నేతలు వెల్లడిస్తున్నారు. హుజురాబాద్ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల శ్రేయస్సు కోసం నిరంతరం పనిచేసే శక్తి యుక్తి కలిగిన యువ లీడర్ ప్రణవ్ అని, ఆయన నాయకత్వంలో మూడు రంగుల జెండా రెపరెపలాడటం ఖాయమని పార్టీ వర్గాలు వెల్లడిస్తున్నాయి. అధిష్టానం ఆశీస్సులతో ప్రణవ్ నిత్యం ప్రజలతో మమేకమవుతూ.. ప్రజలకు అండదండగా నిలుస్తూ ముందుకు సాగుతున్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకు లలో కొన్నిచోట్ల విభేదాలు ఉన్నప్పటికీ ప్రజలలో ప్రణవ్ పట్ల మమకారం పెరుగుతు న్నది. స్థానిక , మున్సిపల్ ఎన్నికలలో ప్రణవ్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ చక్కటి ఫలితాలు సాధించగా, రాబోయే అన్ని ఎన్నికలలో మూడు రంగుల జెండా రెపరెపలాడటం ఖాయం అనే ధీమాను కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితులలో సౌమ్యుడిగా, వివాదరహితుడిగానే కాక పనిమంతుడు గాను ప్రణవ్ పేరు సంపాదించుకున్న నేపథ్యంలో ప్రజల హృదయాల్లో నాయకుడిగా చెరగని ముద్రను ఆయన వేసుకుంటున్నారు. భవిష్యత్తులో తప్పకుండా ఆయన నాయకత్వాన్ని ప్రజలు బలపరిచే అవకాశాలు మెండుగా ఉంటాయని పలువురు ఈ సందర్భంగా అభిప్రాయపడుతున్నారు.



# ఉత్తరాఖండ్ ఘటనపై కాంగ్రెస్ సత్యాగ్రహం

**కరీంనగర్‌లో భారీ పాదయాత్ర, బీజేపీ, ఆర్ఎస్ఎస్‌పై కాంగ్రెస్ నేతల నిరసన**

**చొప్పదండి ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ మేడిపల్లి సత్యం**



**కరీంనగర్, ఆగస్టు14(సింగిడి):** ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన సభా ప్రాంగణాన్ని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రసంగించిన అనంతరం గంగాజలంతో శుద్ధి చేశారన్న ఘటనను ఖండిస్తూ ఏఐసీసీ పిలుపు మేరకు కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో సత్యాగ్రహం నిర్వహించారు. కిసాన్‌నగర్‌లోని మహాత్మా గాంధీ విగ్రహం నుంచి కోర్టు చౌరస్తాలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు భారీ పాదయాత్ర చేపట్టారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి చొప్పదండి ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ మేడిపల్లి సత్యం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, మాజీ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కాంగ్రెస్ నేత ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్లు గడిచినా కుల వివక్ష, అంటరానితనం కొనసాగడం దురదృష్టకరమన్నారు. ఖర్గే ప్రసంగించిన సభా ప్రాంగణాన్ని శుద్ధి చేయడం ఆయనను మాత్రమే కాకుండా దేశంలోని దళిత, బహుజన వర్గాలను అవమానించడమేనని అన్నారు. దళితులు, బహుజనులపై వివక్షను ప్రోత్సహించే చర్యలను ఖండిస్తూ, ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మల్లికార్జున ఖర్గేతో పాటు దేశంలోని దళిత, బహుజన వర్గాలకు క్షమాపణ చెప్పాలని కోరారు. బాధ్యులపై చర్యలు తీసుకోకపోతే రాహుల్ గాంధీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో మార్కెట్ చైర్మన్ ఆకుల నర్సయ్య, అర్బన్ బ్యాంకు చైర్మన్ గడ్డం విలాస్ రెడ్డి, సత్యప్రసన్న రెడ్డి,పులి ఆంజనేయులు గౌడ్, స్వామి గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రోత్సాహకాలు అందిస్తాం.. పాల ఉత్పత్తిని పెంచండి

**కరీంనగర్ డైరీ చైర్మన్ చెలిమెడ రాజేశ్వరరావు**

**శాయంపేటలో పాల సేకరణ భవన ప్రారంభోత్సవం**



**జమ్మికుంట, ఆగస్టు 14 (సింగిడి):** శాయంపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన కరీంనగర్ డెయిరీ పాల సేకరణ కేంద్ర భవనాన్ని శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కరీంనగర్ డెయిరీ చైర్మన్ డాక్టర్ చెలిమెడ రాజేశ్వర్ రావు ముఖ్య అతిథిగా హాజరై భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శాయంపేట కరీంనగర్ డెయిరీ పాల సేకరణ సంస్థ అధ్యక్షుడు మడికొండ నర్సింగరావు, గ్రామ సర్పంచ్ మడికొండ సురేందర్ రావు, ఉపసర్పంచ్ ఉదయశ్రీ, గ్రామ పాలకవర్గ సభ్యులు ప్రత్యేకంగా పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్రంలో స్వచ్ఛమైన నాణ్యమైన పాలను అందిస్తుంది కరీంనగర్ డైరీ మాత్రమే అని వారు పేర్కొన్నారు. పాడి పరిశ్రమను ప్రోత్సహించేందుకు కరీంనగర్ డైరీ రైతులకు అండగా ఉంటుందని ముఖ్యంగా రైతులు గేదెలను పెంచి నాణ్యమైన పాలను ఉత్పత్తి చేయాలని వారికి సూచించారు. ప్రస్తుతం శాయంపేట లో రోజుకు సుమారు 200 లీటర్ల పాలు అందుబాటులోకి వస్తున్నాయని వాటిని కనీసం 1000 లీటర్లకు వచ్చే విధంగా రైతులు చర్యలు చేపట్టాలని మీకు కావాలంటే గేదలు కొనుగోలు చేయడానికి ఆర్థిక చేయూతను అందిస్తామని అంతేకాకుండా ప్రమాదవశాత్తు గేదలు మరణిస్తే ఇన్సూరెన్స్ ద్వారా డబ్బులు వచ్చే విధంగా ఏర్పాటు చేస్తామని వారు సూచించారు. ప్రభుత్వం పాడి పరిశ్రమను ప్రోత్సహించడానికి సిద్ధంగా ఉందని ప్రజలకు నాణ్యమైన పాలు దొరకక నాణ్యతలేని పాలను తాగుతున్నారని కరీంనగర్ డైరీ ద్వారా స్వచ్ఛమైన పాలను అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డెయిరీ బోర్డు డైరెక్టర్లు అంతం రమాదేవి, పెద్దిరెడ్డి తిరుపతి రెడ్డి,జమ్మికుంట ఎం సి సి మేనేజర్ ముస్కు అంజిరెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ పొన్నగంటి రాజేందర్, సూపర్‌వైజర్లు పి. మహేందర్, కె .రవీందర్, వెటర్నరీ అసిస్టెంట్ శ్రీకాంత్ తదితరుల పాల్గొన్నారు.

# వీధి వ్యాపారులకు చైర్మన్.. అభయహస్తం

- చిరు వ్యాపారులకు ఆర్థిక భారం కలగకుండా కౌన్సిల్ నిర్ణయం
- వీధి వ్యాపారుల సంక్షేమమే ముఖ్యం
- మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్




**జమ్మికుంట, ఆగస్టు 14 (సింగిడి):** వీధి వ్యాపారులపై ఆర్థిక భారం పడకుండా కౌన్సిల్లో నిర్ణయం తీసుకొని వారి పాలిట అభయహస్తం అందించారు ప్రశాంత్ కుమార్. వీధి వ్యాపారం చేసే వారికి ఎలాంటి ఆర్థిక భారం పడకుండా యూజర్స్ చార్జీలను గణనీయంగా తగ్గిస్తూ చైర్మన్ ప్రశాంత్ కుమార్ ఆధ్వర్యంలో మున్సిపల్ కౌన్సిల్ నిర్ణయం తీసుకుంది. దీని ప్రకారం ప్రతిరోజు వీధి వ్యాపారం చేసుకునే వారి వద్ద నుండి 11 రూపాయల చొప్పున సంవత్సరానికి ?4,800 యూజర్ చార్జిగా వసూలు చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ వీధి వ్యాపారులు చెల్లించే ప్రతి రూపాయికి మున్సిపాలిటీ తరఫున అధికారికా రసీదు అందజేయడం జరుగుతుందని యూజర్ చార్జీల వసూళ్లు పూర్తిగా ఆరదర్శకంగా రసీదుల ద్వారానే నిర్ణయించబడతాయని పేర్కొన్నారు. వీధి వ్యాపారులు మున్సిపాలిటీ అందిస్తున్న పారిశుద్ధ చెత్త సేకరణ ఇతర ప్రజాసేవలకు సహకరిస్తూ సక్రమంగా బిల్లులు చెల్లించడంతోపాటు తమ వ్యాపార ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన కోరారు. వీధి వ్యాపారుల అభివృద్ధి మున్సిపల్ అభివృద్ధిలో భాగస్వామ్యం ఉంటుందని, అందరి సహకారంతో జమ్మికుంట మున్సిపాలిటీని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు సహాయ సహకారాలు అందజేయాలని చైర్మన్ ప్రశాంత్ కుమార్ వెల్లడించారు. అనంతరం వీధి వ్యాపారం చేసుకునే పలువురికి వారు కట్టిన సంవత్సరం బిల్లుకు గాను రసీదును అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి సానిటరీ ఇన్స్పెక్టర్ రమేష్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

**తపాలా ఇంటర్నేషనల్ ట్రాక్డ్ ప్యాకెట్ సేవలను సద్వినియోగం చేసుకోండి**

పోస్ట్ మాస్టర్ మహేందర్




**జమ్మికుంట, ఆగస్టు 14 (సింగిడి):** రాఖీ పౌర్ణమి సందర్భంగా రాఖీలను అతి చౌక ధరకు విదేశాల్లో ఉన్న అన్న దమ్ములకు పంపించుకునే అవకాశం ఉందని పోస్ట్ మాస్టర్ మహేందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని ప్రజలు అతి చౌక ధరతో విదేశాలలో నివసిస్తున్న తమ బంధువులకు, చిన్న చిన్న పరిశ్రమలు నిర్వహిస్తూ ఈ కామర్స్ ద్వారా విదేశాలకు వస్తువులు పంపే ఎగుమతి దారుల కోసం చిన్న చిన్న పాకెట్లను పార్సెళ్లను పంపేందుకు కోసం ఇంటర్నేషనల్ ట్రాక్డ్ ప్యాకెట్ అనే నూతన సేవలను భారత తపాలా శాఖ ప్రారంభించిందని తెలిపారు. ఇది రెండు కిలోల వరకు బరువు ఉన్న వస్తువులను ఎండ్ -టూ -ఎండ్ ట్రాకింగ్ సేవలతో యూనివర్సల్ పోస్టల్ యూనియన్ లో సభ్యత్వం కలిగిన అమెరికా, కెనడా, నూజిలాండ్, బ్రిటన్, జర్మనీ,సింగపూర్, జపాన్, యు ఏ ఈ, సౌదీ అరేబియా లాంటి 192 దేశాలకు రవాణా చేయడానికి వీలు కలదని తెలిపారు. 250 గ్రాముల వరకు బరువున్న ప్యాకెట్ ఖరీదు 560/- పన్నులతో కలిపి 660. ఈ ప్యాకెట్ సేవ ద్వారా రాఖీలు, బట్టలు, పూజ సామాగ్రి, పుట్టిన రోజు, పెళ్లిరోజు బహుమతులు విదేశాల్లో ఉన్న బంధువులకు పంపుకోవచ్చునని పేర్కొన్నారు. 250 గ్రాముల వరకు బరువు కలిగిన పార్సెల్ ఖరీదు 1000. పన్నులతో కలిపి 1180/. ఈ పార్సెల్ సేవ ద్వారా పచ్చళ్ళు, తిను బండారాలు వివిధ రకాల వస్తువులు విదేశాలకు పంపుకోవచ్చు అని తెలిపారు. విదేశాలకు ఈ సేవ ద్వారా పంపే వస్తువులు కనిష్టంగా 7రోజులు గరిష్టంగా 15రోజులోపు చేరుకునే అవకాశం కలదని తెలిపారు.

## తాగునీటి సమస్యలు వెంటనే పరిష్కరించాలి



**పెద్దపల్లి, ఆగస్టు 14(సింగిడి):** జిల్లాలోని ప్రతి గ్రామం, వార్డులో తాగునీటి సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో తాగునీటి సరఫరాపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. తాగునీటి నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, ప్రజలకు సురక్షితమైన నీరు అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామాలు, వార్డుల వారీగా సమస్యలపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని ఆదేశించారు. సమావేశంలో మిషన్ భగీరథ అధికారులు పాల్గొన్నారు.

# రైతులు వరి వేసుకోకండి.. నష్టపోకండి

● జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్



**నల్లగొండ ప్రతినిధి, ఆగస్టు 14 (సింగిడి ):** ఖరీఫ్ సీజన్ సమయం ముగిసినందున జిల్లాలోని రైతులు ఎట్టి పరిస్థితులలో వరి వేయవద్దని, వరి వేస్తే నష్టపోవాల్సి వస్తుందని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ నల్గొండ జిల్లా, తిప్పర్తి మండల కేంద్రం శివారులో వరి సాగుకు భూములు సిద్ధం చేసుకుంటున్న రైతులు మోహన్, పరశురాం, ఖాదర్ తదితరులతో మాట్లాడారు. వరి పంటకు సాగునీటి అవకాశాలే లేవని, అలాంటప్పుడు వరి ఎందుకు వేస్తున్నారని జిల్లా కలెక్టర్ ప్రశ్నించారు. బలవంతంగా వరి సాగు చేస్తే నష్ట పోవలసి వస్తుందని రైతులతో చెప్పారు. ఆరతడి పంటలు వేసుకుంటే నష్టం లేకుండా, ఆదాయం వస్తుందని తెలియజేస్తూ ఆరుతడి పంటలపై అవగాహన కల్పించారు. ఎల్ నినో ప్రభావం వల్ల ఈ సంవత్సరం వర్షాలు కురిసే అవకాశం లేదని, వచ్చే ఖరీఫ్ సీజన్ వరకు వర్షాలు కురిసే అవకాశం లేనందున ప్రస్తుతం వరి వేసుకునేందుకు పరిస్థితులు అనుకూలంగా లేవని, అంతేకాక ప్రాజెక్టుల నుండి కూడా సాగునీరు వచ్చే అవకాశం లేదని, శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల నుండి కూడా సాగునీరు రాదని, వర్షం లేకపోవడం, ప్రాజెక్టుల ద్వారా సాగునీరు లేకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటిపోయి బోర్లలో నీరు తగ్గిపోయిందని తెలిపారు. తిప్పర్తి మండల కేంద్రం శివారులో చౌడు భూముల్లో రైతులు వరి పంటకు సిద్ధం చేయడాన్ని గమనించిన కలెక్టర్ చౌడు భూముల్లో మినుములు, పెసర వంటి పంటలు వేసుకోవాలని, మినుము, పెసర పంటలకు పెట్టుబడి తక్కువని, ఎకరాకు 8000 చొప్పున ఆదాయం వస్తుందని, అదే వరి పంటకు పెట్టుబడి ఎక్కువని, పొరపాటున నీళ్లు లేక, వర్షం రాక పెట్టిన పెట్టుబడి కూడా రాక రైతు అప్పుల పాలు కావాల్సి వస్తుందని అన్నారు. చవుడు భూములలో జిప్సం వేసుకున్నట్లయితే మినుము, పెసర పంటల లాంటివి సులభంగా తీసుకో వచ్చని, అంతేకాక చౌడు నెలల్లో రేగు, కూరగాయలు, ఇతర ఉద్యాన పంటలు కూడా వేసుకునేందుకు అవకాశం ఉందని, ఈ దిశగా రైతులు ఆలోచించి ఆరుతడి పంటలు ,ఉద్యాన పంటలు వేసుకునేలా చూడాల్సిందిగా ఆయన వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఇందుకు జిల్లా కలెక్టర్ స్పందిస్తూ యూరియా ఇండెంట్ పంపాల్సిందిగా జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్ .వ్యవసాయ సహాయ సంచాలకులు విజయేందర్ రెడ్డి, సన్నీ రాజ్, గిరిరాజు ,ఏవో శ్రీనివాస్, ఏ ఈ ఓ సంతోషి ఉన్నారు.

## కరీంనగర్‌లో ఘనంగా 'హర్ ఘర్ తిరంగా' భారీ తిరంగా ర్యాలీ




**కరీంనగర్, ఆగస్టు14(సింగిడి):** భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో 'హర్ ఘర్ తిరంగా' అభియాన్‌లో భాగంగా శుక్రవారం భారీ తిరంగా ర్యాలీని జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ చౌక్ నుంచి రామ్‌నగర్ వరకు సాగిన ర్యాలీలో వేలాది మంది కళాశాల విద్యార్థులు, యువత, మహిళలు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు త్రివర్ణ పతాకాలు చేతబూని ఉత్సాహంగా పాల్గొన్నారు. ర్యాలీ పొడవునా 'భారత్ మాతాకీ జై', 'వందేమాతరం', 'జైహింద్' నినాదాలు మార్మోగాయి. త్రివర్ణ పతాకాల రెపరెపలతో కరీంనగర్ వీధులు దేశభక్తి ఉత్సాహంతో నిండిపోయాయి. యువతలో జాతీయ భావాన్ని, దేశంపై మమకారాన్ని పెంపొందించేలా ర్యాలీ ఆకట్టుకుంది. ముఖ్య అతిథులుగా హాజరైన మాజీ ఎమ్మెల్యే ధర్మారావు, కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ, 'హర్ ఘర్ తిరంగా' అభియాన్ ప్రతి పౌరుడిలో జాతీయ భావాలను ఇనుమడింపజేసే గొప్ప కార్యక్రమమని అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన మహనీయులు, స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. కుల, మత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా ప్రతి భారతీయుడు జాతీయ జెండా నీడన ఐక్యంగా నిలవాలని, త్రివర్ణ పతాక గౌరవాన్ని కాపాడుతూ దేశ ప్రతిష్ఠను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని కోరారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ర్యాలీని విజయవంతం చేసిన విద్యార్థులు, యువత, పార్టీ నాయకులు, కార్యకర్తలకు వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, మాజీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, జిల్లా నాయకులు, వివిధ మండలాలు, జోన్ల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

## చేనేత సహకార సంఘం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల



**మిర్యాలగూడ ఆగస్టు 14(సింగిడి ):** మిర్యాలగూడ చేనేత సహకార సంఘం పాలకమండలి ఎన్నికలకు సంబంధించిన ఎన్నికల నోటిఫికేషన్‌ను గురువారం ఏఓ (అసిస్టెంట్ ఆఫీసర్) అధికారికంగా విడుదల చేశారు. ఏఓ గారి చేతుల మీదుగా నోటిఫికేషన్ విడుదల కావడంతో ఎన్నికల ప్రక్రియకు శ్రీకారం చుట్టినట్లైంది. ఈ కార్యక్రమంలో ఏఓతో పాటు చేనేత సహకార సంఘం మేనేజర్, ప్రస్తుత (పాత) పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు. ఎన్నికల ప్రక్రియను నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా చేనేత సంఘం సభ్యులు ఎన్నికల ప్రక్రియ విజయవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు.

# తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక బోనాలు

● ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



**మిర్యాలగూడ ఆగస్టు 14(సింగిడి ):** తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రత్యేక శ్రవణ మాస బోనాల ఉత్సవాలు అని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. గురువారంమిర్యాలగూడ మండలం తకెళ్లపాడు గ్రామంలో నిర్వహించిన శ్రావణ మాస బోనాల మహోత్సవంలో పాల్గొన్నారు. తొలుత అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. అనంతరం మాట్లాడుతూ శ్రావణ మాస బోనాల మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించిన గ్రామ ప్రజలకు, నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామంలో ఆధ్యాత్మికత, ఐక్యత, సాంస్కృతిక సంప్రదాయాలను కొనసాగిస్తూ ఇలాంటి పండుగలను భక్తిశ్రద్ధలతో నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో తక్కెళ్ళపాడు గ్రామ సర్పంచ్ సిహెచ్ సుజాత జానయ్య, యాద్గార్పల్లి సర్పంచ్ జొన్నలగడ్డ శ్రీనివాస్ రెడ్డి, డిసిసి కార్యదర్శి చిలుకూరు బాలు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కొప్పుల సైదులు, మండల పార్టీ అధ్యక్షులు గుండు నరేందర్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు గాయం ఉపేందర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, బంటు శ్రీనివాస్, ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత తదితరులు పాల్గొన్నారు.

## గతంలో డ్రా తీసిన వాళ్లకే డబల్ బెడ్ రూమ్ ఇండ్లు

పట్టణ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్



**నల్గొండ ప్రతినిధి ఆగస్టు 14(సింగిడి ):** ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అసంపూర్తిగా ఉన్న ఎలక్ట్రికల్, వాటర్ సప్లై, డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసింది నల్లగొండ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు ఎడ్ల శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గతంలో డబల్ బెడ్ రూమ్ ఇండ్లకు సంబంధించి లాటరీ తీసి లబ్ధిదారులను ఎంపిక చేశారని తెలిపారు. డ్రా తీసిన తర్వాత మిగిలిన ఇండ్లకు గతంలో దరఖాస్తు చేసుకున్న వారితో పాటు ప్రజావాణి మంత్రి కోమటిరెడ్డి వెంకట్రెడ్డి ప్రజా దర్బారులో వచ్చిన దరఖాస్తులన్నింటినీ పరిశీలించి నిరుపేదలకు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. డబల్ బెడ్ రూమ్ ఇండ్లకు సంబంధించి కొంతమంది దళారులు కావాలని ఆరోపణలు చేస్తున్నారు. వారి మాటలు ఎవరూ నమ్మవద్దు అన్నారు. పనులన్నింటినీ పూర్తి చేసి డబల్ బెడ్ రూమ్ లబ్ధిదారులకు అతి త్వరలో కేటాయించడం జరుగుతుంది.

# తలకు గాయమైతే నిర్లక్ష్యం వద్దు..

● యశోదా ఆసుపత్రి వైద్యుల అత్యవసర చికిత్సతో 14 ఏళ్ల బాలుడికి పునర్జన్మ



**కోదాడ, ఆగస్టు 14(సింగిడి ):** రోడ్డు ప్రమాదంలో తలకు గాయమైనప్పుడు బయటకు గాయం కనిపించ కపోయినా నిర్లక్ష్యం చేయొద్దని వైద్యులు హెచ్చరిస్తు న్నారు. పుర్రె లోపల రక్తస్రావం జరిగి మెదడుపై ఒత్తిడి పెరిగితే ప్రాణాపాయం సంభవించే అవకాశం ఉందని తెలిపారు. కోదాడకు చెందిన 14 ఏళ్ల మల్లెబోయిన తేజ దురాజ్‌పల్లి సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడి స్పృహ కోల్పోయాడు. మూర్ఛ రావడంతో మలక్‌పేట్ యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించగా.. పరీక్షల్లో పుర్రె లోపల భారీగా రక్తం పేరుకుపోయి మెదడుపై తీవ్ర ఒత్తిడి ఏర్పడినట్లు వైద్యులు గుర్తించారు. మెదడు సహజ స్థానంలో నుంచి పక్కకు జరిగినట్లు నిర్ధారించారు. పక్కటెముక విరగడంతో ఊపిరితిత్తి చుట్టూ గాలి చేరినట్లు గుర్తించారు. డా. శ్రీనివాస్ బొట్ల నేతృత్వంలోని వైద్యబృందం అత్యవసరంగా క్రానియోటమీ చేసి మెదడుపై ఒత్తిడి కలిగిస్తున్న రక్తాన్ని తొలగించింది. దెబ్బతిన్న పుర్రె ఎముకను టైటానియం ప్లేట్లు, స్క్రూలతో పునర్నిర్మించారు. ఊపిరితిత్తి సమస్యకు చికిత్సతో పాటు శ్వాసమార్గ నిర్వహణ కోసం ట్రాకియోస్టమీ చేశారు. న్యూరోసర్జరీ, క్రిటికల్ కేర్, కార్డియోథొరాసిక్, పీడియాట్రిక్స్ విభాగాల వైద్యులు సమన్వయంతో చికిత్స అందించి బాలుడి ప్రాణాలను కాపాడారు.

**ప్రతి నిమిషం కీలకం**

ప్రమాదం తర్వాత స్పృహ కోల్పోవడం, మూర్ఛ, అసాధారణ మగత, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆసుపత్రికి తరలించాలని డా. శ్రీనివాస్ బొట్ల సూచించారు. సకాలంలో పరీక్షలు, అత్యవసర న్యూరోసర్జరీ అందితే శాశ్వత మెదడు నష్టాన్ని నివారించవచ్చని యశోదా మలక్‌పేట్ ఆసుపత్రి అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిదుర తెలిపారు. ఈ కార్యక్రమంలో డా. శ్రీనివాస్ బొట్ల (న్యూరోసర్జన్), వాసుకిరణ్ రెడ్డి, వెంకటేశ్వర్లు, ప్రకాష్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలకు ప్రోత్సాహాన్ని అందించాలి

ఎమ్మెల్యే సతీమణి మాధవి

**మిర్యాలగూడ ఆగస్టు 14 (సింగిడి ):** ప్రభుత్వ పాఠశాలలకు ప్రోత్సాహం అందించాలని ఎమ్మెల్యే సతీమణి మాధవి అన్నారు. గురువారం మిర్యాలగూడ మండలం ఉట్లపల్లి గ్రామం లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గ్రామ మాజీ సర్పంచ్ మేడ సురేందర్ రెడ్డి సుచరిత దంపతుల సహకారంతో గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజన ప్లేట్లు, పండ్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి సతీమణి మాధవి, కుమారుడు సాయి ప్రసన్న రెడ్డి పాల్గొనడం జరిగింది. వారు మాట్లాడుతూ గ్రామంలో గ్రామ అభివృద్ధికి మా నుండి ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా తప్పక చేయడం జరుగుతుందని, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటామని తెలిపారు. దాత మేడ సురేందర్ రెడ్డి మాట్లాడుతూ,... గ్రామ అభివృద్ధికి తమ సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని అన్నారు .అలాగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎమ్మెల్యే సతీమణి మాధవి మరియు కుమారుడు సాయి ప్రసన్నారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సలీమా, గ్రామ కార్యదర్శి రాధ, వార్డు సభ్యులు జానయ్య, అయోధ్య, లక్ష్మమ్మ, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు బట్టు వెంకన్న, షాబుద్దీన్, బొంగరాల కిరణ్, బొప్పిడి శ్రీనివాస్ రెడ్డి, సంజీవ, ప్రసాద్, వీరబాబు, మేధా ఫౌండేషన్ ఫౌండర్స్ నాగరాజు, వేణు, మరియు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు,ప్రజలు పాల్గొన్నారు.

# వెదురు సాగుతో అధిక లాభాలు

● జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**భూపాలపల్లి ప్రతినిధి, ఆగస్టు 14(సింగిడి ):** రైతులు సంప్రదాయ వ్యవసాయంతో పాటు వెదురు సాగును చేపట్టి అదనపు ఆదాయాన్ని పొందవచ్చని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. గురువారం మహాదేవపూర్ మండలం సూరారం గ్రామంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పెంచుతున్న వెదురు మొక్కల నర్సరీని జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నర్సరీలో మొక్కల పెంపకం, నిర్వహణ, పంపిణీకి సిద్ధంగా ఉన్న మొక్కల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వెదురు సాగు తక్కువ నిర్వహణ ఖర్చుతో దీర్ఘకాలికంగా లాభాలను అందించే ఆదాయ వనరుగా నిలుస్తుందని తెలిపారు. రైతులు వెదురు సాగును ప్రత్యామ్నాయ ఆదాయ మార్గంగా చేపట్టి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని ఆరు మండలాల్లో వెదురు మొక్కల పెంపకం కొనసాగుతోందని, సుమారు 70 వేల వెదురు మొక్కలు రైతులకు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ఇప్పటికే 1,200 మంది రైతులను వెదురు సాగు కోసం గుర్తించినట్లు, 15 కుంటల భూమికి ఒక్కో రైతుకు 60 వెదురు మొక్కలను ఉచితంగా అందజేయనున్నట్లు వెల్లడించారు. వెదురు సాగు చేపట్టిన రైతులకు విబిజి రాంజీ పథకం ద్వారా నిర్వహణ ఖర్చులను కూడా ప్రభుత్వం చెల్లించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. రైతుల ఆదాయాన్ని పెంచే లక్ష్యంతో ప్రభుత్వం వెదురు సాగును ప్రత్యేకంగా ప్రోత్సహిస్తోం దని పేర్కొన్నారు. అనంతరం నర్సరీని సమర్థవంతంగా నిర్వహిస్తున్న గ్రామ సంఘం అధ్యక్షురాలిని జిల్లా కలెక్టర్ అభినందించారు. నర్సరీ నిర్వహణలో మహిళా సంఘాల భాగస్వామ్యాన్ని ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి బాలకృష్ణ, కాటారం ఆర్డీఓ రవీందర్, ఇండస్ట్రీ ఫౌండేషన్ జిల్లా కో ఆర్డినేటర్ తాండ్ర సురేష్, స్థానిక సర్పంచ్, గ్రామీణ అభివృద్ధి సంస్థ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలి

జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి నాగసాగర్




**భూపాలపల్లి ప్రతినిధి, ఆగస్టు 14 (సింగిడి ):** గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలి అని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి నాగసాగర్ సూచించారు. గురువారం మేడిపల్లి, మహదేవ్‌పూర్, కాళేశ్వరం ఆశ్రమ ఉన్నత పాఠశాలలను సందర్శించి విద్యార్థుల విద్యా ప్రమాణాలు, వసతులు, పాఠశాలల నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా బాలికల పాఠశాలల్లో విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి విద్యాభ్యాసం, భోజనం, వసతులు, పాఠశాలలో ఎదురవుతున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. మహదేవ్‌పూర్ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన డీటీడీఓ భోజన నాణ్యత, అమలు చేస్తున్న కామన్ మెనూపై విద్యార్థుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. మూడు పాఠశాలల్లో కామన్ మెనూ సక్రమంగా అమలు అవుతున్నట్లు, ఉపాధ్యాయులు రూపొందించిన లెసన్ ప్లాన్స్ సంతృప్తికరంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థుల మధ్య సమన్వయం బాగుందని, పాఠశాలల్లో సానుకూల వాతావరణం ఉందని పేర్కొన్నారు. విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడిన సందర్భంగా వారి నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాలేదని విద్యార్థులు అందరు సంతోషంగా ఉన్నట్లు గుర్తించినట్లు డీటీడీఓ నాగసాగర్ తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన భోజనం, వసతులు అందేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించాలని ఆదేశించారు. పాఠశాలల్లో విద్యార్థుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు.

## సింగరేణి ఆధ్వర్యంలో సామాజిక చైతన్యం, మానవత్వం

జీఎం ఏనుగు రాజేశ్వర్ రెడ్డి

ఆగస్టు 14 నుండి 16 వరకు నిర్వహించనున్నట్లు వెల్లడి



**భూపాలపల్లి ఆగస్టు 14(సింగిడి ):** సామాజిక చైతన్యం, మానవత్వం, మానవతా విలువలు, మహనీయుల ఆశయాలను ప్రజలలోకి తీసుకువెళ్లే ఉద్దేశంతో సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో మూడు రోజులు సామాజిక చైతన్య నాటకోత్సవాలను నిర్వహించినట్లు ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ నాటక ఉత్సవాలు ఆగస్టు 14 నుండి 16 వరకు ప్రతిరోజు సాయంత్రం 6 గంటల 30 నిమిషాలకు స్థానిక కృష్ణ కాలనీ సి ఈ ఆర్ క్లబ్ మినీ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన తెలిపారు. ఇందులో భాగంగా ఆగస్టు 14న డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ జీవితం, ఆశయాలు, లక్ష్యాలను ప్రతిబింబించేలా "శరణం శరణం గచ్ఛామి" నాటకాన్ని ప్రదర్శించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా 15న మహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల జీవిత పోరాటం, సామాజిక సంస్కరణలు, మానవత్వ సందేశాన్ని తెలియజేసే "సత్య బోధన" నాటకాన్ని 16న డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ ఆలోచన ప్రస్థానం, బుద్ధతత్వం వైపు ఆయన ప్రయాణాన్ని ప్రతిబింబించే "బుద్ధునితో నా ప్రయాణం" నాటకాన్ని ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు. ఈ మూడు రోజుల నాటకోత్సవాలకు ప్రజలు, కార్మికులు, ఉద్యోగులు, యువత, విద్యార్థులు, స్థానిక ప్రజలు, సేవా సమితి సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై నాటక ప్రదర్శనలను విజయవంతం చేయవలసిందిగా జీఎం కోరారు.

# గోపాల్పూర్ చెరువు అంశంపై విజిలెన్స్ విచారణ.?



**హనుమకొండ, ఆగస్టు 14(సింగిడి ):** హనుమకొండ గోపాల్పూర్ చెరువుకు సంబంధించిన అంశంపై విజిలెన్స్ అధికారులు విచారణ చేపడుతున్నట్లు తెలిసింది. విజిలెన్స్ డీజీ ఆదేశాల మేరకు వరంగల్ విజిలెన్స్ అధికారులు బల్దియాలోని టౌన్ ప్లానింగ్ విభాగానికి చేరుకుని చెరువుకు సంబంధించిన కీలక రికార్డులు, అనుమతుల వివరాలను కూడా సేకరిస్తున్నారు. గోపాల్ పూర్ చెరువు మొత్తం విస్తీర్ణం ఎంత? చెరువుకు సంబంధించిన మాస్టర్ ప్లాన్ మ్యాప్‌లో హద్దులు ఎలా ఉన్నాయి? చెరువు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఇప్పటివరకు ఎన్ని నిర్మాణాలకు అనుమతులు ఇచ్చారు? చెరువు పరిధికి సమీపంలో ఏమైనా నిర్మాణాలకు పర్మిషన్లు మంజూరు చేశారా? అనే అంశాలపై అధికారులు వివరాలు పరిశీలిస్తున్నట్లు సమాచారం. అలాగే చెరువు పరిధి, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, మాస్టర్ ప్లాన్, లేఅవుట్ అనుమతులు, భవన నిర్మాణ అనుమతులు, సంబంధిత ఫైళ్లు, నోట్ ఫైల్స్, పర్మిషన్ రికార్డులు తదితర పూర్తి డాక్యుమెంట్లను విజిలెన్స్ అధికారులు టౌన్ ప్లానింగ్ అధికారులను కోరినట్లు తెలుస్తోంది. చెరువు విస్తీర్ణం, హద్దులు, చుట్టుపక్కల ఇచ్చిన అనుమతులు, వాటికి సంబంధించిన నిబంధనలు పాటించారా లేదా అనే అంశాలపై రికార్డుల ఆధారంగా సమగ్రంగా విచారణ కొనసాగనున్నట్లు సమాచారం. అయితే చెరువు మొత్తం 21 ఎకరాల ఒక గుంట విస్తీర్ణంలో ఉండగా చెరువు పరిధి విస్తీర్ణంలో సుమారు15 ఎకరాలు కబ్జాకు గురైనట్లు విశ్వసనీయ సమాచారం.

## అర్హులందరికీ చేయూత పథకం అమలు చేస్తాం

చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి



**యాదాద్రి భువనగిరి, ఆగస్టు 14 (సింగిడి ):** భువనగిరి మున్సిపాలిటీలోని 35 వార్డుల్లో అర్హులైన ప్రతి ఒక్కరికి చేయూత పథకం వర్తింప చేస్తామని మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలోని సమావేశం హాల్లో చైర్పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ అధ్యక్షతన మున్సిపల్ కమిషనర్ చంద్రారెడ్డి సమక్షంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన పెన్షన్ల ప్రక్రియను ప్రకటించడంతో అర్హులైన పేదవారికి చేయూత పథకం దరఖాస్తుల స్వీకరణ హడావుడి పెరిగింది. పట్టణంలోని ప్రజా ప్రతినిధుల వార్డులలో అర్హులైన వారికి పెన్షన్ పథకం దరఖాస్తులు స్వీకరించాలని అధికారులకు సూచించారు. దరఖాస్తులను వార్డుల వారిగా పరిశీలించాలని అధికారులకు కోరారు. రాష్ట్ర ప్రభుత్వము అందజేసిన మార్గదర్శకాలు ప్రకారం సామాజిక పెన్షన్లు ఒంటరి మహిళలు, కల్లు గీత కార్మికులు, వితంతువులు, చేనేత కార్మికులు, ఫైలేరియా, వికలాంగులు, తలెసేమియా, సికిల్ సెల్ డిసీస్, ఏమో పిలియా సంబంధించిన వారు మాత్రమే దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. పెన్షన్ విషయంలో సభ్యులు సూచన సలహాలు కూడా స్వీకరించారు. చేయూత పింఛన్ పేద ప్రజలకు ఒక అండ అని అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్ తప్పనిసరిగా అందజేస్తామని తెలిపారు. దరఖాస్తులు నింపడంలో ఎలాంటి అనుమా నాలు ఉన్న వార్డ్ ప్రజాప్రతినిధులు లేదా వార్డ్ ఆఫీసర్ సలహాలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో వైస్ పర్సన్ పోతంశెట్టి మంజుల, సభ్యులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పంటలు ఎండిపోతున్నాయి అమరవరం లిఫ్ట్ నడిపించాలి

● మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కోరిన కాల్వపల్లి సర్పంచ్ సక్రూనాయక్



**హుజూర్నగర్, ఆగస్టు 14(సింగిడి ):** ఎల్నినో ప్రభావంతో వర్షాలు లేకపోవడంతో సాగు చేసిన పంటలకు సరిపడా నీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. నీరు లేక పంట పొలాలు ఎండిపోతుండటంతో రైతుల సమస్యను గుర్తించిన కాల్వపల్లి తండా సర్పంచ్ సక్రూ నాయక్ తన తోటి వారు దొనబండ తండా సర్పంచ్ అరుణ దేశ్ పాండు, అల్లిపురం సర్పంచ్ జ్యోతి పిచ్చిరెడ్డి, మాజీ సర్పంచ్ హనుమ నాయక్, ఉప సర్పంచ్ నితిన్ నాయక్, విజయ్, చంటి తదితరులు కలసి రైతుల సమస్యను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. కాల్వపల్లి సర్పంచ్ సక్రూ నాయక్ మాట్లాడుతూ వర్షాలు లేక పంటలకు నీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రైతుల పంటలను కాపాడేందుకు అమరవరం లిఫ్ట్‌ను వెంటనే నడిపించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుల పంటలను కాపాడేందుకు అమరవరం లిఫ్ట్‌ను నడిపించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని వారు మంత్రిని కోరారు. రైతుల సమస్యను సానుకూలంగా విన్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందిస్తూ, అమరవరం లిఫ్ట్ నడిచేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మంత్రి హామీపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. రైతుల కష్టాలను గుర్తించి పంటలను కాపాడేందుకు చర్యలు తీసుకోవడం పట్ల సర్పంచ్‌లు, రైతులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.



# ఇంటి పెరట్లోనే ఆర్గానిక్ బీట్‌రూట్..

బీట్‌రూట్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. రక్తాన్ని పెంచడంలో అద్భుతమైన మేలు చేస్తుంది. జ్యూస్‌లు, సలాడ్లలో దీనిని విరివిగా వాడుతుంటారు. అయితే, మార్కెట్లో కెమికల్స్ వేసి పండించే వాటికంటే, ఇంట్లోనే పూర్తిగా సేంద్రియ ( పద్ధతిలో బీట్‌రూట్‌ను సులభంగా పెంచవచ్చు. దీనికోసం పెద్ద పొలాలు అవసరం లేదు, కేవలం 10-12 ఇంచుల లోతున్న చిన్న కుండీ లేదా గ్రో బ్యాగ్ కూడా సరిపోతుంది. సరైన మట్టి మిశ్రమం, విత్తనాలు నాటే పద్ధతి, నీటి యాజమాన్యాన్ని పాటిస్తే చాలు, ఇంట్లోనే తియ్యని, రసాయనాలు లేని తాజా బీట్‌రూట్‌ను కోసుకోవచ్చు. కిచెన్ గార్డెన్‌లో బీట్‌రూట్ పెంపకానికి సంబంధించిన పూర్తి గైడ్ ఇక్కడ చూద్దాం..



**సరైన కుండీ పరిమాణం ఎంచుకోవడం:**
బీట్‌రూట్ దుంపలు మట్టి లోపల ఎదుగుతాయి. కాబట్టి, వాటికి తగినంత స్థలం అవసరం. దీనికోసం కనీసం 10 నుండి 12 ఇంచుల లోతు, వెడల్పు ఉన్న కుండీలు లేదా గ్రో బ్యాగులను ఎంచుకోవాలి. ముఖ్యంగా, కుండీ అడుగు భాగంలో అదనపు నీరు బయటకు పోవడానికి డ్రైనేజీ రంధ్రం (ఐఊఖఆఖ్రవ ష్రశీశ్రీవ) ఖచ్చితంగా ఉండాలి. నీరు నిలిచిపోతే దుంపలు కుళ్ళిపోతాయి.

**మట్టి మిశ్రమం తయారీ:**
బీట్‌రూట్ పెంపకానికి మట్టి చాలా గుల్లగా, మెత్తగా ఉండాలి. గట్టి మట్టి ఉంటే దుంపలు సరిగ్గా ఊరవు. 40శాతం సాధారణ తోట మట్టి, 40 వర్మీ కంపోస్ట్ లేదా బాగా మాగిన పశువుల ఎరువు, 20శాతం కోకోపీట్ కలిపి కుండీలను నింపాలి. ఈ మిశ్రమం మొక్క వేర్లకు గాలి ఆడేలా చేసి, తేమను సమంగా ఉంచుతుంది.

**విత్తనాలు నాటే పద్ధతి:**
బీట్‌రూట్ విత్తనాలను నేరుగా కుండీల్లోనే నాటుకోవచ్చు. విత్తనాన్ని మట్టిలో కేవలం అర ఇంచ్ లోతులో నాటాలి. ఒకటి కంటే ఎక్కువ విత్తనాలు నాటుతున్నప్పుడు, మొక్కల మధ్య కనీసం 3 నుండి 4 ఇంచుల దూరం ఉండేలా చూసుకోవాలి. విత్తనాలు నాటిన తర్వాత తక్కువ మోతాదులో నీరు చల్లాలి. సాధారణంగా 5 నుండి 10 రోజుల్లో మొలకలు వస్తాయి.

**ఎండ, నీటి యాజమాన్యం:**
బీట్‌రూట్ మొక్క ఆరోగ్యంగా పెరగడానికి రోజుకు కనీసం 5 నుండి 6 గంటల ప్రత్యక్ష సూర్యరశ్మి అవసరం. మట్టిలో ఎల్లప్పుడూ తేమ ఉండేలా చూసుకోవాలి, కానీ ఎక్కువ నీరు పోయకూడదు. విత్తనాలు నాటిన 60 నుండి 70 రోజుల్లో తాజా బీట్‌రూట్ కోతకు సిద్ధమవుతుంది. దుంపలు భూమి పైకి కొద్దిగా కనిపిస్తున్నప్పుడు వాటిని సున్నితంగా వేరుతో సహా లాగి హార్వెస్ట్ చేసుకోవచ్చు. ఈ



రోజే మీ కిచెన్ గార్డెన్‌లో దీనిని ప్రయత్నించండి!

# పిక్సెల్ ఫోన్లకు నేటి నుంచే ఆండ్రాయిడ్ 17.. ఏయే ఫోన్లకంటే

గూగుల్ ఆండ్రాయిడ్ 17 (Android 17)ను విడుదల చేసింది. డివైజ్ సెక్యూరిటీ, ప్రొడక్టివిటీ, క్రియేటివ్ టూల్స్‌పై ప్రధానంగా ఫోకస్ చేసింది. ఈ వెర్షన్‌ను పిక్సెల్ ఫోన్లలో నేటి నుంచే అందుబాటులోకి తెచ్చింది. అదేవిధంగా పిక్సెల్ వాచ్‌ల కోసం వేర్ ఓఎస్ 7ను తీసుకొచ్చింది. పిక్సెల్ ఫోన్లకు నేటి నుంచి అందుబాటులోకి వచ్చిన ఆండ్రాయిడ్ 17 శాంసంగ్, ఒప్పో, వివో, వన్‌ప్లస్ వంటి ఇతర స్మార్ట్‌ఫోన్ కంపెనీలు ఈ ఏడాది చివరికల్లా ఆండ్రాయిడ్ 17ను విడుదల చేయనున్నాయి.




**ఆండ్రాయిడ్ 17 ఫీచర్లు ఏంటంటే..**
**బబుల్స్ ఫర్ మల్టీ టాస్కింగ్:** ఒక యాప్ రన్ అవుతుండగానే మరో యాప్‌ను స్క్రీన్‌పై భాగంలో ఫ్లోటింగ్ విండో మాదిరి సెట్ చేసుకోవచ్చు. అంటే ఒకేసారి రెండు యాప్‌లు వాడొచ్చన్నమాట. ఫోల్డబుల్, ట్యాబ్స్ కోసం ప్రత్యేకంగా రూపొందించింది.
**స్క్రీన్ రియాక్షన్స్:** థర్డ్ పార్టీ యాప్స్ అవసరం లేకుండానే సెల్ఫీ వీడియోతో పాటు స్క్రీన్ రికార్డింగ్ చేయొచ్చు.
**ఫోల్డబుల్ గేమింగ్ మోడ్:** ఫోల్డబుల్ ఫోన్ల కోసం ప్రత్యేకంగా ఈ ఫీచర్‌ను రూపొందించింది. 50:50 లేఅవుట్‌లో స్క్రీన్ పై భాగంలో గేమ్ రన్ అవుతుండగా కింది భాగంలో కంట్రోల్స్‌ను చూపిస్తుంది.
**సెక్యూరిటీ:** టెంపరరీ లొకేషన్ యాక్సెస్, సెలక్టివ్ కాంటాక్ట్ షేరింగ్‌ను కొత్తగా గూగుల్ తీసుకొచ్చింది. ఫోన్లు దొంగతనం జరిగిన సమయంలో డివైజ్ ప్రొటెక్షన్ ఫీచర్‌ను మరింత మెరుగుపరిచింది. ఫింగర్ ప్రింట్ లేనిదే ఫోన్ లాక్ ఓపెన్ అవ్వదు.

వీటితో పాటు పిక్సెల్ ఫోన్లలోని జెమినై యాప్‌తో ఓమ్ని మోడల్ ఉపయోగించి ఫొటో, వీడియో రీమిక్స్, కస్టమ్స్ ఏఐ అవతార్‌ను క్రియేట్ చేయొచ్చు. ఇమేజ్‌లకు తగ్గ లిరిక్స్, ఒరిజినల్ మ్యూజిక్ ట్రాక్‌లను సృష్టించవచ్చు. మాన్యువల్ కాల్ స్క్రీనింగ్ తీసుకొచ్చింది. తెలియని నంబర్ల నుంచి వచ్చే కాల్స్‌ను ఆన్సర్ చేయకముందే స్క్రీన్‌కాల్ బటన్ నొక్కొచ్చు. గూగుల్ అసిస్టెంట్ మీ బదులు అవతలి వ్యక్తి పేరు, కాల్ చేయడానికి గల కారణాన్ని అడిగి తెలుసుకుంటుంది. త్వరలో జెమినై ఇంటెలిజెన్స్ ఫీచర్‌ను యాడ్ చేస్తామని గూగుల్ తెలిపింది.

పిక్సెల్ ఫోన్లు ఇవే
గూగుల్ పిక్సెల్ 6, 6 Pro, 6a, పిక్సెల్ 7, 7 Pro, 7a, పిక్సల్ ట్యాబ్, పిక్సెల్ ఫోల్డ్, పిక్సెల్ 8, 8 Pro, 8a, పిక్సెల్ 9, 9 Pro, 9 Pro XL, 9 Proఫోల్డ్, 9a, పిక్సెల్ 10, 10 Pro, 10 Pro XL,10 Pro ఫోల్డ్, 10 a మోడళ్లకు అందుబాటులోకి వచ్చింది.

గూగుల్ పిక్సెల్ వాచ్ 2, 3, 5 మోడళ్ల కోసం ప్రత్యేకంగా వేర్ ఓఎస్ 7 వెర్షన్ గూగుల్ అందుబాటులోకి తెచ్చింది. మ్యాచ్ స్కోర్స్, డెలివరీలు వంటి లైవ్ అప్‌డేట్స్‌ను సులువుగా తెలుసుకోవచ్చు. హెడ్‌ఫోన్స్, స్పీకర్స్, స్మార్ట్ టీవీలను సులువుగా కంట్రోల్ చేయొచ్చు. అదేవిధంగా వేర్‌ఓఎస్ 6తో పోలిస్తే బ్యాటరీ లైఫ్‌ను 10 శాతం వరకు మెరుగుపరిచింది.

# ఒక్క రోజులో మస్క్ షేర్ల లాభం.. అంబానీ మొత్తం సంపదకు రెట్టింపు..!

ప్రపంచ ట్రిలియనీర్ ఎలాన్ మస్క్ సంస్థ స్పేస్ ఎక్స్ షేర్ల ధరలు రాకెట్‌లా దూసుకెళ్తున్నాయి. పబ్లిక్ ఇష్యూలో షేరు ధర 135 డాలర్లు కాగా.. ఇప్పటికే అది 200 డాలర్లు దాటేసింది. దీంతో ఆయన సంపదను ఇతర కుబేరుల సంపదతో పోలిక తెస్తూ నెటిజన్లు లెక్కలేస్తున్నారు. ఆ గణాంకాలు షాక్‌కు గురిచేస్తున్నాయి.



పబ్లిక్ ఇష్యూ అనంతరం భారీగా పెరుగుతోన్న మస్క్ కంపెనీ షేర్లు.. ఒక ట్రేడింగ్ రోజులో 14.71 శాతం ర్యాలీ అయ్యాయి. దాంతో ఆయన సంపద ఏకంగా 164.8 బిలియన్ డాలర్లు పెరిగింది. ఆ ఒక్కరోజు పెరుగుదలే భారతదేశ కుబేరుడు ముకేశ్ అంబానీ సంపద (ి89.7 ఎఱశ్రీశ్రీఱశీఅ) కంటే రెట్టింపు కావడం గమనార్హం. ప్రస్తుతం మస్క్ నికర సంపద 1.3 ట్రిలియన్ డాలర్లుగా ఉంది. టెస్లా, స్పేస్‌ఎక్స్‌లో ఆయనకున్న వాటాలే ప్రధాన ఆదాయవనరుగా ఉన్నాయి.

**అమెజాన్‌ను అధిగమించిన స్పేస్‌ఎక్స్**
మరోవైపు.. మస్క్ షేర్లు పెరిగిన రోజే అంబానీకున్న స్టాక్స్ ధరలు పెరిగాయి. దాంతో ఆయన నికర ఆస్తుల విలువ 965 మిలియన్ డాలర్లు (1.09 శాతం) ఎగబాకింది. మామూలుగా అయితే ఈ లెక్కలు అద్భుతమే. కానీ మస్క్ ఒక్క రోజులో పొందిన దాంతో పోల్చుకుంటే మాత్రం పరిగణనలోకి తీసుకోలేనంత తక్కువ కావడం గమనార్హం. కొందరు నెటిజన్లు మరో పోలిక కూడా తెచ్చారు. అదేంటంటే.. భారతదేశ జీడీపీ విలువ 4.15 ట్రిలియన్ డాలర్లు. ఆయన వ్యక్తిగత సంపద భారత్ జీడీపీలో నాలుగో వంతుకు సమానం కావడం గమనార్హం.

శుక్రవారం నాస్‌డాక్‌లో స్పేస్‌ఎక్స్ షేరు 150 డాలర్ల వద్ద లిస్ట్ అయింది. పబ్లిక్ ఇష్యూ ధర(135 డాలర్లు)తో పోలిస్తే ఇది 11% అధికం. ఈ కంపెనీలో మస్క్‌కు 480 కోట్ల షేర్లు ఉన్నాయి. దాంతో మస్క్ వ్యక్తిగత సంపద ఒక ట్రిలియన్ డాలర్లు దాటేసింది.

**2140 వరకు ఖర్చు పెట్టినా..**
ఇప్పుడు మస్క్ సంపద ()లో పెరుగుదల టాక్ ఆఫ్ ది వరల్డ్‌గా ఉంది. ఆయనకున్న ఒక ట్రిలియన్ డాలర్లను ఒక మిలియన్ మిలియన్ డాలర్లుగా చూడొచ్చు. ప్రతి గంటకు ఒక మిలియన్ డాలర్లు ఖర్చు పెట్టినా.. 2140 సంవత్సరం వరకు ఆ సంపద తరగదట. ఇంకా మిగిలే ఉంటుందని నెటిజన్లు లెక్కలేస్తున్నారు.

# రిలయన్స్ జియో ఐపీఓ.. AGవీకు ముందే సెబీకి ముసాయిదా పత్రాలు?




*రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన టెలికాం విభాగం జియో ఇన్ఫోకామ్ తొలి పబ్లిక్ ఇష్యూకు (Reliance Jio IPO) సిద్ధమవుతోంది. మార్కెట్ ప్రతికూలతల వల్ల ఆలస్యమైన ఈ ఐపీఓ.. త్వరలో పట్టాలెక్కనుంది. ఈ మేరకు మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీకి ఈ వారమే ముసాయిదా పత్రాలు సమర్పించే అవకాశం ఉందని 'ఫైనాన్షియల్ టైమ్స్' తన కథనంలో పేర్కొంది. ఈనెల 19న నిర్వహించబోయే రిలయన్స్ ఇండస్ట్రీస్ ఏజీఎంకు ముందే డ్రాఫ్ట్ పేపర్లను సమర్పించే అవకాశం ఉందని తెలిపింది. ఈ ఐపీఓ ద్వారా సుమారు 4 బిలియన్ డాలర్లు (సుమారు రూ.36- 40 వేల కోట్లు) మేర మార్కెట్ నుంచి సమీకరించనుంది.*

గతేడాది నిర్వహించిన రిలయన్స్ ఏజీఎం సందర్భంగా జియో ఐపీఓ గురించి ముకేశ్ అంబానీ ప్రకటన చేశారు. 2026కు తొలి అర్ధభాగంలోనే జియో ఐపీఓ ఉంటుందని తెలిపారు. అయితే, ఈ ఏడాదిలో ఇప్పటి వరకు రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు విలువ 15 శాతం మేర క్షీణించడం, పశ్చిమాసియా ఉద్రిక్తతల వల్ల రిలయన్స్ ప్రధాన ఆదాయ వనరు అయిన పెట్రోకెమికల్ వ్యాపారంపై ప్రభావం పడడంతో లాభంలో 13 శాతం క్షీణత నమోదైంది. మరోవైపు మార్కెట్ ఒడుదొడుకుల నేపథ్యంలో ఐపీఓ మార్కెట్ మందగించింది. ఇప్పుడిప్పుడే పరిస్థితులు కుదుటపడుతున్న వేళ జియో సహా పలు కంపెనీలు ఐపీఓకు సన్నద్ధమవుతున్నాయి.

రిలయన్స్ ఇండస్ట్రీస్ వార్షిక సాధారణ సమావేశం ఈ శుక్రవారం జరగనుంది. ఈ సమావేశంలో జియో ఐపీఓపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. దీంతోపాటు రిలయన్స్ రిటైల్ వ్యాపార విస్తరణ, దాని ఐపీఓ టైమ్‌లైన్‌కు సంబంధించి కీలక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఒక్కో షేరుకు రూ.6 చొప్పున ప్రకటించిన డివిడెండ్‌ను ఈ ఏజీఎంలో ఆమోదించనున్నారు. దీంతోపాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో పెట్టుబడులు, భవిష్యత్ ప్రణాళికలు; డేటా సెంటర్ల విస్తరణ ప్రణాళికల గురించి ప్రకటనలు వెలువడే అవకాశం ఉంది.

## స్టాక్ మార్కెట్ Stock Market

# నాలుగో రోజూ రాణించిన సూచీలు..

## IDBI షేర్లు 18% పైకి




***ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా నాలుగోరోజూ రాణించాయి. మెటల్, పీఎస్‌యూ, కన్స్యూమర్ డ్యూరబుల్స్ స్టాక్స్ సూచీలకు దన్నుగా నిలిచాయి. వడ్డీ రేట్లపై అమెరికా ఫెడరల్ రిజర్వ్ ఈ రాత్రికి నిర్ణయం ప్రకటించనున్న వేళ మదుపర్లు అప్రమత్తత పాటించారు. ఈ క్రమంలోనే సెన్సెక్స్ 347.14 పాయింట్ల లాభంతో 77,155.62 వద్ద ముగిసింది. నిఫ్టీ 96.55 పాయింట్లు లాభపడి 24,085.70 వద్ద స్థిరపడింది.***

సెన్సెక్స్ 30 సూచీలో ట్రెంట్, బీఈఎల్, ఎటర్నల్, టాటా స్టీల్, ఇన్ఫోసిస్ షేర్లు లాభపడ్డాయి. బజాజ్ ఫిన్‌సర్వ్, యాక్సిస్ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా, మారుతీ సుజుకీ షేర్లు నష్టాలు చవిచూశాయి. డాలరుతో రూపాయి మారకం విలువ 94.52గా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 79 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4329 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.


టాటా మోటార్స్ పాసింజర్ షేర్లు అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. ఓ దశలో 10 శాతం మేర క్షీణించాయి. చివరికి 8.10 నష్టంతో రూ.361.70 వద్ద ముగిశాయి. టాటా గ్రూపునకు చెందిన లగ్జరీ కార్ల బ్రాండ్ అయిన జాగ్వార్ ల్యాండ్ రోవర్ భవిష్యత్ వృద్ధి అంచనాలు, మేనేజ్‌మెంట్ కామెంటరీ టాటా మోటార్స్ షేర్లపై ప్రభావం చూపాయి.ఐడీబీఐ బ్యాంక్ షేర్లు నేడు దూసుకెళ్లాయి. ఓ దశలో 18శాతం వరకు లాభపడ్డాయి. వ్యూహాత్మక వాటాల విక్రయానికి ప్రభుత్వం సిద్ధమవుతోందని, వచ్చే ఆర్థిక సంవత్సరానికల్లా పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియ పూర్తవుతుందన్న వార్తల నేపథ్యంలో షేర్లు రాణించాయి. చివరికి 16 శాతం లాభంతో రూ.89.60 వద్ద ముగిసింది.



# మహాత్ముని ఆంతరంగికుడు మహదేవ్ దేశాయ్



## నేడు మహదేవ్ దేశాయ్ వర్ధంతి



9440595494

జాతిపిత మహాత్మాగాంధీ సేవ కోసం సర్వం త్యాగం చేసిన గొప్ప వ్యక్తి మహదేవ్ దేశాయ్. నిజానికి గాంధీకి ఆంతరంగికుడు. ఆయన లేకుండా మహాత్ముని జీవితం గురించి సంపూర్ణంగా తెలిసేది కాదంటే అతిశయోక్తి కాదేమో. ఆయన మహాత్మా గాంధీ వ్యక్తిగత కార్యదర్శి. గాంధీకి సంబంధించిన ప్రతి విషయం స్వయంగా దేశాయే చూసేవారు.

మహదేవ్ దేశాయ్ (1 జనవరి 1892-- 15 ఆగస్టు 1942) 1892 జనవరి 1 న గుజరాత్ లోని సూరత్ జిల్లాలో సారస్ అనే గ్రామం లో ఉపాధ్యాయుడైన హరిభాయి, జన్మాబెన్ దంపతులకు జన్మించా రు. 13 సంవత్సరాల వయసులో మహాదేవ్ దుర్గాబెన్ ను వివాహ మాడారు. ఆయన సూరత్ ఉన్నత పాఠశాల, ముంబయిలోని ఎల్ఫిన్ స్టోన్ కాలేజిలో చదివారు. ఆయన బి.ఎ పట్టభద్రుడు. మహదేవ్ దేశాయ్ మొదటిసారి 1915 లో గాంధీని కలిసారు. దేశాయ్ 1917లో సబర్మతీ ఆశ్రమంలో ఆయన భార్య దుర్గాబెన్‌తో పాటు చేరారు. ఆ సంవత్సరం చంపారన్ ఉద్యమం జరిగింది. ఆయన డిసెంబర్ 13,1917 నుండి ఆగస్టు 14,1942 వం-కు ఆయన మరణించే తేదీ ముందురోజు వరకు ఒక డైరీని నిర్వహించారు. దానిలో ఆయనకు మహాత్మాగాంధీ సాన్ని హిత్యం గురించి వ్రాసారు. బ్రిటిష్ ప్రభుత్వం గాంధీజీని 1919లో అరెస్టు చేసినపుడు గాంధీజీ తన వారసునిగా దేశాయ్ ని ప్రకటిం చారు. దేశాయ్ మొదటిసారి 1921 లో అరెస్టు కాబడి ఒక సంవత్సరం పాటు జైలు శిక్ష అనుభవించారు. ఆయన 25 సంవత్సరాలపాటు గాంధీజీకి వ్యక్తిగత కార్యదర్శిగా ఉన్నారు.

గాంధీజీ కంటే ముందే వేకువ జామున లేచేవారు. గాంధీతో నిరంతరం గడపేవారు. ఆరోజు జరిగిన విషయలను డైరీలో నమోదు చేసేవారు. అన్నీ తానే అయి చూసేవారు. 1920 లో మోతీలాల్ నెహ్రూ తన వార్తా పత్రిక ప్రింటింగ్ ప్రెస్‌ను బ్రిటిష్ ప్రభుత్వం జప్తు చేసిన తరువాత చేతితో వ్రాసిన సైక్లోస్టైల్ వార్తా పత్రికను బయటకు తీసుకు రావడం ద్వారా దేశాయ్ సంచలనాన్ని సృష్టించారు దేశాయ్. 1921 లో దేశాయ్‌ను తన రచనలకు ఒక సంవత్సరం కఠిన మైన జైలు శిక్ష విధించారు.

దేశాయ్ 1924 లో నవజీవన్ సంపాద కుడిగా బాధ్యతలు స్వీకరించారు. 1925 నుండి గాంధీ ఆత్మకథ, యంగ్ ఇండియాలో దాని సీరియల్ ప్రచురణ కోసం అంగ్లం లోకి అను వాదం ప్రారంభించారు. మరుసటి సంవత్సరం ఆయన సత్యాగ్రహ ఆశ్రమ కార్యనిర్వాహక కమిటీ ఛైర్మన్ అ-య్యారు. సర్దార్ పటేల్‌తో కలిసి బార్డోలి సత్యాగ్రహంలో పాల్గొన్నారు. గుజరాతీ లో సత్యాగ్రహ చరిత్రను వ్రాసారు. దీనిని ఆంగ్లంలోకి ది స్టోరీ ఆఫ్ బార్డోలిగా అనువదించారు. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నందుకు ఆయన్ను అరెస్టు చేసి జైలులో పెట్టారు. గాంధీతో పాటు మిరాబెన్, దేవదాస్ గాంధీ, ప్యారేలాల్ లతో కలిసి రెండవ రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరయ్యారు. కింగ్ జార్జ్ ఎ ను కలిసేందుకు గాంధీతో పాటు వెళ్ళిన ఏకైక వ్యక్తి ఆయన. 1932 లో దేశాయ్‌ను మళ్లీ అరెస్టు చేసి గాంధీ, సర్దార్ పటేల్‌తో కలిసి జైలుకు పంపారు. 1933 లో జైలులో ఉన్న ఈ సమయంలోనే ఆయన "గీత ప్రకారం గాంధీ" పుస్తకాన్ని రాశారు. దేశాయ్ 1939 లో రాక్‌కోట్, మైసూర్ రాచరిక రాష్ట్రాలలో ప్రజల ఉద్యమాలను నిర్వహించడంలో కీలక పాత్ర పోషించారు. దేశాయ్ చివరి జైలు శిక్ష 1942 ఆగస్టు 8 నాటి క్విట్ ఇండియా ప్రకటన తరువాత జరిగింది. ఆయన 1942 ఆగస్టు 9 ఉదయం అరెస్టు చేయబడ్డారు. ఆరు రోజుల తరువాత ఆగస్టు 15 1942న గుండె పోటుతో మరణించే వరకు గాంధీతో పాటు అగాఖాన్ ప్యాలెస్‌లో ఉన్నారు. గాంధీజీ స్వయంగా దేశాయ్ భౌతిక కాయానికి స్నానం చేయించారు. ఆగాఖాన్ పాలెస్ మైదానంలో ఆయనను దహనం చేసారు. ఆ ప్రదేశంలో ప్రస్తుతం ఆయన సమాధి ఉంది.

భారత తపాలా శాఖ దేశాయ్ గౌరవార్థం 1983లో తపాలా బిళ్ళపై ఆయన బొమ్మను ముద్రించింది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్
ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్....

# భారత జాతీయ పతాక తయారీ, నిబంధనలు



ప్రభాతనవ
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం

భారత జాతీయ పతాకం, దీర్ఘ చతురస్రాకారంలో కాషాయం, తెలుపు, పచ్చ రంగులు సమ నిష్పత్తిలో త్రివర్ణంగా ఉంటూ మధ్యలో 24 ఆకులు కలిగిన నేవీ బ్లూ రంగులో ఉండే చక్రమైన అశోక చక్రంతో ఉంటుంది. 1947 జూలై 22న భారత రాజ్యాంగ పరిషత్ సమావేశంలో ప్రస్తుతం ఉన్న రూపంలో ఆమోదం పొంది, 1947 ఆగస్టు 15న భారత డొమినియన్‌కు అధికారిక పతాకంగా ఆమోదం పొందింది. తర్వాత క్రమేపీ భారత గణతంత్రానికి అధికారిక పతాకంగా స్వీకరించారు. 1951లో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బి.ఐ.ఎస్.) జాతీయ పతాకానికి కొన్ని నిర్దేశకాలను రూపొందించింది. ఈ నిర్దేశకాలను మన దేశంలో అమల్లోకి వచ్చిన మెట్రిక్ మానానికి సరిపోయేటట్లు 1964లో ఒకసారి, 1968 ఆగస్టు 17న మరొక సారి సవరించారు. పతాక పరిమాణం, రంగులు, వాడే బట్టకు వర్తించే ఈ నిర్దేశకాలు చాలా కచ్చితమైనవి. వీటి ఉల్లంఘన శిక్షార్హమైన నేరం. పతాక కొలతలు మి.మీ. లలో...6300 ఐ 4200; 3600 ఐ 2400; 2700 ఐ 1800;1800 ఐ 1200; 1350 ఐ 900; 900 ఐ 600; 450 ఐ 300; 225 ఐ 150; 150 ఐ 100గా నిర్ణయించారు.

పతాకం తయారీలో ఖాదీ లేక చేనేత వస్త్రాన్ని మాత్రమే వాడాలి. ఖాదీలో నూలు, పట్టు, ఉన్ని బట్టలను మాత్రమే వాడుతారు. జెండాలో రెండు రకాల ఖాదీని వాడుతారు: జెండా రూపానికి ఖాదీ-బంటింగ్, జెండాను కఱ్ఱకు తగిలించడానికి అవసరమయ్యే బట్టకు ఖాదీ-డక్. ఖాదీ-డక్ ప్రత్యేకమైన ఎవఅస్త్రవ (పసుపు పచ్చ-బ్రౌన్ కలిసిన రంగు) రంగులో ఉంటుంది. సాంప్రదాయిక నేతలో రెండు పోగులను వాడేచోట ఖాదీ-డక్ లో మూడు పోగులను వాడుతారు. ఇది చాలా అరుదైన నేత. దేశం మొత్తమ్మీద ఈ రకమైన నేతపని తెలిసినవాళ్ళు పదిమంది కంటే ఎక్కువ లేరు. ఇంకా చదరపు సెంటీ మీటరుకు కచ్చితంగా 150 పోగులు ఉండాలని, కుట్టుకు నాలుగు పోగులు ఉండాలని, ఒక చదరపు అడుగు గుడ్డ కచ్చితంగా 205 గ్రాములుండాలని నిర్దేశకాలు ఉన్నాయి.

జాతీయపతాకాలను ఉత్పత్తిచేయడానికి అవసరమైన ఖాదీ బట్ట ఉత్తర కర్ణాటకలోని ధార్వాడ్, బాగల్కోట్ జిల్లాల్లోని రెండు చేనేత యూనిట్ల నుంచి వస్తుంది. ప్రస్తుతం దేశంలో జాతీయ పతాకాలను తయారు చేయడానికి ప్రభుత్వ అనుమతి గల ఒకే ఒక్క సంస్థ హుబ్లీలో ఉంది. జాతీయ పతాకాలను ఉత్పత్తి చేయడానికి అనుమతి ఇచ్చే అధికారం ఖాదీ డెవలప్‌మెంట్ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ కు ఉన్నప్పటికీ ఆ అనుమతిని రద్దు చేసే అధికారం బి.ఐ.ఎస్.కు ఉంది.

నేసిన బట్టను పరీక్ష నిమిత్తం బి.ఐ.ఎస్ (బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్)కు పంపిస్తారు. తిరిగొచ్చిన తర్వాత బ్లీచింగు చేసి రంగులద్ది, మధ్యలో అశోకచక్రాన్ని స్క్రీన్ ప్రింటింగు గానీ, స్టెన్సిల్ గానీ, ఎంబ్రాయిడరీ గానీ చేస్తారు. చక్రం రెండు వైపులా ఒకేచోట స్పష్టంగా కనిపించాలి. జెండాపై వేసిన రంగులను బి.ఐ.ఎస్. పరీక్షించిన తర్వాతే పతాకాలను అమ్మటానికి అనుమతిస్తారు.

మన దేశంలో ప్రతి సంవత్సరం దాదాపు నాలుగు కోట్ల జెండాలు అమ్ముడు పోతాయి. దేశంలోనే అతిపెద్ద పతాకం (6.3 ఐ 4.2 మీ) మహారాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యాలయమైన మంత్రాలయ భవనం మీద ఎగురుతుంది.

2002కు ముందు జాతీయ సెలవు దినాల్లో తప్ప మిగతా సమయాల్లో జాతీయ పతాకాన్ని ప్రజలు ఎగరేయడానికి అనుమతించేవారు కాదు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ ఉన్నతాధికారులకు మాత్రమే ఆ అధికారముండేది. ఈ నిబంధనను తొలగించాలని కోరుతూ నవీన్ జిందాల్ అనే పారిశ్రామికవేత్త ఢిల్లీ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం వేశాడు. జిందాల్ తన కార్యాలయ భవంతి మీద జాతీయ పతాకాన్ని ఎగురవేయగా అధికారులు దాన్ని స్వాధీనం చేసుకుని, ఆయన్ను ప్రాసిక్యూట్ చేస్తామని తెలిపారు. నిబంధనలకు అనుగుణంగా జాతీయ పతాకాన్ని ఎగరేయడం పౌరుడిగా తన హక్కని, దేశం పట్ల తన ప్రేమను ప్రకటించుకునే మార్గమని జిందాల్ వాదించాడు. ఆ కేసు సుప్రీమ్ కోర్టుకు వెళ్ళింది. సుప్రీమ్‌కోర్టు ఈ విషయాన్ని పరిశీలించడానికి ఒక కమిటీని వేయమని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. కేంద్ర మంత్రిమండలి పతాకం గౌరవానికి భంగం కలగని రీతిలో ఎవరైనా జాతీయ పతాకాన్ని ఎగరేయవచ్చని అనుమతిస్తూ జాతీయపతాక నియమావళిని సవరించింది.

భారత జెండా కోడ్, జాతీయ చిహ్నాలకు సంబంధించిన ఇతర చట్టాలు జెండా వాడుకకు వర్తిస్తాయి. మొదట్లో ఈ కోడ్ భారత స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం వంటి జాతీయ దినోత్సవాల సందర్భంగా తప్ప మిగతా రోజుల్లో సాధారణ పౌరులు జెండాను వాడడం నిషేధించింది. 2002లో నవీన్ జిందాల్ అభ్యర్థన పరిశీలిస్తూ భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సాధారణ పౌరులు జెండాను వాడుకునేందుకు వీలుగా కోడ్‌ను సవరించమని భారత ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. దాన్ని అనుసరించి భారతీయ కేంద్ర మంత్రివర్గం కోడ్‌ను పరిమితంగా వాడేందుకు సాధారణ పౌరులకు వీలునిస్తూ సవరించింది. 2005లో మరోసారి కోడ్‌ను సవరించి కొన్ని రకాల దుస్తుల మీద ఉపయోగించడం సహా మరికొన్ని అదనపు వాడుకలను అనుమతించారు. జెండాను ఎగురవేయడం, ఇతర జాతీయ, సాధారణ జెండాలతో కలిపి భారత జాతీయ పతాకాన్ని వాడేప్పుడు అనుసరించాల్సిన విధానాలకు ఆ కోడ్ వర్తిస్తుంది. ఈ సవరణ 2002 జనవరి 26 న అమల్లోకి వచ్చింది. జాతీయపతాక నియమావళి అనేది చట్టం కానప్పటికీ, ఆ నియమావళి లోని నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సుప్రీమ్‌కోర్టు యూనియన్ ఆఫ్ ఇండియా వర్సెస్ నవీన్ జిందాల్ కేసులో పేర్కొంది.

జాతీయ పతాకాన్ని ఎగరేసే హక్కు సంపూర్ణ హక్కు కాదు. పరిమితులతో కూడిన హక్కు. దీన్ని భారతరాజ్యాంగంలోని 51ఎ ఆర్టికల్ లోని ప్రాథమిక విధులతో కలిపి అన్వయించ వలసి ఉంటుంది. వాస్తవంగా జెండా రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 కూడా యూనిఫారాలు, బట్టలు, ఇతర వస్త్రాలపై జెండా వినియోగాన్ని ఒప్పుకోదు. జూలై 2005 లో, భారతదేశం ప్రభుత్వం కొన్ని రకాల వినియోగాన్ని అనుమతించటానికి సవరించారు. సవరించిన కోడ్ ప్రకారంలో దుస్తులలో జెండా వాడుక నిషేధిస్తుంది. పిల్లో కవర్స్, చేతి రుమాలు లేదా ఇతర వస్త్రాలు పై ఎంబ్రాయిడరీ డిజైన్స్ నిషేధిస్తుంది. దెబ్బతిన్న జెండాలు లేదా పాడయి పోయిన జండాలు నాశనము చేయడానికి ఒక ప్రత్యేక పద్ధతి ఉంది. పాడయిన లేదా చిరిగి పోయిన జెండాలను పక్కన పడెయ్యటం లేదా అగౌరవంగా నాశనం చేయకూడదు. అలాంటి వాటిని కాల్చడము /తగులబెట్టడం లేదా భూమిలో పాతిపెట్టడం చేయాలి. లేదా జెండా గౌరవాన్ని కాపాడే మరే ఇతర పద్ధతి ద్వారా మాత్రమే వాటిని నాశనము చేయాలి.

రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్
ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...
9440595494



ప్రభాతనవ
SINGIDI తెలుగు దినపత్రిక
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం



# నేతాజీ అస్తికలు... ఎప్పటికి ముగిసే ఈ వివాదం?

80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని దేశం నేడు ఘనంగా జరుపుకుంటోంది. త్రివర్ణ పతాకం రెపరెపలాడుతోంది. దేశభక్తి గీతాలు మారుమోగుతున్నాయి. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను కీర్తిస్తూ జాతి నివాళులర్పిస్తోంది. అయితే ఈ వేడుకల మధ్య భారత జాతి మనస్సాక్షిని ఇప్పటికీ కలచివేస్తున్న ఒక ప్రశ్న మాత్రం సమాధానం కోసం ఎదురుచూస్తూనే ఉంది. దేశ స్వాతంత్ర్యం కోసం తన ప్రాణాలను పణంగా పెట్టిన నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు చెందినవిగా భావిస్తున్న అస్తికలు ఇప్పటికీ విదేశీ గడ్డపై జపాన్‌లోని టోక్యో రెంకోజి బౌద్ధ ఆలయంలోనే ఉన్నాయి. స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలు గడిచినా, ఆయన మరణంపై కొనసాగుతున్న వివాదానికి, అస్తికలపై నెలకొన్న అనిశ్చితికి ఏ ప్రభుత్వం కూడా ఇప్పటివరకు ముగింపు పలకలేకపోవడం నిజంగా శోచనీయం. దేశానికి స్వేచ్ఛను అందించేందుకు సర్వస్వం త్యాగం చేసిన మహానేతకు, ఆయన జీవితంలోని చివరి అధ్యాయానికి ఇప్పటికీ న్యాయం జరగకపోవడం స్వతంత్ర భారతదేశ చరిత్రలో ఒక అసంపూర్ణ అధ్యాయంగానే మిగిలిపోయింది.

ఈ అంశం మరోసారి జాతీయ చర్చకు రావడానికి కారణం సుప్రీంకోర్టు తాజా జోక్యం. 2026 ఆగస్టు 11న నేతాజీ ఏకైక కుమార్తె అనితా బోస్ ఫాఫ్ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. విదేశాంగ, హోంశాఖలు తమ వైఖరిని వెల్లడించాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను సెప్టెంబర్ 28కు నిర్ణయించింది. అంతకుముందు నేతాజీ మనవడు అశీష్ రే దాఖలు చేసిన పిటిషన్‌ను "వారసురాలు స్వయంగా రావాలి" అంటూ తిరస్కరించిన కోర్టు, ఇప్పుడు అనితా ఫాఫ్ స్వయంగా పిటిషన్ వేయడంతో విచారణ చేపట్టింది. జపాన్ ప్రభుత్వంతో చర్చలు జరిపి అస్తికల తరలింపుపై చర్యలు ప్రారంభించాలని, అంతర్-మంత్రిత్వ కమిటీ ఏర్పాటు చేసి కాలపట్టిక ప్రకటించాలని ఆమె కోరుతున్నారు. 2022, 2024, 2026లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖలు రాసినా స్పందన రాలేదని ఆమె పేర్కొన్నారు. అవసరమైతే ణచీూ పరీక్షకు కూడా సిద్ధమని స్పష్టం చేశారు.

1897 జనవరి 23న ఒడిశాలోని కటక్‌లో జన్మించిన సుభాష్ చంద్రబోస్ బ్రిటిష్ ప్రభుత్వ అత్యున్నత ఉద్యోగమైన ఐసీఎస్‌ను తృణప్రాయంగా వదిలిపెట్టి స్వాతంత్ర్య సమరాన్ని జీవిత లక్ష్యంగా ఎంచుకున్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేసినా సిద్ధాంత భేదాల కారణంగా ఫార్వర్డ్ బ్లాక్‌ను స్థాపించారు. 1941లో గృహ నిర్బంధం నుంచి తప్పించుకుని జర్మనీ, జపాన్ చేరి ఆజాద్ హింద్ ఫౌజ్‌ను నిర్మించారు. "నాకు రక్తం ఇవ్వండి... నేను మీకు స్వాతంత్ర్యం తెచ్చిస్తాను" అన్న ఆయన పిలుపు దేశ యువతలో అపూర్వమైన జాతీయ చైతన్యాన్ని నింపింది. "జై హింద్" నినాదాన్ని దేశవ్యాప్తం చేశారు. మహిళల కోసం రాణి లక్ష్మీబాయి రెజిమెంట్‌ను ఏర్పాటు చేశారు. ఆండమాన్ దీవులకు "షహీద్", "స్వరాజ్" పేర్లు పెట్టారు. యుద్ధరంగంలో ఐఎన్ఏ ఆశించిన విజయాన్ని సాధించకపోయినా, భారత సైన్యంలో స్వాతంత్ర్య స్ఫూర్తిని రగిలించి బ్రిటిష్ పాలనను కుదిపేసిందని చరిత్రకారులు విశ్లేషిస్తారు.

అయితే ఆయన మరణమే ఇప్పటికీ మిస్టరీగా మిగిలింది. అధికారిక కథనం ప్రకారం 1945 ఆగస్టు 18న తైవాన్‌లోని తైహోకు విమానాశ్రయం వద్ద జరిగిన విమాన ప్రమాదంలో నేతాజీ తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో మరణించారు. అనంతరం దహన సంస్కారాలు నిర్వహించి అస్తికలను టోక్యోలోని రెంకోజి ఆలయంలో భద్రపరిచారు. జపాన్ వైద్యులు, ప్రత్యక్ష సాక్షులు, నేతాజీతో ప్రయాణించిన హబీబుర్ రహ్మాన్, అలాగే 1946లో బ్రిటిష్ అధికారి జాన్ ఫిగ్గెస్ దర్యాప్తు కూడా ఇదే కథనాన్ని సమర్థించాయి.

అయితే విచారణ కమిషన్లు మాత్రం భిన్న నిర్ణయాలకు వచ్చాయి. 1956లో షా నవాజ్ కమిటీ, 1970-74 మధ్య ఖోస్లా కమిషన్ విమాన ప్రమాదంలోనే నేతాజీ మరణించారని, రెంకోజి అస్తికలే ఆయనవని తేల్చాయి. కానీ 1999లో ఏర్పడిన ముఖర్జీ కమిషన్ విమాన ప్రమాదానికి తగిన ఆధారాలు లేవని, రెంకోజి అస్తికలు నేతాజీవి కావని అభిప్రాయపడింది. అయితే గుమ్నామీ బాబా సిద్ధాంతాన్ని కూడా తిరస్కరించింది. 2006లో కేంద్ర ప్రభుత్వం ఈ నివేదికను తిరస్కరించింది. అప్పటి నుంచి ప్రభుత్వ అధికారిక వైఖరి మాత్రం మారలేదు. నేతాజీ 1945లోనే మరణించారని, రెంకోజి ఆలయంలోని అస్తికలే ఆయనవని ప్రభుత్వం భావిస్తోంది.

అయితే అదే ప్రభుత్వం వాటిని స్వదేశానికి తీసుకురావడంలో మాత్రం ఇప్పటికీ నిర్ణయం తీసుకోలేదు. కారణాలు మూడు. కుటుంబ సభ్యుల మధ్య భిన్నాభిప్రాయాలు, రాజకీయ సంకోచం, ప్రజల్లో కొనసాగుతున్న సందేహాలు. 1998లో కలకత్తా హైకోర్టు కూడా పూర్తి స్పష్టత లేకుండా అస్తికలను తీసుకురావద్దని పేర్కొనడంతో వివాదం మరింత కొనసాగింది.

వాస్తవానికి ఈ వ్యవహారంలో జపాన్ అడ్డంకి కాదు. రెంకోజి ఆలయ నిర్వాహకులు మూడు తరాలుగా అస్తికలను అత్యంత గౌరవంగా భద్రపరుస్తున్నారు. భారత్ అధికారికంగా కోరితే అప్పగించేందుకు సిద్ధమనే సంకేతాలు పలుమార్లు వెలువడ్డాయి. అయినప్పటికీ నిర్ణయం మాత్రం ఢిల్లీలోనే నిలిచిపోయింది.

నేతాజీ 1937లో ఆస్ట్రియాకు చెందిన ఎమిలీ షెంకెల్‌ను వివాహం చేసుకున్నారు. వారికి జన్మించిన ఏకైక కుమార్తె అనితా బోస్ ఫాఫ్ విమాన ప్రమాద కథనాన్ని అంగీకరిస్తూ అస్తికలను భారత్‌కు తీసుకురావాలని పదేపదే కోరుతున్నారు. మరోవైపు కుటుంబంలోని కొందరు సభ్యులు, ఫార్వర్డ్ బ్లాక్ వంటి వర్గాలు ముందుగా ణచీూ పరీక్ష జరగాలని లేదా అస్తికలు నేతాజీవేనని శాస్త్రీయంగా నిర్ధారణ కావాలని డిమాండ్ చేస్తున్నాయి. రష్యా, గుమ్నామీ బాబా వంటి ప్రత్యామ్నాయ సిద్ధాంతాలు ఎన్నో ప్రచారంలోకి వచ్చినా వాటికి బలమైన ఆధారాలు ఇప్పటివరకు లభించలేదు.

ఇక్కడ ప్రభుత్వం తన చారిత్రక బాధ్యతను గుర్తించాల్సిన సమయం ఆసన్నమైంది. భావోద్వేగాలతో చరిత్రను నిర్ణయించలేం. అలాగే అనుమానాలను శాశ్వత సత్యాలుగా కొనసాగించలేం. శాస్త్రీయంగా నిర్ధారించే అవకాశం ఉంటే ణచీూ పరీక్ష నిర్వహించాలి. చారిత్రక ఆధారాలు, అంతర్జాతీయ దర్యాప్తులు, కుటుంబ సభ్యుల అభిప్రాయాలు, అందుబాటులో ఉన్న అన్ని సాక్ష్యాలను మరోసారి సమగ్రంగా పరిశీలించి తుది నిర్ణయాన్ని దేశం ముందు ఉంచాలి.

నేతాజీ అస్తికలు నిజంగానే ఆయనవైతే, అత్యున్నత రాష్ట్ర గౌరవాలతో స్వదేశానికి తీసుకువచ్చి జాతి తరఫున నివాళులర్పించడం కేంద్ర ప్రభుత్వ కనీస బాధ్యత. ఒకవేళ అవి ఆయనవి కావని తేలితే, అదే విషయాన్ని కూడా దేశ ప్రజలకు స్పష్టంగా చెప్పాలి. అనిశ్చితిని కొనసాగించడం చరిత్రకూ అన్యాయం, దేశానికీ అవమానం.

స్వాతంత్ర్యాన్ని అందించిన మహనీయులను స్మరించడం అంటే కేవలం జెండా ఎగరవేయడం, విగ్రహాలకు పూలమాలలు వేయడం మాత్రమే కాదు. వారు విడిచిపెట్టిన ప్రశ్నలకు సమాధానాలు వెతకడం కూడా అంతే ముఖ్యమైన జాతీయ కర్తవ్యం. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేళ నేతాజీ సుభాష్ చంద్రబోస్ జీవితంలోని ఈ అసంపూర్ణ అధ్యాయానికి ఆధారాలతో, పారదర్శకతతో, రాజకీయాలకు అతీతంగా ముగింపు పలకాల్సిన సమయం ఆసన్నమైంది. అదే నేతాజీ త్యాగానికి నిజమైన నివాళి... అదే స్వతంత్ర భారతదేశం తన మహానేతకు చెల్లించాల్సిన చారిత్రక ఋణం.

వ్యాసకర్త
కాలగిరి శ్రీనివాస్ రెడ్డి,
సెల్ 9010128884,
Email:
ksreddy1409@gmail.com











# నేటి తరానికి ఆదర్శం... కొండా వెంకటప్పయ్య వ్యక్తిత్వం

## నేడు... కొండా వెంకటప్పయ్య వర్ధంతి

**1933లో మహాత్ముడు ఆంధ్రలో హరిజన యాత్ర చేపట్టి, అనేక గ్రామాలలో హరిజనుల దేవాలయ ప్రవేశం చేయించాడు. భార్య మృత్యు ఒడిలో ఉన్నప్పటికీ కొండా వెంకటప్పయ్య హరిజన సేవలో నిమగ్నుడై తిరుగుతున్నాడని మహాత్మాగాంధీచేత కొనియాడ బడినాడు.**

ఆయన విలువలతో కూడిన నిబద్ధ త కలిగిన రాజకీయ నాయకుడు. దాన, ధర్మాల కోసం సొంత ఆస్తినే అమ్ముకొన్న దయా హృదయుడు. స్వాతంత్ర్య సమర యోధుడు, ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రోద్యమానికి ఆద్యుడు, దేశభక్త బిరుదాంకి తుడు. ఆయనే నిస్వార్థానికి నిలు వెత్తు రూపం కొండా వెంకటప్పయ్య. దృఢ సంకల్పం, నిర్మలమైన ప్రవర్తన, అసమాన ధైర్యం, నిశ్చల మైన దీక్షా దక్షత, అరమరకలేని అమాయకత్వం, నిరాడంబర వ్యక్తిత్వం కలగలిపినదే కొండా వెంకటప్పయ్య జీవితం. శ్రోత్రియ కుటుంబంలో జన్మించినా, సనాతన సాంప్రదాయాల పరిధిని అతిక్రమిం చిన భిన్న మనస్తత్వం ఆయనది. ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర ఉద్యమానికి మార్గదర్శకత్వం నెరపిన నాయక త్వం ఆయనది. కృష్ణా పత్రికను స్థాపించి తెల్లదొరలపై అక్షర అస్త్ర శస్త్రాలను సంధించిన అక్షర యో ధుడు. గాంధీకే దేశ రాజకీయాల లోకి రాక ముందే ఆంగ్లేయులకు వ్యతిరేకంగా న్యాయవాద వృత్తిని విడనాడి న త్యాగధనుడు.

స్వాతంత్ర్యం వచ్చిన నాలుగు నెలలలో, 1947 డిసెంబరులో కొండా వెంకటప్ప య్య ...స్వాతం త్ర్యం తరువాత పెచ్చుపెరిగిన అవినీతి గురించి మహాత్మా గాంధీకి వ్రాసిన లేఖను బట్టి ఆయన తపన అర్థం అవుతుంది. “మనం మన స్ఫూర్తిగా కోరుకొన్న స్వరాజ్యం అనే ఒకే ఒక లక్ష్యం ప్రజలను మీ వెంట నడిపించింది. ఇప్పుడు ఆ గమ్యం చేరుకోగానే ఈ స్వాతంత్ర్య యోధులలో నీతి నియమాలు అంతరించి పోయాయి. రోజురోజు కూ పరిస్థితి దిగజారి పోతోంది. ప్రజలు కాంగ్రెసును దూషిస్తున్నారు. బ్రిటిషు రాజ్యమే మేలంటున్నారు. ఇప్పుడు స్వతంత్ర దేశంలో కాంగ్రెసు అవినీతికి ఆలవాలమై పోతున్నది. వారిని అదుపు చేయాల్సిన పోలీసు వ్యవస్థ కాంగ్రెసువారి కట్టడి లో ఉండి పోయింది. పైసా ఆదాయం లేని వారు ఇప్పుడు మహా రాజుల లాగా పెద్దపెద్ద కార్లలో తిరుగు తున్నారు. కాంగ్రెసు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తరచూ జోక్యం చేసుకోవడం వలన జిల్లా కలెక్టరులూ, రెవిన్యూ అధికారులూ తమ విధులను సక్రమంగా నిర్వర్తిం చ లేక పోతున్నారు. ఈ పైరవీ కారుల ప్రభావం దుష్ప్రచారం, భయంతో నిజాయితీగల వారు తమ పదవులలో ఉండే పరిస్థితి లేదు.”
విదేశీ పాలకుల దాస్య శృంఖలాల నుండి విముక్తి కలిగి, స్వతంత్ర భారతావని స్వేచ్ఛా వాయువులు పీల్చుకున్న అనంతరం కేవలం , నాలుగు మాసాలకే 1947 డిసెం బర్‌లో కాంగ్రెస్ నేతల స్వార్థ చింతన గురించి గాంధీజీకి రాసిన లేఖలోని వ్యథా భరిత హృదయంలో నుండి వచ్చిన బాధతో నిండిన వాక్యాలివి. దీన్ని బట్టి ఆయన నీతి నిజాయితీ, నిబద్ధత, నిస్వార్థ భావన గురించి స్పష్టం అవుతుంది.

కొండా వెంకటప్పయ్య (ఫిబ్రవరి 22, 1866 – ఆగష్టు 15, 1949) 1866, ఫిబ్రవరి 22 న పాత గుంటూరులో జన్మించాడు. ప్రాథమిక విద్య గుంటూరు మిషన్ స్కూలులో, ఉన్నత విద్య మద్రాసు క్రైస్తవ కళాశాలలో పూర్తిచేసి తరువాత బి.ఎల్. పట్టా పొంది, బందరులో న్యాయ వాద వృత్తిని చేపట్టాడు.

ఇరవయ్యో శతాబ్ది ఆరంభంలో, జాతిని చైతన్య వంతం చేయడానికి వెంకటప్పయ్య 1902లో వాసు నారాయణరావుతో కలసి కృష్ణా పత్రిక ప్రచురణను ప్రారంభించాడు. 1905 వరకు ఆయనే ఆ పత్రికను నడిపి, గుంటూరులో స్థిరపడగానే దాని సంపాదకత్వ బాధ్యతలను ముట్నూరు కృష్ణారావుకు అప్పగిం చాడు. న్యాయవాద వృత్తిలో వెంక టప్పయ్య ధనార్జన గురించి ఆయ న పట్టించుకోనే లేదు. దాన, ధర్మాల కోసం సొంత ఆస్తినే అమ్ము కొన్నాడు.

1912 మే నెలలో కృష్ణా గుంటూరు జిల్లా రాజకీయ మహా సభ నిడద వోలులో జరిగింది. ఆ సభలోనే కొండా వెంకటప్పయ్య సలహాపై ఉన్నవ లక్ష్మీనారాయణ మొదలగు యువకులు 11 తెలుగు జిల్లాలతో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు చేయాలనే విషయంలో మంతనా లు జరిపారు. 1913లో అదే స్థాయి లో మహాసభ బాపట్లలో జరిగింది. కొండా వెంకటప్పయ్య సలహా మేరకు మొదటి ఆంధ్ర మహాసభ (ఆంధ్ర) బి. ఎస్. శర్మ అధ్యక్షతన జరిగింది. దేశవ్యాప్త ప్రచారం కోసం ఏర్పడిన బృందంలో కొండా వెంకట ప్పయ్యదే ప్రధాన పాత్ర. నెల్లూరులో జరిగిన ఆంధ్ర మహాసభకు ఆయనే అధ్యక్షుడిగా ఉండి ఆంధ్రరాష్ట్ర నిర్మాణానికి నిర్దిష్ట కార్యక్రమం రూపొందించాడు. 1917లో రాజ్యాంగ సంస్కరణల విషయమై పరిశీలనలు జరపడానికి మాంటేగ్ – చమ్స్?ఫర్డ్ ప్రతినిధి వర్గాన్ని ప్రభుత్వం నియమించింది. సదరు ప్రతినిధి వర్గం మద్రాసుకు వచ్చిన. సందర్భంలో భాషా ప్రాతిపదికన రాష్ట్రాల విభజన అవసరాన్ని. నొక్కిచెప్పిన ఆంధ్ర ప్రతినిధులలో కొండా వెంకటప్పయ్య ముఖ్యుడు.

1918లో ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు కమిటీ ఏర్పడింది. రాష్ట్ర సాధనలో ఇది తొలివిజయం కాగా, రాష్ట్ర కాంగ్రెసు కమిటీకి తొలి కార్య దర్శి వెంకటప్పయ్యే. ఆ రోజుల్లో కృష్ణా, గుంటూరు, గోదావరి జిల్లా లు కలసిన నియోజక వర్గం నుంచి పోటీ చేసి కొండా వెంకటప్పయ్య మద్రాసు కౌన్సిలుకు ఎన్నిక య్యాడు. సహాయ నిరాకరణో ద్యమం కొనసాగించడానికి వీలుగా కాంగ్రెసు పార్టీ తన సభ్యుల రాజీనామా కోరగానే కొండా శాసన సభ సభ్యత్వానికి రాజీనామా చేశాడు. తర్వాత ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షుడై భారత జాతీయ కాంగ్రెస్ సభ్యుడయ్యాడు.

1921 మార్చి 31, ఏప్రిల్ 1 తేదీలలో అఖిల భారత కాంగ్రెస్ మహాసభలు బెజవాడలో జరిగగా, మహాత్ముని ఆంధ్ర పర్యటన వెంకటప్పయ్య ఆధ్వర్యంలోనే జరిగింది. వేలాది రూపాయల విరాళాలుగా స్వీకరించి స్వరాజ్య నిధికి సమర్పించాడు. పెదనంది పాడు పన్నుల నిరాకరణోద్యంలో పాల్గొన్నందుకు ఆయన మొదటి సారి జైలు శిక్ష అనుభవించాడు.

1923లో కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైన దేశబంధు చిత్తరంజన్ దాస్ రాజీనామా వల్ల వెంకటప్ప య్యను అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. దుగ్గి రాల గోపాలకృష్ణయ్య అఖిల భారత కాంగ్రెస్ కార్యదర్శి అయ్యా డు. గాంధీజీ తలపెట్టిన ప్రతి ఉద్యమానికి ఆంధ్రలో కొండా వెంక టప్పయ్యే ఆ రోజుల్లో నాయకత్వం వహించేవాడు. ఆంధ్ర ఖద్దరుకు యావద్దేశ ప్రచారం లభించడానికి కొండా వెంకటప్పయ్య కృషి ప్రధాన మైనది.

1929లో సైమన్ కమిషన్ రాక సందర్భంలో, 1930లో ఉప్పు సత్యాగ్రహంలో, 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నందుకు కొండా వెంకట ప్పయ్య జైలు శిక్షలు అనుభవిం చాడు. 1937లో జరిగిన ఎన్నికల్లో అతను మద్రాసు శాసన సభకు ఎన్నికయ్యాడు. భాషా ప్రాతిపదికన మద్రాసు రాష్ట్రాన్ని ఆంధ్ర, తమిళ, కర్ణాటక, కేరళ రాష్ట్రాలుగా విభజిం చాలని కొండా వెంకటప్పయ్య శాసన సభలో ప్రవేశ పెట్టిన తీర్మా నం ఏకగ్రీవంగా నెగ్గింది. ఆంధ్ర రాష్ట్ర ఉద్యమంలో 1920 నుండి 1949లో మరణించే వరకు ఆంధ్ర దేశమే తానుగా వ్యవహరించి ఆంధ్రుల అభిమానానికి పాత్రుడైన గొప్ప వ్యక్తి వెంకటప్పయ్య. ఆంధ్ర రాష్ట్ర హిందీ ప్రచార సభకు కూడా అధ్యక్షుడిగా పని చేశాడు. అఖిల భారత చరఖా సంఘానికి జీవిత కాలం సభ్యుడిగా ఉన్నాడు. గ్రంథాలయోద్యమానికి తోడ్పడ్డాడు. దేశ, రాష్ట్ర రాజకీయాలలో, కాంగ్రెస్ పార్టీ లో తమకంటూ ప్రత్యేక స్థానం ఉన్న కొండా, స్వార్థ రాజకీయ నాయకుల మూలంగా తన ప్రతిభకు, త్యాగానికి సముచిత స్థానం పొందలేక పోయాడు.

కొండా వెంకటప్పయ్య 1949 ఆగష్టు 15 న దేశ స్వాతంత్ర్య దినాన లోకాన్ని ఈ వదిలి వెళ్లాడు. ఆయన వ్యక్తిత్వం నేటి తరానికి ఆదర్శం కావాలి.

**రామ కిష్టయ్య సంగన భట్ల,**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...**
**9440595494**



### సనాతన ధర్మం'పై నా మాటలు


# వక్రీకరించారు..

## అనసూయ పోస్ట్

నటి అనసూయ మరోసారి వార్తల్లో నిలిచారు. ఇటీవల హిందూ ధర్మంపై ఆమె చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. సనాతన ధర్మాన్ని అవమానించారంటూ సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. దీంతో ఈ వ్యవహారంపై అనసూయ (ూఅఖుంబఖు దీష్టృఖుతీఖుసఖుయ) స్పందిస్తూ ఇన్‌స్టా వేదికగా సుదీర్ఘ పోస్టు పెట్టారు. తన వ్యాఖ్యలను కొందరు ఉద్దేశపూర్వకంగా తప్పుదోవ పట్టించారని, తాను ఏ మత విశ్వాసాలనూ కించపర్చేలా మాట్లాడలేదని వివరణ ఇచ్చారు. "నా మాటలను కొందరు కావాలనే వక్రీకరిస్తున్నారు. అందుకే ఈ వివరణ ఇవ్వాల్సి వస్తోంది. నేను మాట్లాడింది కొంతమంది గురించి మాత్రమే. నాపై అభ్యంతర కామెంట్లు చేస్తూ, వ్యక్తిగత దాడులు, బెదిరింపులకు దిగే వాళ్ల గురించే నేను చెప్పాను. అది ఏ మతాన్ని గానీ, వర్గాన్ని గానీ ఉద్దేశిస్తూ చెప్పిన మాట కాదు. నన్ను టార్గెట్ చేస్తున్న వాళ్లకు ఒక విషయం స్పష్టంగా చెప్పాలనుకుంటున్నా. నేను సనాతన ధర్మాన్ని పాటించే హిందువుని. నా ధర్మం, విలువలు, విశ్వాసాల పట్ల నాకు ఎలాంటి చింత లేదు. ధైర్యంగా ఉండటం.. నిజం వైపు నిలబడటం, తప్పును తప్పు అని చెప్పడం, ఎదుటివారిని మనిషిగా గౌరవించడం.. ఇవన్నీ నాకు ధర్మమే నేర్పింది. హనుమాన్ జీ ధైర్యం, బలమే నాకు స్ఫూర్తి. అందువల్ల అన్యాయం జరిగినప్పుడు మాట్లాడకుండా ఉండలేను. నా మాటల నుంచి అసలు విషయం తొలగించి.. సనాతన ధర్మాన్ని అవమానించినట్లుగా వక్రీకరించి ప్రచారం చేయడం సరికాదు. మతం ఆధారంగా నేను ఎవరిపైనా ఓ నిర్ణయానికి రాను. వేధించే వాళ్లను మాత్రమే ప్రశ్నిస్తా. అందువల్ల ఎడిట్ చేసిన క్లిప్‌లు, సగం సగం కథనాల వలలో పడకండి. అన్ని విషయాలు తెలుసుకున్న తర్వాతే ఓ అభిప్రాయానికి రండి" అని అనసూయ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు.

### 16న ఇరుముడి

# ప్రీరిలీజ్ వేడుక



మాస్ మహారాజా రవితేజ నటిస్తున్న తాజా చిత్రం 'ఇరుముడి' శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలున్నాయి. కాగా, ఈ చిత్రానికి సంబంధించి మేకర్స్ ఒక క్రేజీ అనౌన్స్‌మెంట్ ఇచ్చారు.

సినిమా విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో చిత్ర యూనిట్ ప్రమోషన్ కార్యక్రమాలను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా ఆగస్టు 16న హైదరాబాద్‌లోని శిల్పకళా వేదిక వేదికగా 'ఇరుముడి' ప్రీ రిలీజ్ వేడుకను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. రవితేజ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'మల్లెపూల పల్లకి' పాటను విడుదల చేయనున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన ట్రైలర్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటూ యూట్యూబ్‌లో ట్రెండ్ అవుతోంది. భక్తి, కుటుంబ భావోద్వేగాలు, యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా వస్తున్న ఈ చిత్రంలో ప్రియా భవాని శంకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. మైత్రి మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యర్నేని, వై. రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మించారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో థియేటర్లలో విడుదల కానుంది.

# విశ్రాంతిని ఎంజాయ్ చేస్తున్న రష్మిక

# Rashmika




టాలీవుడ్ ప్రముఖ నటి రష్మికా మందన్నా ప్రస్తుతం గాయం కారణంగా సినిమాలకు దూరంగా ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలిసిందే. అయితే ఈ రెస్ట్ సమయంలో తన ఆలోచనల్లో వచ్చిన మార్పుల గురించి ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్న ఒక పోస్ట్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. ఎప్పుడూ తీరిక లేకుండా ఉరుకులు పరుగులతో బిజీగా గడిపేవారికి, ఒక్కసారిగా పనులు ఆపేసి విశ్రాంతి తీసుకోవడం మొదట్లో చాలా భయంగా అనిపిస్తుందని రష్మిక తెలిపారు. అయితే, తప్పనిసరి పరిస్థితుల్లో అలా విశ్రాంతి తీసుకోవాల్సి వస్తే.. గతంలో అలా పిచ్చివాళ్లలా పనుల వెనకే పరిగెత్తిన దినాలు ఇప్పుడు తలచుకుంటే మరింత భయంగా అనిపిస్తాయని, బహుశా జీవితం అంటే ఇదేమో అని ఆమె పేర్కొన్నారు. ఎలాంటి అలారాలు పెట్టుకోకుండా శరీరం కోరిన సమయానికి లేవడం, రోజుకు రెండు పూటల మితంగా భోజనం చేయడం, తన పెంపుడు కుక్క 'ఆరా'తో సమయం గడపడం చేస్తున్నట్లు తెలిపారు. అలాగే పుస్తకాలు చదవడం, పజిల్స్ చేయడం, ఇష్టమైన షోలు చూడటంతో పాటు పాత ఫోటోలు, వీడియోలను నెమరువేసుకుంటూ ప్రశాంతంగా గడుపుతున్నానని చెప్పారు. ఈ కష్టకాలంలో తాను త్వరగా కోలుకోవాలని కోరుకుంటూ అభిమానులు, శ్రేయోభిలాషులు పంపిస్తున్న ప్రార్థనలకు, చూపుతున్న ప్రేమానురాగాలకు ఆమె హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. రవీంద్ర పుల్లె దర్శకత్వంలో వస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'మైసా' చిత్ర షూటింగ్‌లో భాగంగా ఒక డ్యాన్స్ సీక్వెన్స్ చేస్తుండగా రష్మిక తుంటి భాగంలో గాయమైంది. వైద్యుల సూచన మేరకు ఆమె కొన్ని వారాల పాటు విశ్రాంతి తీసుకోవాల్సి రావడంతో ప్రస్తుతం పూర్తిగా ఇంటికే పరిమితమయ్యారు.

## శ్రీను వైట్ల దర్శకత్వంలో శర్వానంద్

టాలీవుడ్‌లో మరో ఆసక్తికరమైన క్రేజీ కాంబినేషన్ అధికారికంగా పట్టాలెక్కింది. వైవిధ్యమైన కథలతో ప్రేక్షకులను అలరించే చార్మింగ్ హీరో శర్వానంద్, విలక్షణమైన కామెడీ టైమింగ్‌తో కూడిన ఎంటర్‌టైనర్లను తెరకెక్కించే ప్రముఖ దర్శకుడు శ్రీను వైట్ల దర్శకత్వంలో తొలిసారిగా కలిసి పనిచేస్తున్నారు. వీళ్లిద్దరి కలయికలో రాబోతున్న ఈ సరికొత్త ప్రాజెక్ట్‌పై టాలీవుడ్ వర్గాల్లో మరియు ప్రేక్షకుల్లో ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. అనిల్ సుంకర నిర్మాణంలో ప్రముఖ నిర్మాణ సంస్థ ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై ఈ చిత్రం తెరకెక్కుతుండగా తాజాగా ఈ సినిమా టైటిల్‌తో పాటు పూజా కార్యక్రమాలు ఘనంగా జరుపుకున్నారు. ఇక ఈ సినిమాకు మేకర్స్ 'జార్జ్ క్రిష్' అనే క్రేజీ టైటిల్‌ను ఖరారు చేశారు. శ్రీను వైట్ల మార్క్ ఎంటర్‌టైన్‌మెంట్, శర్వానంద్ ఎనర్జిటిక్ యాక్టింగ్ ఈ సినిమాకు ప్రధాన హైలైట్‌గా నిలవనున్నాయి. సినిమా ప్రారంభోత్సవ రోజే విడుదల తేదీని ప్రకటించి మేకర్స్ అందరినీ ఆశ్చర్యపరిచారు. ఇక ఈ పూర్తి స్థాయి వినోదాత్మక చిత్రాన్ని వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు.



# Samantha Ruth Prabhu

### రెండు జతల డ్రెస్‌లతో

# హాలీడే ట్రిప్..

## క్యూట్ ఫొటో పంచుకున్న సమంత

నటి సమంత ప్రస్తుతం ప్రెగ్నెన్సీలో ప్రతి క్షణాన్నీ ఆస్వాదిస్తున్నారు. ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే సామ్.. తాజాగా ఓ క్యూట్ ఫొటోను పంచుకున్నారు. "నా దగ్గర చాలా డ్రెస్‌లు ఉన్నాయి. కానీ, ఇప్పుడు నాకు అవేవీ సరిపోవడం లేదు. ఆ విషయం తెలిసి 'మినీ బ్రేక్‌డౌన్' వచ్చింది. రెండు సెకన్లు కంగారు పడ్డాను. ఏది ఏమైనా.. ఈ హాలిడేకి కేవలం 2 జతల డ్రెస్‌లు మాత్రమే సర్దేస్తున్నా" అంటూ క్యాప్షన్ ఇచ్చారు. ప్రస్తుతం ఈ ఫొటో వైరల్ అవుతోంది.

**'టాక్సిక్'.. కియారాకు బాడీగార్డ్‌లా ఉన్నా: యశ్**

ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాతృత్వం గురించి సమంత మాట్లాడారు. తాను ఈ క్షణాల కోసం ఎంతో ఎదురుచూసినట్లు చెప్పారు. "అమ్మ' అనే పిలుపు కోసం ఎంతో పరితపించాను. . ఈ ప్రయాణంలో ప్రతి క్షణాన్ని ఆస్వాదిస్తున్నాను. ప్రతి రోజూ కొత్తగా అనిపిస్తోంది" అని అన్నారు. ప్రస్తుతం సమంత కొంతకాలం సినిమాల నుంచి విరామం తీసుకున్నారు.

singidinews@gmail.com

Printed,published & Owned by P. Sunitha Reddy on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Dussa Shivaprasad, PRGI.NO. TGTEL/26/A4370. Cell 8179799090